# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 98 | హైదరాబాద్ | బుధవారం 1-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

విజయ్ పార్టీ నేత 'విప్లవం' పోస్ట్.. తమిళ రాజకీయాల్లో పెనుదుమారం!



11లో

## సైబర్ నేరాలపై అవగాహన లేక చాలామంది నష్టపోతున్నారు

- నగరంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామన్న సజ్జనార్
- సైబర్ నేరాలాపు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన
- ప్రముఖులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయవద్దని సూచన

## ముఖ్యమంత్రిని కలిసిన క్రికెటర్ తిలక్ వర్మ..

### రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్ బహూకరణ

- జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో కలిసిన క్రికెటర్
- తిలక్ వర్మను అభినందించి, సన్మానించిన ముఖ్యమంత్రి
- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి సీఎంను కలిసిన తిలక్ వర్మ

11లో



## నేటి భారతం

- ప్రజాసుఖే సుఖం రాజ్యం: ప్రజానాం చ హితే హితమ్| నాత్మప్రియం హితం రాజ్యం: ప్రజానాం తు ప్రియం హితమ్ ||
- ప్రజల సంతోషం పాలకుని సంతోషం కావాలి. ప్రజల సంక్షేమమే పాలకుని సంక్షేమం కావాలి. తన దేశ ప్రజల అభివృద్ధి మరియు సంక్షేమాన్ని చూసుకోవడం పాలకుని యొక్క ముఖ్య కర్తవ్యం కావాలి అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుంది.
- నేడు జరుగుతున్న పరిస్థితులు దీనికి విరుద్ధంగా.. నేను ఎంత దోచుకోవాలి అని పాలకులు పోటీ పడుతున్నారు...
- ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయి తస్మాత్ జాగ్రత్త...

- వి.జీ.

## హైదరాబాద్ లోని 'తెలుగు తల్లి' ఫ్లైఓవర్ పేరు మారింది!

- 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్ గా పేరు మార్పు
- పేరు మారుస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- కొత్త పేరుతో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

హైదరాబాద్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) :హైదరాబాద్ లోని కీలకమైన ఫ్లైఓవర్లలో ఒకటైన 'తెలుగు తల్లి' ఫ్లైఓవర్ పేరు మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్ పేరును 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త పేరుతో కూడిన బోర్డును సైతం ఫ్లైఓవర్ వద్ద

తరువాయి 11లో






11లో

## కోస్తాంధ్రకు వర్ష సూచన... ఎల్లో అలర్ట్ జారీ

- 24 గంటల్లో అల్పపీడనంగా మారనున్న ఉపరితల ఆవర్తనం
- ఉత్తర కోస్తాలో భారీ వర్షా లకు అవకాశం
- ప్రకాశం బ్యారేజ్‌కు రెండో ప్రమాద హెచ్చరిక

## కోర్టులో చెల్లదని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారు

- ఎవరిని మోసం చేయడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ప్రశ్న
- బీహార్, మహారాష్ట్రలలో రిజర్వేషన్లపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని వెల్లడి
- కోర్టుకు వెళ్లవద్దని మంత్రులు చెబుతున్నారు.. వెళితే అభ్యంతరమేమిటని ప్రశ్న



11లో

## 54 ప్రైవేటు వర్సిటీలకు యూజీసీ నోటీసులు




11లో

- నిబంధనలు ఉల్లంఘించిన 54 ప్రైవేట్ వర్సిటీలకు యూజీసీ నోటీసులు
- వెబ్‌సైట్లలో తప్పనిసరి సమాచారాన్ని పెట్టకపోవడంపై ఆగ్రహం
- పలుమార్లు హెచ్చరించినా స్పందించని యూనివర్సిటీలు
- విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల కోసమే ఈ చర్యలన్న యూజీసీ
- వెంటనే వివరాలు అప్‌లోడ్ చేయాలని స్పష్టమైన ఆదేశం
- జాబితాలో పలు రాష్ట్రాల్లోని ప్రముఖ ప్రైవేట్ యూనివర్సిటీలు

## ప్రఖ్యాత కంపెనీ ఎయిర్ బస్ కోసం ఏపీ ముందడుగు



11లో

- ఎయిర్‌బస్ బోర్డుతో ఢిల్లీలో మంత్రి నారా లోకేశ్ ఉన్నత స్థాయి సమావేశం
- ఏపీలో విమానాల తయారీ యూనిట్ ఏర్పాటుకు కీలక ప్రతిపాదన
- ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ పరిశ్రమల క్లస్టర్ ఏర్పాటుపై చర్చ
- రాష్ట్ర ఏరోస్పేస్ పాలసీ, వేగవంతమైన అనుమతులపై లోకేశ్ వివరణ
- ఏపీని ఏరోస్పేస్ ఎగుమతుల హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

## వెనుకబడిన ప్రాంతాలకు ఆ నిధులే కీలకం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- పూర్వోదయ పథకం కింద ఏపీకి నిధులు కేటాయించాలని వినతి
- రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు అత్యవసరం అని వెల్లడి
- రాష్ట్రంలోని ప్రాజెక్టుల ప్రణాళికలను వివరించిన ముఖ్యమంత్రి
- పోలవరం పురోగతిపై కేంద్ర జలశక్తి మంత్రితోనూ చర్చలు



11లో


# సంపాదకీయం

## ఓ వైపు జాతీయ వాదం.. మరో వైపు విభజనవాదం

భారతదేశం ప్రస్తుతం రెండు వ్యతిరేక దిశల్లో పయనిస్తోంది. ఒకవైపు జాతీయవాద భావనలు బలపడుతుండగా, మరోవైపు విభజన శక్తులు కూడా ఊపందుకుంటున్నాయి. ఈ విరుద్ధతలు సమాజంలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. దేశవ్యాప్తంగా జాతీయవాద భావనలు పటిష్టమవుతున్నాయి. విద్యా సంస్థల్లోనూ ఈ పోకడ స్పష్టంగా కనిపిస్తోంది. దక్షిణాది నుంచి ఉత్తరాది వరకు, ప్రముఖ యూనివర్శిటీల్లో జాతీయ భావనలతో కూడిన సంఘాలు విజయాలు సాధిస్తున్నాయి. ఇది కేవలం విద్యార్థి రాజకీయాలకే పరిమితం కాదు.. స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీలు మరియు పార్లమెంటరీ ఎన్నికల్లో కూడా జాతీయవాద పార్టీలు తమ ఆధిక్యతను నిరూపిస్తున్నాయి. అంతేకాకుండా, ధార్మిక జాగృతి ఒక ఉద్యమ రూపం దాలుస్తోంది. ఆలయ పర్యటనలు పెరుగుతున్నాయి, భక్తుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతోంది. ఈ ధోరణి సమాజంలో ఐక్యతను ప్రోత్సహిస్తుంది, కానీ దీనిని విచ్ఛిన్న శక్తులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. జాతీయవాదం బలపడటం దేశ ఐక్యతకు బలమిస్తుంది, అయితే ఇది అతివాద రూపాలు దాల్చకుండా చూడాలి. జాతీయవాదం పెరుగుతున్నప్పటికీ, దీనికి విరుద్ధంగా కులం, మతం ఆధారిత విభజనలు కూడా బలపడుతున్నాయి. రాష్ట్ర స్థాయి, జాతీయ ఎన్నికల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయాలకే పరిమితం కాదు.. సామాజిక స్థాయిలో కూడా విష సంస్కృతిని ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలు చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయి. గతంలో పెద్ద నగరాలకే పరిమితమైన ఈ సమస్య, ఇప్పుడు గ్రామీణ మరియు చిన్న పట్టణాల్లోనూ వ్యాపిస్తోంది. వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు డిజిటల్ మాధ్యమాల ద్వారా విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నట్లు బయటపడుతోంది. ఈ విభజనలు సమాజ ఐక్యతను బలహీనపరుస్తాయి. ఇవి దీర్ఘకాలిక సవాళ్లను సృష్టిస్తాయి. దేశంలో మత ఆధారిత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. ప్రముఖ నగరాల్లో విదేశీ భావనలతో కూడిన నినాదాలు, చిహ్నాలు కనిపిస్తున్నాయి, ఇది దేశీయ ఐక్యతకు హానికరం. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఇలాంటి చర్యలకు మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఫలితంగా అల్లర్లు, హింసాత్మక సంఘటనలు పెరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఈ సమస్యలు తీవ్రమవుతున్నాయి. మత సంబంధిత చిహ్నాలు నినాదాలు హింసకు దారితీస్తున్నాయి. స్థానిక సంస్కృతి, పండుగలపై అభ్యంతరాలు లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాలు కూడా జోక్యం చేసుకోవాల్సి వస్తోంది. ఈ ధోరణి మత సామరస్యాన్ని దెబ్బతీస్తుంది.. సమాజంలో భయాందోళనలను పెంచుతుంది. ఈ విద్వేషాల వెనుక కొన్ని విచ్ఛిన్నకర గ్రూపులు, బయటి ప్రభావాలు ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగు దేశాల్లో రాజకీయ మార్పులు జరిగిన తరహాలో, భారతదేశంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్న గ్రూపులు స్థానిక స్థాయిలో ప్రభావం చూపుతూ, జాతీయ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక ఘటనల సమయంలో కూడా ఇలాంటి నినాదాలు, చర్యలు కనిపిస్తున్నాయి, ఇది ఒక వ్యూహాత్మక ప్యాటర్న్‌ను సూచిస్తుంది. ఈ గ్రూపులు సమాజాన్ని విభజించడం ద్వారా దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ప్రభావాలు దీర్ఘకాలంలో దేశ భద్రతకు ముప్పు కలిగిస్తాయి. జాతీయవాదం, విచ్ఛిన్న శక్తుల మధ్య ఈ సంఘర్షణ దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. ఐక్యతను పటిష్టం చేస్తూ, విభజనలను అరికట్టడం అవసరం. లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు స్థానికులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. అయితే కొద్ది కాలంలోనే రాష్ట్ర హోదా కోసం డిమాండ్ ప్రారంభమైంది. ఇది సహజసిద్ధమైన స్థాని క హక్కుల పోరాటం కాకుండా, ప్రణాళికబద్ధమైన రాజకీయ తద్వారా అంతర్జాతీయ దష్టి ఆకర్షించాలనే ప్రయత్నం అని చెప్పవచ్చు. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చూ, ఈ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఎదిగారు. ఆయన నడిపిన సంస్థలకు లైసెన్స్ రద్దు కావడమే మొదటి ఘర్షణ. వాంగ్‌చూ తండ్రి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి కావడం వలన ఆయన రాజకీయ నేపథ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం. ఆయన సంస్థలకు ఇచ్చిన భూమి లీజు రద్దు తరువాత ఆయన క్రమంగా రాష్ట్ర హోదా ఉద్యమం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ? ఒక విద్యా, సాంస్కృతిక కార్యకర్త ఒక్కసారిగా ఎందుకు హింసాత్మక ఉద్యమానికి పూనుకుంటారు? సమాధానం ? ఒకవైపు వ్యక్తిగత నష్టం, మరోవైపు రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న వ్యూహం. లడఖ్ ఉద్యమాన్ని కేవలం స్థానిక అసంతృప్తిగా చూడటం తేలికైన నిర్ణయమే అవుతుంది. వాంగ్‌చూ ప్రసంగాలు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల తీరును పోలి ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇక అరెస్ట్ అయిన వారిలో కొందరు నేపాల్‌కు చెందినవారు కావడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది. చిన్నచిన్న ప్రాంతాల్లో హింస చెలరేగించడం ద్వారా ప్రపంచ మీడియా అటెన్షన్ పొందాలన్న గ్లోబల్ ప్రొటెస్టు మోడల్ ఇక్కడ ప్రయోగించినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వాలు, సమాజం, విద్యా సంస్థలు కలిసి ఈ సవాళ్లను ఎదుర్కోవాలి. విచ్ఛిన్నకర శక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సమతుల్యమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదు.. సామాజిక బాధ్యత కూడా..!

# ఎక్కడో తగ్గాలో... నెగ్గాలో
## దీటీజ్ చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబర్ 30(భారత శక్తి):
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత. ఆయన పార్టీని గత నాలుగు దశాబ్దాల నుంచి ఒంటిచేత్తో నడిపిస్తున్నారు. నాలుగుసార్లు అధికారంలోకి తేగలిగారు. కూటమితో నెగ్గారని కొందరు విమర్శించవచ్చు కానీ, ఆ కూటమిలోని మిత్ర పక్షాల ఇగోలను సంతృప్తి పరుస్తూ, వారు నొచ్చుకోకుండా నిర్ణయాలు తీసుకుంటూ తాను అనుకున్న పనులు చేసుకుంటూ ముందుకు వెళ్లే నేతల్లో చంద్రబాబు నాయుడు ముందుంటారు. ఎందుకంటే చంద్రబాబు నాయుడుకు రాజకీయాలు ఎలా ఉంటాయో తెలుసు. తమ బలం.. ఎదుటి వారి బలహీనత.. ప్రత్యర్థికి అందిపుచ్చుకునే అవకాశం ఇవ్వకపోడం వంటి వాటిల్లో చంద్రబాబును మించిన నాయకుడు మరొకరు ఉండరు. నిజానికి ఎన్నడూ లేనిది కూటమి ప్రభుత్వానికి అధినేతగా ఉన్న చంద్రబాబు నాయుడు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తన పరిధిలో ఉన్నంత వరకూ కూటమిలోని మిత్ర పక్షాలకు తగిన గౌరవంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాలుగా పదవులు ఇవ్వడంలో చంద్రబాబు నాయుడు వెనకాడరు. కేంద్ర ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకున్నా మోదీని ఇబ్బంది పెట్టకుండా తన మద్దతు అవసరం అని తెలిసినప్పటికీ కేవలం రెండు కేంద్ర మంత్రి పదవులతోనే సరిపెట్టుకున్న చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి అసవరమైన నిధులను, ప్రాజెక్టులను తేవడంలో కొంత సక్సెస్ అయ్యారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరగాలంటే కేంద్రంతో కయ్యం కంటే స్నేహం మంచిదని భావించి గొంతెమ్మ కోరికలకు పోకుండా తగ్గి ఉంటూ అన్నీ తెచ్చుకుంటున్నారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన పరిణామాలకు చంద్రబాబు నాయుడు బాధ్యుడు కారు. బొండా ఉమామహేశ్వరరావు కానీ, నందమూరి బాలకృష్ణ కానీ చేసిన వ్యాఖ్యలు కూటమిలోని మిత్రపక్షాలను ఇబ్బందిపెట్టే విధంగా ఉన్నాయి. అందుకే చంద్రబాబు నాయుడు తానే నడుంబిగించారు. నిన్న మధ్యాహ్నం మూడు గంటలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. వైరల్ ఫీవర్ బాధపడుతూ హైదరాబాద్ లోని తన నివాసంలో ఉన్న పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నందమూరి బాలకృష్ణ చిరంజీవి పై చేసిన కామెంట్స్ పై కూడా ఆయన వివరణ ఇచ్చినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్ మనసు నొచ్చుకోకుండా చంద్రబాబు తగ్గి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఏడు పదులు దాటిన వయసులో ఆయన తనవద్దకు రావడంతో పవన్ కల్యాణ్ కూడా కూల్ అయినట్లు తెలిసింది. దటీజ్ చంద్రబాబు.



రికార్డుల నుంచి తొలగింపు

హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తాను చేసిన వ్యాఖ్యలను సాధారణ కామెంట్స్ గానే తీసుకున్నారు. పైగా తాను అన్నదాంట్లో తప్పేముందని ప్రశ్నించినట్లు తెలిసింది. తాను ఉన్న మాటలే మాట్లాడానని, అక్కడ జరిగిన విషయాన్ని కొందరు సభ్యులు సభతో పాటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంటే తాను ఉండబట్టలేక నిజం చెప్పాల్సి వస్తుందని టీడీపీ నాయకత్వం ముందు తన వాదనను వినిపించినట్లు సమాచారం. వాస్తవానికిశాసనసభలో బాలయ్యచేతనే తాను చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేశారని తెలిసింది. అయితే అందుకు బాలకృష్ణ అంగీకరించలేదని పార్టీ నేతలు ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. అందుకే ఇక కామినేని శ్రీనివాస్ చేత శాసనసభలో జీరో అవర్ లో ఇటీవల తన సభలో ప్రస్తావించిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిప్యూటీ స్పీకర్ ను కోరారు. తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి కనుక ఆ వ్యాఖ్యల సందర్భంగా జరిగిన వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించాలని టీడీపీ నాయకత్వం కామినేని శ్రీనివాస్ చేత చెప్పించినట్లు తెలిసింది. దీంతో కామినేని శ్రీనివాస్ విజ్ఞప్తితో సభలో చేసిన వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించారు. మొత్తం సినీరంగంపై చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించారు. రికార్డుల నుంచి సినీరంగంపై వ్యాఖ్యల తొలగింపును జనసేన పార్టీ కూడా స్వాగతించడం విశేషం. అంటే బాలకృష్ణ చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. మరొకవైపు సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా నందమూరి బాలకృష్ణ ఎవరినీ అవమానించలేదని అన్నారు. గత ప్రభుత్వంలో నలిగిన ప్రతి సినిమా వాడి కోసం ఆయన గళమెత్తారన్నారు. ఆ ఆవేశం ఎవరిమీద కాదు.. టాలీవుడ్ గౌరవం కోసమేనని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బాలకృష్ణను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే బాలకృష్ణ వ్యాఖ్యలు అప్పటికే రాజకీయదుమారం కావడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటనచేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఒక టీమ్ అని, టీమ్‌లో ఏ ఒక్కరు తప్పు చేసినా చాలా నష్టం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు పర్సనల్ అజెండాలు పెట్టుకుని మాట్లాడితే మన లక్ష్యానికి విఘాతం కలుగుతుందని అన్నారు. నందమూరి బాలకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోబోనని చెప్పడంతోనే కామినేనిని సహకారంతో ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. తాను కూడా సభలో అందరితో పాటు బాలకృష్ణకు కూడా పరోక్షంగా వార్నింగ్ ఇచ్చినట్లయిందని అంటున్నారు.

# తిరుమలలో మరో వివాదం
## అన్నను ఇరికిస్తున్న షర్మిల

విజయవాడ, సెప్టెంబర్ 30(భారత శక్తి):
షర్మిల మరోసారి తేనె తుట్టను కదిపారు. కూటమిని నిలదీసే క్రమంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ చర్యలను బయటపెట్టారు. రెండు రోజుల కిందట తిరుమలను సందర్శించారు ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్రవ్యాప్తంగా టీటీడీ తరపున 5 వేల ఆలయాలు నిర్మిస్తామని ప్రకటించారు. దళిత వాడలతో పాటు ఎస్సీ కాలనీలో వాటిని నిర్మించడం ద్వారా సనాతన ధర్మంతో పాటు హిందూ సాంప్రదాయాలను విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు పిసిసి అధ్యక్షురాలు షర్మిల. దళిత వాడల్లో గుడులు కట్టడం ఏంటని నిలదీసినంత పని చేశారు. వాటిని రాష్ట్ర అభివృద్ధి కోసం ఖర్చు చేయవచ్చు కదా అని సలహా ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో దీనిని అడ్డుకుంటామని హెచ్చరించారు. దీనిపై హిందూ ధార్మిక సంఘాలు, హిందుత్వవాదులు, స్వామిజీలు మండిపడుతున్నారు. షర్మిల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో జరిగిన పరిణామాలను గుర్తు చేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అనేది ఒక హిందూ ధార్మిక సంస్థ. ప్రపంచవ్యాప్తంగా ఉండే హిందువులు, శ్రీవారి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. టీటీడీకి ప్రతి ఏటా వేలకోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. అదే సొమ్ముతో టీటీడీ ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ముఖ్యంగా దేవాలయాల నిర్వహణ, ఆసుపత్రుల ఏర్పాటు, సత్రాల నిర్మాణం వంటివి చేపడుతూ వస్తోంది. అందులో భాగంగానే దళితవాడలు, ఎస్సీ కాలనీల్లో ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు ఏపీ సీఎం చంద్రబాబు. కానీ దానిని తప్పుపట్టారు. అదంతా ప్రభుత్వ సొమ్ముగా చెప్పుకొచ్చారు. సెక్యులరిజం ప్రభుత్వం నడుస్తోందని తీవ్ర పదజాలం వాడారు. అయితే ఇప్పుడు షర్మిలపై హిందుత్వవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసిపి హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 25 వేల చర్చిలు ప్రభుత్వ స్థలాల్లో నిర్మితమయ్యాయని ఆరోపిస్తున్నారు. వైసీపీ హయాంలో అన్యమత ప్రచారం పతాక స్థాయికి చేరిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. చర్చిలతో పాటు ముస్లిం ప్రార్థనలయాలకు భారీ ఎత్తున నిధులు కేటాయించడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. అటువంటి కుటుంబం నుంచి వచ్చిన షర్మిల తీరు అలానే ఉంటుందని మండిపడుతున్నారు. అక్కడితో ఆగడం లేదు. ఆస్తి వివాదం నేపథ్యంలోనే అన్నను విభేదించారని.. బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఇద్దరూ సంపాదించిన ఆస్తులు లక్షల కోట్లలో ఉంటాయని.. వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించవచ్చు కదా? పేద ప్రజలకు ఉపయోగించవచ్చు కదా? అని డిమాండ్ చేస్తున్నారు. షర్మిల తాను వివాదం చేయడమే కాక.. అదే వివాదంలో తన సోదరుడు జగన్మోహన్ రెడ్డిని సైతం తెస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. తద్వారా గత ప్రభుత్వ హయాంలో అన్యమత ప్రచారం, ప్రాధాన్యత ఎక్కువైందని చెప్పించే ప్రయత్నమా? అన్న అనుమానాలకు కూడా ఉన్నాయి. ఎందుకంటే ఇప్పటికీ జగన్మోహన్ రెడ్డి పై అదే ఆగ్రహాన్ని



కొనసాగిస్తున్నారు షర్మిల. ఇప్పుడు హిందూ దేవాలయాలపై వ్యాఖ్యానించడం ద్వారా.. జగన్ చర్యలను గుర్తు చేసేలా ఆమె వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## 16న నంద్యాలకు మోడీ

కర్నూలు, సెప్టెంబర్ 30(భారత శక్తి):
నరేంద్ర మోడీ ఏపీ పర్యటనకు రానున్నారు. ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారు అయింది. అక్టోబర్ 16న కర్నూలు జిల్లా నంద్యాలలో పర్యటించనున్నారు. శ్రీశైలం ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. పురావస్తు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో సర్ప్రైజ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అదే రోజు కూటమినేతలతో కలిసి ప్రధాని రోడ్ షోలో పాల్గొంటారు. దీంతో ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది రాష్ట్ర ప్రభుత్వం. పక్కాగా ప్లాన్ చేస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అనేక కొత్త అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తారు. ఇప్పటికే పూర్తయిన కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను కూడా ప్రారంభిస్తారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆ చరిత్రను వివరించేందుకు పురావస్తు శాఖ ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తోంది. శ్రీశైలం చారిత్రక ప్రాధాన్యాన్ని ఆయనకు వివరించేందుకు పురావస్తు శాఖ అధికారులు ఒక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. సీఎం కార్యాలయ ఆదేశాల మేరకు తామ్ర శాసనాలతో ఈ ప్రదర్శనను సిద్ధం చేస్తున్నారు. 2021లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా శ్రీశైలం వచ్చినప్పుడు కూడా ఇలాంటి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శ్రీశైలం ఆలయంలో క్రీస్తు శకం 13వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు లభించిన అనేక తామ్ర శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలు ఆలయ చరిత్రను వివరిస్తాయి. వాటి గురించి ప్రధాని నరేంద్ర మోడీకి వివరించనున్నారు పురావస్తు శాఖ అధికారులు. అప్పట్లో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని రాజులు సందర్శించేవారు. భారీగా విరాళాలు ఇచ్చేవారు.

# ఏపీలో 18 నగర వనాలు

అనంతపురం, సెప్టెంబర్ 30(భారత శక్తి):
ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కేంద్రానికి కీలక ప్రతిపాదన చేసింది. రాష్ట్రంలో కొత్తగా 18 నగర వనాలను ఏర్పాటు చేయాలని కోరింది. అన్ని నియోజకవర్గాల్లో నగర వనాలు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం దిశగా ఇప్పటికే పనులు జరిగాయి. ఇప్పటివరకు 54 నియోజకవర్గాల పరిధిలో 61 పార్కులకు అనుమతి లభించింది. వీటిలో 18 పార్కులను ఇప్పటికే ప్రజల కోసం ప్రారంభించారు. మరో 10 పార్కులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన 33 చోట్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కేంద్రం ఆమోదం తెలిపిన వెంటనే 11 జిల్లాల పరిధిలోని 14 నియోజకవర్గాల్లో ఈ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఇది రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే పెద్ద ప్రణాళికలో భాగమని చెబుతున్నారు అధికారులు. ఇప్పటివరకు మంజూరైన వాటికి అదనంగా, ఇప్పుడు మరో 18 నగర వనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఈ కొత్త పార్కులను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, నెల్లూరు, తిరుపతి, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఒక్క నగరవనం కూడా ఏర్పాటు కాలేదు. మాచర్ల ప్రజలుఈ జిల్లాల్లో నగర వనాల కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రతిపాదనలపై కసరత్తు జరుగుతోంది.

ఈ మేరకు ప్రతిపాదనలు పంపాలని ఇటీవల అటవీశాఖ ఆయా జిల్లాల కలెక్టర్లను కోరింది. బాపట్ల, బాపట్ల జిల్లా చీరాల, శ్రీసత్యసాయి జిల్లా కల్యాణదుర్గం, చిత్తూరు జిల్లా కుప్పం, గజరామం, అనంతపురం, కడప జిల్లా బద్వేల్, కర్నూలు జిల్లా ఆదోని పట్టణం, కర్నూలు జిల్లా డోన్, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ, శ్రీ సత్యసాయి ఎకోపార్క్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ పార్కుల ద్వారా వాతావరణ కాలుష్యానికి చెక్ పెట్టొచ్చంటున్నారు అధికారులు. అందుకే ప్రభుత్వం ఈ నగర వనాలపై ఫోకస్ పెట్టింది. కేంద్రం సహకారంతో ప్రతి నియోజకర్గంలో ఈ పార్క్‌లను ఏర్పాటు చేసేలా ప్లాన్ చేసింది.

# సహాయ నిరాకరణలో సచివాలయ ఉద్యోగులు



ఒంగోలు, సెప్టెంబర్ 30(భారత శక్తి):
ఏపీలో ఉద్యోగుల సంక్షేమం కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదా? వార్డు-గ్రామ సచివాలయ ఉద్యోగులు పోరుబాటకు రెడీ అవుతున్నారా? దీని వెనుక అసలేం జరిగింది? వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడమే కారణమా? అక్టోబర్ ఒకటిన పింఛన్లు పంపిణీకి దూరంగా ఉండాలని ఉద్యోగులు డిసైడ్ అయ్యారా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఏపీలో ఏడాదిగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయంటే అందుకు కారణం వార్డు-గ్రామ సచివాలయ ఉద్యోగులు. ఇప్పుడు ఆ ఉద్యోగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు జేఏసీగా ఏర్పడ్డారు. అంచెలంచెలుగా కార్యాచరణను మొదలుపెడుతున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ ఉద్యోగులు పోరుబాటకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోనున్నారు. తాజాగా అందుకున్న సమచారం మేరకు చాలా జిల్లాల్లో ఉద్యోగులు వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అయినట్టు తెలుస్తోంది. ఒకవిధంగా చెప్పాలంటే ఇదొక సహాయ నిరాకరణగా చెబుతున్నారు. ప్రస్తుతం గ్రామ-వార్డు సచివాలయం కేంద్రంగా సుమారు 13 శాఖలకు సంబంధించిన పని చేస్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఇప్పటివరకు పైస్థాయి అధికారులు మెల్ల మెల్లగా ఆ ఉద్యోగులపై పని భారం పెంచే ప్రయత్నం చేశారు.. చేస్తున్నారు కూడా. కేవలం మాతృ శాఖ పనులు కాకుండా డోర్ టూ డోర్ సర్వేలు చేయిస్తున్నారుసర్వేల పేరుతో ప్రతీ ఇంటికి వారానికి రెండుమూడు సార్లు వెళ్తున్నట్లు చెబుతున్నారు. దీనివల్ల చాలామంది ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. పింఛన్ల పంపిణీ వ్యవహారం కత్తి మీద సాముగా మారింది. ఉదయం ఏడు గంటలకు పింఛన్ల పంపిణీ అయితే తెల్లవారుజాము నుంచే పైస్థాయి అధికారులు ఫోన్లు చేసి ఫీల్డ్‌లో ఉన్నారా? లేరా అంటూ వేధించడం మొదలుపెడుతున్నారని చెబుతున్నారు. నెట్ సదుపాయాలు లేని ప్రాంతాల్లో తమకు తెలీదు.. ఏదో ఒకటి చేయాలంటూ ఉద్యోగులపై పైస్థాయి అధికారులు ఒత్తిడి చేస్తున్నారట. పింఛన్ల పంపిణీ పూర్తి కాగానే, ఆఫీసుకొచ్చి పెండింగ్‌లో ఉన్న పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు. పంచాయతీ సెక్రటరీల నుంచి ఎంపిడిఓలు, ఆ తర్వాత అన్ని శాఖల అధికారుల అజమాయిషీ కొనసాగడంపై తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఇతర శాఖల అదనపు పనులు తప్పించాలని చాన్నాళ్లుగా వేడుకుంటున్నారు. అలాగే తమకు ఇచ్చే వేతనాలు మాతృ సంస్థ చెల్లించేలా పలు డిమాండ్లతో రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ రెడీ చేశారు. ఈ నేపథ్యంలో దశలవారీగా ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారట. ఈనెల 29 అంటే సోమవారం లోపు చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. లేకుంటే అక్టోబర్ ఒకటిన సామాజిక పింఛన్లను పంపిణీ చేయబోమని ఇప్పటికే ఆ ఉద్యోగుల జేఏసీ నోటీసు ఇచ్చింది. అంతేకాదు కొన్ని జిల్లాల్లో సిబ్బంది ఇప్పటికే తమ నిరసన వ్యక్తం చేస్తూ అధికారిక వాట్సాప్ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అవుతున్నారు. ఈ లెక్కన అక్టోబరు ఒకటిన పింఛన్ల మాటేంటన్నది అసలు ప్రశ్న. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకోకుండే ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు

# పేర్ని నానికి నో ఆప్షన్...

విజయవాడ, సెప్టెంబర్ 30(భారత శక్తి):
మాజీ మంత్రి పేర్ని నాని విషయంలో జగన్ తిరిగి తన నిర్ణయం మార్చుకున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నాని ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పేర్నినాని పోటీ చేయాలని జగన్ ఆదేశించినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో పేర్ని నానికి బదులు ఆయన కుమారుడు పేర్నిసాయి కృష్ణమూర్తి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.



తిరిగి 2029 ఎన్నికల్లో పేర్ని నానిని పోటీ చేయాలని ఇటీవల పేర్నినానికి గట్టిగా జగన్ చెప్పినట్లు తెలిసింది. పేర్నినాని కొంత తటపటాయించినా వచ్చే ఎన్నికలు కీలకమని, ఈసారి మాత్రం మీరే పోటీ చేయాలంటూ పేర్ని నానిని ఉద్దేశించి కొంత గట్టిగానే చెప్పినట్లు సమాచారం. దీంతో అందుకు పేర్ని నాని కూడా అంగీకరించినట్లు తెలిసింది. పేర్ని నాని తండ్రి పేర్ని కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండేవారు. ఆయన తదనంతరం రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న పేర్ని నాని కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మచిలీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పేర్ని నాని విజయం సాధించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం జగన్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి జగన్ వెంటే ఉన్నారు. పేర్ని నాని 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర చేతిలో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో తిరిగి పేర్ని నాని వైసీపీ నుంచి గెలిచారు. కొల్లు రవీంద్రను ఓడించారు. తర్వాత పేర్ని నాని జగన్ మంత్రివర్గంలో సినిమాటోగ్రఫీ మంత్రిగా పనిచేశారు పేర్నినాని మంచి వాగ్దాటి ఉన్న నేతగా పార్టీలో పేరుపొందారు. కాపు సామాజికవర్గానికి చెందిన పేర్ని నాని తన తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి రాజకీయాల్లోకి వచ్చారంటారు. ఆయన తన మాటలతో 2024లో తన కుమారుడు మచిలీపట్నంలో ఓటమి పాలయిన తర్వాత రాష్ట్రంలోనూ వైసీపీ అధికారం కోల్పోయిన పిదప పార్టీకి మౌత్ పీస్ గా తయారయ్యారు. అంశం ఏదైనా పేర్ని నాని మాట్లాడే మాటల్లో ఖచ్చితత్వం ఉంటుందని అంటారు. ఆయన తన వాగ్దాటితో అధికార పక్షంపై విరుచుకుపడతారు. ప్రధానంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పైనా, చంద్రబాబుపైనా విమర్శలు చేస్తూ పార్టీ క్యాడర్ లో పేరు తెచ్చుకున్నారు. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లో తనకు అండగా ఉండేదుకు పోటీ చేయాల్సిందేనని ఖచ్చితంగా చెప్పడంతో పేర్ని నాని కూడా అందుకు అంగీకరించినట్లు చెబుతున్నారు. సో.. వచ్చే ఎన్నికల్లో పేర్ని నాని పోటీ చేయడం కోసమే యాక్టివ్ అయ్యారని చెబుతున్నారు.

## గోదావరి వరదలపై అధికార యంత్రాంగం అప్రమత్తం

ఏలూరు సెప్టెంబర్ 30(భారత శక్తి):
గోదావరి వరద ఉధృతి దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ముంపు ప్రాంతాల్లో ప్రజల తరలింపునకు బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశించారు. దిగువ ప్రాంత ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ప్రజలెవరూ నదిలోకి వెళ్లొద్దు.. ఈత, చేపలు పట్టడం వంటివి చేయవద్దు. వరద ముంపు ప్రాంతాల ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని అన్నారు.
========================


## తొక్కిసలాట ఘటనపై టీవీకే నేత అరెస్టు

చెన్నై సెప్టెంబర్ 30(భారత శక్తి):



కరూర్ తొక్కిసలాట ఘటనపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలువురు టీవీకే నేతలపై కేసులు నమోదు చేయగా, తాజాగా కరూర్ పశ్చిమ జిల్లా కార్య దర్శి మథియాళను అరెస్ట్ చేశారు. తొక్కిసలాట మృత్యుల సంఖ్య 41కు చేరటంతో మథియాళన్ సహా పలువురిపై హత్యాయత్నం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించటం పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మరోవైపు విజయ్ రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు
==========================

## నోట్ పుస్తకాల పంపిణీ ప్రారంభించిన మంత్రి లోకేష్





అమరావతి సెప్టెంబర్ 30(భారత శక్తి):
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పథకానికి హైదరాబాద్కు చెందిన కేఎల్ఎస్ఆర్ ఇన్ ఫ్రాటెక్ లిమిటెడ్ సుమారు 40 లక్షల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే నోట్ పుస్తకాల పంపిణీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్తో పాటు కేఎల్ఎస్ఆర్ఇన్ఫ్రా టెక్ లిమిటెడ్ ఎండీ కేఎల్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ కే.ప్రీతమ్ రెడ్డి, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

పెద్దపల్లి సెప్టెంబర్ 30(భారత శక్తి):
జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం డిసిపి కరుణాకర్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపిటిసి, జెడ్పిటి సి , గ్రామ పంచాయతీ సాధార ణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని అన్నా రు. రెండు విడతలలో స్థానిక సంస్థలను, 3 విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జి ల్లాలో మొదటి విడతలో 7 మండలాలు, రెండవ విడుదల ఆరు మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయ ని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు భద్రత బలగలు ఉండేలా చూడాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీ ణ ప్రాంతాలలో అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎంసిసి నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను చేపట్టీ మండల అధికారులు రిపోర్ట్ అందించా లని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఎంసిసి నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ ప్రాంతాలలో, సోషల్ మీడియా ద్వారా ఉల్లంఘ నలు చేస్తే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్దం చేశామని, సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, శాంతి భద్రతలు కూడా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## డిజిటల్ బుక్ లో
# వైసీపీపైనే ఫిర్యాదులు





గుంటూరు, సెప్టెంబర్ 30(భారత శక్తి):
తెలుగుదేశం పార్టీ తమ నేతలు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఎదుర్కొనేందుకు రెడ్ బుక్ తీసుకొచ్చింది. అందులో అన్నీ రాసుకుని వడ్డీతో సహా బాకీ తీర్చేస్తామని మంత్రి నారా లోకేష్ గత ఎన్నికల సమయంలో పలుమార్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ తీసుకొచ్చింది. వైసీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులను ఇందులో నమోదు చేయాలని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల వైసీపీ డిజిటల్ బుక్ యాప్ లాంచ్ చేయడం తెలిసిందే.ఏపీ మాజీ మంత్రి విడదల రజనీకి వైసీపీ డిజిటల్ బుక్‌లో షాక్ తగిలింది. చిలకలూరిపేటలోని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం నాడు వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా విడదల రజినిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రావు సుబ్రహ్మణ్యం మీడియాతో మాట్లాడుతూ, '2022లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ ఆఫీసుతో పాటు, నా ఇల్లు, కారుపై మాజీ మంత్రి విడదల రజినీ దాడి చేయించారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి వైసీపీ డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశానని' వివరించారు.డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు అనంతరం వచ్చిన టికెట్‌ను చూపించారు. తనకు కనుక జగన్ న్యాయం చేస్తే.. వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఈ డిజిటల్ బుక్ యాప్ ద్వారా న్యాయం అందుతుందని నమ్మకం కలుగుతుందన్నారు రావు సుబ్రహ్మణ్యం. ఇందులో ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని అందరికీ దీనిపై నమ్మకం కలుగుతుందని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు.వాస్తవానికి మాజీ మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని తన ఇంటి వద్ద, వైసీపీ నాయకులు, శ్రేణులతో కలిసి వైసీపీ డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించడం తెలిసిందే. ఇప్పుడు ఆమె మీద నియోజకవర్గం నుంచి ఫిర్యాదు రావడంతో వైసీపీ శ్రేణులు కంగుతిన్నాయి. దీనిపై వైసీపీ అధిష్టానం ఏం చర్యలు తీసుకుంటుందా అనేది ఉత్కంఠ రేపుతోంది.ఈ సందర్భంగా విడదల రజిని మాట్లాడుతూ?.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ఎదుర్కొంటున్న అన్యాయం, వేధింపులు, కక్షలు, తప్పుడు కేసులు వీటికి ఒక సమాధానం, సాక్ష్యం కావాలి అని పార్టీ అధినేత వైఎస్ జగన్ జూఖీఅఖ డిజిటల్ బుక్ ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్యాయాలకు సమాధానం ఈ డిజిటల్ బుక్ ద్వారా దొరుకుతుందన్నారు. ఈ డిజిటల్ బుక్ వైసీపీ కార్యకర్తలకి జగనన్న ఇస్తున్న భరోసా, అభయం అని పేర్కొన్నారు.

## పొంచి ఉన్న సునామీ ముప్పు

కాకినాడ, సెప్టెంబర్ 30(భారత శక్తి):
మనదేశంలో గుజరాత్ తర్వాత అతిపెద్ద తీరరేఖ కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ కు పేరుంది. ఆంధ్రప్రదేశ్లో తూర్పు, పశ్చిమ గోదావరి, నెల్లూరు, గుంటూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు సముద్రానికి దగ్గరగా ఉంటాయి. ఈ ప్రాంతాలలో సముద్ర రవాణా జరుగుతూ ఉంటుంది. అయితే ఈ ప్రాంతాలలో వర్షాలు కురిసినప్పుడు.. సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు సముద్రపు నీరు ముందుకు వస్తుంది. అలల తాకిడి కూడా అధికంగా ఉంటుంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో వర్షాకాలం సముద్రపు ఎగపోటు అధికంగా ఉంటుంది. అలలు ఉప్పొంగుతాయి. ఇక్కడ వర్షాకాలంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంటుంది. నీరు తీవ్రంగా రావడం వల్ల తీర ప్రాంతం నిత్యం కోతకు గురవుతూ ఉంటుంది.ఈసారి వర్షాకాలంలో అంతర్వేది ప్రాంతంలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిత్యం ఈ ప్రాంతంలో సముద్రం అలలతో ఉప్పొంగుతూ ఉంటుంది. కానీ ఈసారి మాత్రం 500 మీటర్ల దూరం వెనక్కి వెళ్లిపోయింది. అంతేకాదు తీర ప్రాంతం కూడా మోకాళ్ల లోతు ఒండ్రు మట్టితో నిండిపోయింది. గతంలో ఎన్నడు కూడా ఇలా చూడలేదని గ్రామస్తులు అంటున్నారు. గతంలో సముద్రం ఇలా వెనక్కి వెళ్లినప్పటికీ సముద్ర మేటల వల్ల అలా జరిగి ఉండేదని.. ఇప్పుడు భయంగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 మీటర్ల దూరం వెనక్కి వెళ్లిపోయిన సముద్రం ఏ క్షణమైన సరే ముందుకు రావచ్చని.. నష్టాన్ని కలగజేయవచ్చని ఇక్కడి మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో అంతర్వేది తీరంలో సముద్రపు అలలు బీభత్సాన్ని సృష్టించేవి. వర్షాకాలంలో దారుణమైన అనుభవాన్ని మిగిల్చేవి. కానీ ఇప్పుడు మాత్రం సముద్రపు అలలు రాకపోగా.. సముద్రమే వెనక్కి వెళ్ళిపోయింది. అది కూడా 500 మీటర్ల వెనక్కి వెళ్లిపోవడం స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు."వర్షాకాలంలో సముద్రం నీరు విపరీతంగా వచ్చేది. అలలు కూడా అదే స్థాయిలో ఉండేవి. కానీ ఇప్పుడు సముద్రపు నీరు వెనక్కి వెళ్ళిపోయింది. చూస్తుంటే ఏదో ప్రమాద హెచ్చరిక లాగా కనిపిస్తోంది. ఒండ్రు మట్టి కూడా విస్తారంగా ఉంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో అర్థం కావడం లేదని" స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ పరిణామాన్ని సునామీకి ముందస్తు హెచ్చరిక అని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు.

# సోనమ్‌కు అష్టదిగ్బంధనం
## 6న తేలనున్న ఫ్యూచర్

శ్రీనగర్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
దేశంలో శాంతియుత వాతావరణం కోసం కేంద్ర ప్రయత్నిస్తుంటే.. చిన్నచిన్న ఉద్యోమాలతో దేశంలో అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొన్నటి వరకు మణిపూర్‌లో ఉద్యమం జరిగింది. తాజాగా లడఖ్‌లో అల్లర్లు అనూహ్యంగా ప్రారంభమైనప్పటికీ, వాటి వెనుక ఉన్న ప్రణాళిక విస్తృతమైనదే. దీనిని ఒక సడెన్ రెస్పాన్స్ ఉద్యమంగా కాకుండా, చాలా రోజులుగా క్రమంగా నడిపిస్తున్న వ్యూహాత్మక చర్యగా చూడాల్సింది. లడఖ్ ఉద్యమాన్ని కేవలం స్థానిక అసంతృప్తిగా చూడటం తేలికైన నిర్ణయమే అవుతుంది. వాంగ్‌చూ ప్రసంగాలు శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లో జరిగిన అల్లర్ల తీరును పోలి ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇక అరెస్ట్ అయిన వారిలో కొందరు నేపాల్‌కు చెందినవారు కావడం కూడా ఈ వాదనను బలపరుస్తోంది. చిన్నచిన్న ప్రాంతాల్లో హింస చెలరేగించడం ద్వారా ప్రపంచ మీడియా అటెన్షన్ పొందాలన్న గ్లోబల్ ప్రొటెస్టు మోడల్ ఇక్కడ ప్రయోగించినట్లు కనిపిస్తోంది.లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించినప్పుడు స్థానికులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. అయితే కొద్ది కాలంలోనే రాష్ట్ర హోదా కోసం డిమాండ్ ప్రారంభమైంది. ఇది సహజసిద్ధమైన స్థాని క హక్కుల పోరాటం కాకుండా, ప్రణాళికబద్ధమైన రాజకీయ తద్వారా అంతర్జాతీయ దష్టి ఆకర్షించాలనే ప్రయత్నం అని చెప్పవచ్చు. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చూ, ఈ ఉద్యమానికి ప్రధాన నాయకుడిగా ఎదిగారు. ఆయన నడిపిన సంస్థలకు లైసెన్స్ రద్దు కావడమే మొదటి ఘర్షణ. వాంగ్‌చూ తండ్రి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి కావడం వలన ఆయన రాజకీయ నేపథ్యం కూడా దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశం. ఆయన సంస్థలకు ఇచ్చిన భూమి లీజు రద్దు తరువాత ఆయన క్రమంగా రాష్ట్ర హోదా ఉద్యమం మొదలు పెట్టారు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ? ఒక విద్యా, సాంస్కృతిక కార్యకర్త ఒక్కసారిగా ఎందుకు హింసాత్మక ఉద్యమానికి పూనుకుంటారు? సమాధానం ? ఒకవైపు వ్యక్తిగత నష్టం, మరోవైపు రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్న వ్యూహం.ఇంతకు ముందు భారతదేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ కారణాల పేరుతో ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. మణిపూర్, మిజోరాంలో హింసా ఘటనలు. బత్తీపూర్ 'దీపాలు ఆర్పేయాలి' ఉద్యమం. 'సర్ రద్దు చేయాలి', 'ఐలవ్ మహ్మద్' వంటి తాత్కాలిక జాతీయ?మత సంబంధిత ఉద్యమాలు. పాలస్తీనా మద్దతు కోసం ఒక వర్గం చేసిన ప్రయత్నం. ఇవన్నీ ప్రభావం చూపడంలో విఫలమైన కారణంగా లడఖ్‌ను కొత్త వేదికగా ఎంచుకున్నారని అనిపిస్తుంది. చిన్న జనాభా (10 వేల వరకు) ఉన్న ప్రాంతంలో ఉద్యమం ప్రారంభించడం ద్వారా కేంద్రానికి కంట్రోల్ చేయడం కష్టమవుతుంది అనే లెక్కలతో ముందుకెళ్లారు.కేంద్రం ఈసారి రెండు ప్రధాన విధానాలను అనుసరించింది. నేరుగా వాంగ్‌చూ అరెస్టు చేయకుండా, ఆయన సంస్థల లైసెన్స్ రద్దు చేసి అడ్డుకోవడం. బయటివారి ప్రమేయాన్ని బహిర్గతం చేసి ఉద్యమం నిజాయితీపై ప్రశ్నలు లేవనెత్తడం. దీంతో మద్దతు కూడగట్టే ప్రయత్నం కొంతమేర బలహీనపడింది. అరెస్ట్ అయిన వారిలో స్థానికేతరులే



ఉండటం ద్వారా ఉద్యమం స్థానిక సమస్య కాదని, బయటివారి ప్రేరేపణ అని కేంద్రం నిరూపించాలనుకుంది. అక్టోబర్ 6న జరగనున్న సమావేశం కీలక మలుపు కాగలదు. అంతర్గత అసంతృప్తి, బయటివారి మద్దతు కలగలిపి కొత్త వ్యూహాలతో ముందుకు వచ్చి పరిస్థితిని మరల అశాంతంగా మార్చే అవకాశం ఉంది.లడఖ్‌లోని ఈ ఉద్యమం స్థానిక అసహనం మాత్రమే కాదు, వ్యక్తిగత నష్టాలు, రాజకీయ మద్దతు, అంతర్జాతీయ ప్రభావం అనే మూడు అంశాలు కలగలిపిన ఫలితం. చిన్న జనాభా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ దృష్టి ఆకర్షించే సామర్థ్యం ఉన్న వేదిక కావడంతో దీన్ని పెద్ద ప్రణాళికలో భాగంగా చూడాలి.

# ఎన్నికలు జరిగేనా..

## కోర్టు ఆదేశాలు కండిషన్స్ అప్లై

### మరాఠ సీన్ రిపీట్ అవుతుందా

హైదరాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కు. ఏడాదిగా స్థానిక సమరం తెలంగాణలో హీటెక్కిస్తోంది. ఎప్పుడు రేపోమాపో ఎన్నికలన్నట్లుగానే డెవలప్‌మెంట్స్ కనిపిస్తూ వస్తున్నాయ్. కానీ ఈ సారి ఇంకా డిఫరెంట్ సినారియో ఉంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ..2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది.ఓ వైపు రిజర్వేషన్ల పెంపు అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే..ఇటు తెలంగాణ ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. అక్టోబర్ 9వ తేదీన నోటిఫికేషన్..అదే రోజు నామినేషన్లు ప్రారంభమవుతాయని ఎస్‌ఈసీ తెలిపింది. అయితే ఇప్పటికే రిజర్వేషన్ల కోటా 50శాతం దాటడంపై హైకోర్టు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన హైకోర్టు..తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8న కోర్టు ఇచ్చే ఆదేశాలే లోకల్ బాడీ ఎన్నికల ఉన్నట్లా..లేనట్లా అనేది తేల్చనుంది.రిజర్వేషన్లపై జీవో రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు..కావాలంటే ఎన్నికలను వాయిదా వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఎలా ఇస్తారు.? 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదన్న విషయం తెలియదా..? అంటూ ప్రశ్నించింది కోర్టు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు తీర్పులనూ హైకోర్టులో ప్రస్తావించారు పిటిషనర్ తరఫు న్యాయవాది.అయితే సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశించిందన్న విషయాన్ని లేవనెత్తారు అడ్వకేట్ జనరల్. దీంతో అవసరమైతే మరో 2, 3నెలల సమయం కోరుతూ అఫిడవిట్ వేసుకోవాలని సలహా ఇచ్చింది కోర్టు. అలాగే నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని ఈసీని హైకోర్టు అడగగా ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ ఇస్తామని ఈసీ చెప్పింది. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా విచారిస్తామని స్పష్టం చేసింది న్యాయస్థానం. ఈ క్రమంలో అక్టోబర్ 8న హైకోర్టు ఇచ్చే ఆదేశాల మీదే లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుంది

.మహారాష్ట్ర ఎపిసోడ్‌ను గుర్తు చేస్తున్నారు లీగల్ ఎక్స్‌పర్ట్స్. మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం..స్థానిక ఎన్నికల్లో 50శాతం లిమిట్‌ను దాటి..రిజర్వేషన్లు పెంచి..ఎన్నికలు వెళ్లింది. ఎన్నికలు అయిపోయాయి. స్థానిక ఎన్నికల కూడా ఫలితాలు వచ్చాయి. ఆ తర్వాత ఆరు నెలలకు కోర్టు విచారణ చేపట్టి..ఎన్నికల్లో గెలిచిన వారి సభ్యత్వాలను కూడా రద్దు చేసింది. మళ్లీ రిజర్వేషన్ల కోటా 50శాతానికి లోబడి..ఎన్నికలు పెట్టాలని ఆదేశించింది.న్యాయస్థానం ఆర్డర్స్ ప్రకారం మహారాష్ట్రలో మళ్లీ స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 50శాతం రిజర్వేషన్ దాటొద్దన్న నిబంధనను అతిక్రమించడానికి వీల్లేదు. ఈ క్రమంలో తెలంగాణలో కూడా స్థానిక ఎన్నికల్లో బీసీ కోటా ఇప్పట్లో సాధ్యం కాదన్న టాక్ వినిపిస్తోంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే షెడ్యూల్ రిలీజ్ చేసింది కాబట్టి..ఎన్నికలు ఆపొద్దు అనుకుంటే చట్టప్రకారం బీసీ రిజర్వేషన్లు ఇంప్లిమెంట్ కాకుండానే ఎలక్షన్స్ జరుగొచ్చు. ఒకవేళ బీసీ కోటా అమలు చేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలంటే మాత్రం..లోకల్ బాడీ పోల్స్ మరోసారి వాయిదా పడటం ఖాయమని అంటున్నారు లీగల్ ఎక్స్‌పర్ట్స్.మరోవైపు ఇప్పటికే గ్రామాల్లో స్థానిక అలజడి స్టార్ట్ అయింది.

పోటీ చేసే అభ్యర్థులు ఆల్రెడీ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో దసరా పండుగ కూడా వస్తుంది. దీంతో ఎన్నికల బరిలో నిలవాలనుకునే ఆశావహులు కూడా కోర్టు టెన్షన్ పెడుతోంది. ఎన్నికలు జరుగుతాయో..వాయిదా పడుతాయో తెల్వదు.ఎన్నికలు జరగవని ఖర్చు పెట్టుకుండా ఉంటే వెనకబడిపోయే పరిస్థితి. ఒకవేళ ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు దసరా సందర్భంగా యాటలు, లిక్కర్ బాటిల్స్ ఇస్తే ఖర్చు తడిసిమోపెడు అవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టి హంగామా చేశాక ఎన్నికలు వాయిదా పడితే పరిస్థితి ఏంటని లోకల్ లీడర్లు కూడా ఆందోళనలో ఉన్నారట. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందో..? స్థానిక పోరు ఉన్నట్లా.? లేనట్లా.? అనేది వారం రోజులు వెయిట్ చేయాల్సిందే.

## భారీగా పడిపోతున్న టాటా స్టాక్స్

### 16 కంపెనీల్లో 12 సంస్థల షేర్లు ఢమాల్

ముంబై సెప్టెంబర్ 30(భారత శక్తి):
భారత స్టాక్ మార్కెట్లలో కొంత కాలంగా నష్టాలు వస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ వసూలు చేస్తున్న దిగుమతి సుంకాలు, ఇతర కఠిన నిర్ణయాలతో మార్కెట్లు పడిపోతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడికి లోనై షేర్లను అమ్మేస్తున్నారని చెప్పొచ్చు. దేశీయ సూచీలు.. సోమవారంతో కలిపి వరుసగా ఏడో సెషన్‌లో నష్టాల్నే నమోదు చేశాయి. దిగ్గజ హెవీవెయిట్ స్టాక్స్ కూడా పతనం అవుతున్నాయి. ఇందులో ప్రధానంగా మనం టాటా గ్రూప్ గురించి మాట్లాడుకోవాలి. దీని కింద డజనుకుపైగా లిస్టెడ్ కంపెనీలు ఉండగా.. ఆ స్టాక్స్ దారుణంగా పడుతున్నాయి. దీంతో టాటా గ్రూప్ మార్కెట్ విలువ ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు అంటే 9 నెలల్లో 75 బిలియన్ డాలర్లకుపైగా తగ్గింది. భారత కరెన్సీలో చూస్తే ఇది రూ. 6.6 లక్షల కోట్లుగా ఉంటుంది.ఇక్కడ మరో షాక్ ఏంటంటే.. దీంట్లో ఐదో వంతు ఈ నెల 19 తర్వాతే తగ్గింది. ఇప్పుడు టాటా గ్రూప్‌లోని 16 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ కలిపి గత శుక్రవారం సెషన్‌లో 287 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన కరెన్సీలో రూ. 25.25 లక్షల కోట్లుగా చెప్పొచ్చు. దాదాపు రెండేళ్ల తర్వాత ఈ స్థాయికి పడిపోవడం గమనార్హం. ఇటీవల ముఖ్యంగా హెచ్1బీ వీసాల ఫీజుల్ని అమెరికా పెంచడం, ఇతర ఆంక్షలు సహా సైబర్ దాడుల వరకు ఇలా ఎన్నో సవాళ్లు ఎదురవగా.. టాటా గ్రూప్ మార్కెట్ వాల్యుయేషన్ ఈ నెల 19 నుంచే 20 బిలియన్ డాలర్లకుపైగా తగ్గింది. టాటా గ్రూప్‌లో అతిముఖ్యమైన, అతిపెద్దదైన కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్. ఈ ఐటీ కంపెనీ స్టాక్ గత వారంలో 8 శాతానికిపైగా పడిపోయింది. ఒక వారంలో ఇంతలా నష్టపోవడం 2020 తర్వాత ఇదే తొలిసారి. ట్రంప్ సర్కార్.. ఉ1ః వీసాల దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు పెంచడంతో.. ఐటీ కంపెనీలపై ప్రభావం పడుతుంది. ఈ క్రమంలోనే ఆఫ్ షోర్ కాంట్రాక్స్ విషయంలో.. ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోందని.. దీంతో కొన్ని త్రైమాసికాల వరకు కొత్త కాంట్రాక్టుల బుకింగ్స్‌పై ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు.ఇటీవల టాటా గ్రూప్ కంపెనీ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌పై సైబర్ అటాక్ జరిగింది. ఈ క్రమంలో దీని పేరెంట్ కంపెనీ టాటా మోటార్స్ షేర్ ధర వారంలో 5 శాతం వరకు పడిపోయింది. దీంతో టాటా గ్రూప్ భవిష్యత్తు అంచనాల్ని మూడీస్ తగ్గించింది. టాటా గ్రూప్‌లోని 16 కంపెనీల్లో 12 సంస్థల షేర్లు ఈ సంవత్సరం పడిపోయాయి. తేజస్ నెట్‌వర్క్స్ తన మార్కెట్ వాల్యూలో సగం కోల్పోయింది. నెల్కో మూడో వంతు పతనమైంది.

## నిజాం సాగర్ భద్రత ఎంత..

నిజామాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
కామారెడ్డి జిల్లాలోని అతి పురాతనమైన నిజాంసాగర్ ప్రాజెక్టు భద్రతపై నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. 100 సంవత్సరాల క్రితం నిజాం కాలంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు కు సరియైన మరమ్మత్తులు లేని కారణంగా శిథిలావస్థకు చేరే పరిస్థితి దాపురించింది. ప్రాజెక్టుపై గుంతలు పడిన అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ వర్షాలు కురవడంతో పాటు భారీ వరద ప్రాజెక్టు లోకి వచ్చి చేరుతుండడంతో చిన్న చిన్న గుంతలు పెద్ద గుంతలుగా మారి ప్రాజెక్టు కట్ట పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రాజెక్టుల నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిజాం కాలంలో నిర్మించిన 100 సంవత్సరాలు పూర్తయిన నిజాంసాగర్ ప్రాజెక్టును కాపాడుకోవడంలో అధికారులు, పాలకులకు భద్రతపై చిత్తశుద్ధి లేదనేది జగమెరిగిన సత్యం. గత నెల రోజుల నుండి నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో తరచూ వరద గేట్లు మోరాయిస్తున్నాయి. దానికి తోడు ప్రాజెక్టు కట్టపై ఉన్న రిటైనింగ్ వాల్ పక్కన రోడ్డుపై మోకాళ్ళోదు గుంతలు ఏర్పడడంతో ప్రాజెక్ట్ భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మోకాలులోది గుంతలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సంబంధిత అధికారులకు పట్టనట్లు కనిపిస్తోంది. పురాతన ప్రాజెక్టుపై చిన్నపాటి గుంతలు ఏర్పడ్డ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉన్న ఇవేమీ తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది తక్కువ ఉండడంతో సరియైన మరమ్మత్తులు చేయలేదు.ఇప్పుడు గతంలో పనిచేసిన గ్రామ సేవకులను నీటిపారుదల శాఖ లో విధుల్లోకి తీసుకోవడంతో సరిపడా సిబ్బంది ఉన్నారు. సిబ్బంది ఉన్న తాత్కాలిక మరమ్మత్తు పనులు చేయడంలో ఇబ్బంది ఏమిటనేది అధికారులకే తెలియాలి. చిన్నపాటి మరమ్మత్తుల సైతం నిర్లక్ష్యం చేస్తూ పోతే పెద్ద ప్రమాదం ఏర్పడే అవకాశాలు లేకపోలేదు.

## ఇద్దరు పిల్లలు మించితే అనర్హతే



వరంగల్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నిలకు నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (ఎస్‌ఈసీ) రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రంలో తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు దశల్లో జరగనుండగా.. ఆ తరువాత మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం ఐదు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ఎస్‌ఈసీ నిర్వహించనుంది.రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు, 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,67,03,168 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుష ఓటర్లు 81,65,894.. మహిళా ఓటర్లు 85,36,770, ఇతరులు 504 మంది ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే, ఈ ఎన్నిల్లో ముగ్గురు పిల్లలు కలిగిన వారికి పోటీచేసే అవకాశం లేదు.ఇద్దరు పిల్లలు కన్నా ఎక్కువ మంది ఉంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను తొలగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఈ నిబంధనను ప్రభుత్వం తొలగిస్తుందని ఎదురు చూశారు. అదికాస్త జరగకపోవడంతో.. ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మేరకు ఈ నిబంధనను ఎత్తివేసి ఎంత మంది పిల్లలు ఉన్నా పోటీ చేయవచ్చుననే నిబంధన అమల్లోకి తెచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేసింది. అయితే, ప్రస్తుతం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉన్నవారు పోటీచేసే అవకాశం కల్పిస్తారని భావించిన వారికి నిరాశే ఎదురైంది. తెలంగాణలో ముగ్గురు పిల్లల నిబంధనలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు.ఏపీలో ముగ్గురు పిల్లల నిబంధనలో మార్పులు చేశారు. ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేసింది. ఆ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు, అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కలిగినవారు కూడా పోటీచేయొచ్చు. గతేడాది నవంబర్ నెలలో.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నాసరే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించే చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. దీంతో ఏపీలో ముగ్గురు పిల్లల నిబంధనను తొలగిపోయింది.అధిక జనాభాను నియంత్రించే క్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 మే30వ తేదీ నుంచి ముగ్గురు పిల్లల నిబంధన అమల్లోకి వచ్చింది. 1994లో తీసుకొచ్చిన ఈ నిబంధన వల్ల అప్పటి నుంచి స్థానిక ఎన్నికల్లో పోటీకి చాలా మందికి అడ్డంకిగా మారింది. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వ్యక్తులు సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక ఎన్నికల్లో పోటీకి అనర్హులని ఆనాటి ప్రభుత్వం చట్టం చేసింది. దాదాపు 30ఏళ్లుగా ఈ నిబంధనే కొనసాగుతోంది. అయితే, గతేడాది ఏపీ ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించగా.. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఈ నిబంధన కొనసాగుతూనే ఉంది. దీంతో తెలంగాణలో ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ముగ్గురు, అంతకంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారు పోటీకి అనర్హులు పోటీచేసేందుకు సిద్ధమవుతున్న ముగ్గురు పిల్లలు కలిగిన వారికి షాకింగ్ విషయమేనని చెప్పొచ్చు.

## మెగా - నందమూరి అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్




హైదరాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
టాలీవుడ్ సీనియర్ హీరోలైన చిరంజీవి - బాలకృష్ణ మధ్య అనుకోని విధంగా ఓ వివాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. హిందూపురం ఎమ్మెల్యే అయిన నందమూరి బాలకృష్ణ.. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో చిరంజీవి పేరు ప్రస్తావిస్తూ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఇప్పటికే చిరంజీవి ఘాటుగా స్పందించారు. బాలయ్య కామెంట్స్ కు కౌంటర్ గా సుదీర్ఘమైన ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ విషయాన్ని మెగా అభిమానులు చాలా సీరియస్ గా తీసుకున్నారు. బాలకృష్ణపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి రెడీ అయ్యారు.బాలకృష్ణ - చిరంజీవి వివాదం నేపథ్యంలో గత కొన్ని రోజులుగా నెట్టింట్లో మెగా లబ నందమూరి అభిమానుల మధ్య ఫ్యాన్ వార్స్ జరుగుతున్నాయి.

ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలు చేసుకుంటూ వస్తున్నారు. మెగా ఫ్యాన్స్ మాత్రం ఈ ఇష్యూని సోషల్ మీడియా వరకే పరిమితం చేయాలని అనుకోలేదు. చిరుని అగౌరవ పరిచే విధంగా మాట్లాడిన బాలయ్యపై పోలీస్ కేసు ఫైల్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు అఖిల భారత చిరంజీవి యువత నేతృత్వంలో సోమవారం మీటింగ్ పెట్టుకున్నారు.హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సమీపంలోని ఓ హోటల్లో అఖిల భారత చిరంజీవి యువత అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇందులో ఆంధ్రా, తెలంగాణ మెగా అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 300 పైగా పోలీస్ స్టేషన్స్ లో కంప్లెయింట్ చేయాలని తీర్మానించారు. అయితే విషయం చిరంజీవి వరకూ వెళ్లడంతో, అభిమానులకు ఫోన్ చేసి వారించారు. అది మన సంస్కారం కాదని, కేసు పెట్టడంలాంటి పనులు చేయొద్దని హెచ్చరించారు.చిరంజీవి సూచనతో మెగా అభిమానులు వెనక్కి తగ్గారు. బాలకృష్ణపై ఫిర్యాదు చేయాలనే ఆలోచనను విరమించుకున్నారు. ఈ విషయాన్ని మీడియాకి తెలిపారు. మెగాస్టార్ చిరంజీవిపై బాలకృష్ణ చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆల్ ఇండియా చిరంజీవి ఫ్యాన్స్ అసోషియేషన్ నేతృత్వంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకున్నామని చెప్పారు. ముందుగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, మరుసటి రోజు 300 పోలీస్ స్టేషన్స్ లో కంప్లెయింట్ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అయితే చిరంజీవి కాల్ చేసి నచ్చజెప్పడంతో ఫిర్యాదు వాపసు తీసుకున్నామని, తమ ఆలోచన విరమించుకున్నామని, భవిష్యత్ లో ఎవరైనా తమ అభిమాన హీరోపై తప్పుడు స్టేట్మెంట్స్ ఇస్తే ఊరుకునేది లేదని 'అఖిల భారత చిరంజీవి

## రక్తం దానం చేయండి-ప్రాణదాతలు కండి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) సెప్టెంబర్ 30(భారత శక్తి):
మనిషి రక్తం అమూల్యమైనది. ఎందుకంటే రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క దేశంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే. ఈ రక్తంలో గ్రూపులు ఉన్నాయి గానీ.. రక్తానికి ప్రాంతాలు లేవు, కులమత భేదాలు లేవు. సమైక్య భావనను ఈ రక్తం పూర్తిస్థాయిలో చూపిస్తుంది. ఎవరెక్కడివారైనా.. గ్రూపు సరిపోతే చాలు, భేషుగ్గా ఆ రక్తం ఎక్కించుకోవచ్చు.మన దేశంలో నాలుగు కోట్ల యూనిట్ల రక్తం అవసరం కాగా.. కేవలం 40 లక్షల యూనిట్లే అందుబాటులో ఉంది. మిగతా దేశాలతో చూస్తే మన దేశంలో స్వచ్ఛందంగా రక్తం దానం చేసేవారి సంఖ్య చాలా తక్కువ. ఇప్పుడున్న పరిస్థితిలో దేశంలో డిమాండుకు తగినంత రక్తం అందుబాటులో లేదు. ఇక మన రాష్ట్రం విషయానికొస్తే... రాష్ట్ర జనాభాలో ఒక్క శాతం మంది సంవత్సరానికి ఒకసారి రక్తం దానం చేసినా రక్తం కొరత తీరుతుందంటున్నారు వైద్యులు.మన దేశంలో జాతీయ స్వచ్ఛంద రక్త దాన దినోత్సవం 1975 నుంచి ప్రారంభమైంది. అయితే రక్తదానంపై ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తే... ఆశించిన స్థాయిలో దాతలు ముందుకొస్తారని వైద్యులు అంటున్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం ను ప్రతి సంవత్సరం అక్టోబరు 1 న జరుపుకుంటారు. 1975లో స్వరూప కృష్ణన్, డాక్టర్ జె.జి జోలీల చొరవతో ఈ పద్ధతి ప్రారంభమయింది.

## సినిమాలపై 100 శాతం టారిఫ్

న్యూయార్క్ సెప్టెంబర్ 30(భారత శక్తి):
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో షూటింగ్ జరగని అన్ని సినిమాలపై 100% టారిఫ్‌లు విధించనున్నట్లు ప్రకటించారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫారమ్‌లో ఈ ప్రకటన చేస్తూ, "మా సినిమా బిజినెస్‌ను ఇతర దేశాలు చిన్నపిల్లల చేతిలో చాక్లెట్‌ను దొంగిలించినట్లుగా తీసుకున్నాయని" విమర్శించారు. మే నెలలో మొదటిసారిగా ఈ ఆలోచనను ముందుగా ప్రస్తావించిన ట్రంప్, ఇప్పుడు దీన్ని అమలు చేస్తామని ధృవీకరించారు. ట్రంప్ తన పోస్ట్‌లో, "అమెరికా సినిమా పరిశ్రమ మరణిస్తోంది. ఇతర దేశాలు మా ఫిల్మ్‌మేకర్లు, స్టూడియోలను ట్యాక్స్ ఇన్సెంటివ్స్‌తో ఆకర్షిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా, విదేశాల్లో షూటింగ్ జరుపుకున్న అన్ని సినిమాలపై 100% టారిఫ్ విధిస్తాను" అని పేర్కొన్నారు. మేలో మొదటిసారిగా ఈ ఆలోచనను ప్రస్తావించినప్పటికీ, ఇప్పుడు దీన్ని "నేషనల్ సెక్యూరిటీ థ్రెట్"గా పేర్కొని అమలు చేస్తామని చెప్పారు. మెల్ గిబ్సన్, సిల్వెస్టర్ స్టాలోన్, జాన్ వాయిట్ వంటి హాలీవుడ్ స్టార్లను "స్పెషల్ అంబాసిడర్లు"గా నియమించి, పరిశ్రమను "బిగ్గర్, బెటర్, స్ట్రాంగర్" చేస్తామని హామీ ఇచ్చారు. టారిఫ్‌లు వస్తువులపై మాత్రమే వర్తిస్తాయి, సర్వీసెస్‌పై కాదని ట్రంప్ నిర్ణయం కోర్టుల్లో నిలబడదని కొంత మంది అంటున్నారు. విదేశీ సినిమాలపై 100 శాతం టారిఫ్‌లు భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీవ్ర నష్టం అవకాశం ఉంది. యూఎస్ మార్కెట్ భారతీయ సినిమాలకు ముఖ్యమైన ఓవర్సీస్ ఆదాయ మూలం. సంవత్సరానికి సుమారు 100 మిలియన్ డాలర్లు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ టారిఫ్‌లు అమలైతే, యూఎస్ డిస్ట్రిబ్యూటర్లు భారతీయ సినిమా రైట్స్ కొనుగోలు చేయడానికి వెనుకాడతారు. ట్రంప్ ప్రకటన ప్రకారం, యూఎస్ బయట తయారైన అన్ని సినిమాలపై 100 శాతం టారిఫ్ విధిస్తారు. ఉదాహరణకు, ఒక భారతీయ సినిమా యూఎస్ డిస్ట్రిబ్యూటర్ రైట్స్‌ను 1 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేస్తే, అదనంగా 1 మిలియన్ డాలర్ల టారిఫ్ చెల్లించాలి. మొత్తం ఖర్చు 2 మిలియన్ డాలర్లు అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లకు ఆర్థిక భారాన్ని కలిగిస్తుంది, ఫలితంగా టికెట్ ధరలు పెరిగి, ప్రేక్షకులు తగ్గవచ్చు. భారతీయ సినిమాలు యూఎస్‌లో ప్రవాసులు మార్కెట్‌పై ఆధారపడతాయి. ఈ మార్కెట్‌లో హిందీ సినిమాలు 40-60% ఓవర్సీస్ ఆదాయం, సౌత్ ఇండియన్ సినిమాలు 12-70% ఆదాయం పొందుతాయి.గత 10 సంవత్సరాల్లో భారతీయ సినిమాలు యూఎస్ బాక్సాఫీస్‌లో అద్భుత ప్రదర్శన చేశాయి. ఎఓఆఎ డేటా ప్రకారం, టాప్ 10 సినిమాలు మొత్తం 100 మిలియన్ డాలర్లకు పైగా సంపాదించాయి. ఈ టారిఫ్‌లు అమలైతే, ఇలాంటి హిట్‌లు దూరమవుతాయి. టారిఫ్‌లు అమలైతే, డిస్ట్రిబ్యూటర్లు భారతీయ సినిమాలు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవచ్చని అంటున్నారు.

## ప్రతి 5 రోజులకు ఒక కొత్త బిలియనీర్

ముంబై సెప్టెంబర్ 30(భారత శక్తి):
భారతదేశంలో గత కొన్నేళ్లుగా ఆర్థికాభివృద్ధి వేగంగా జరుగుతోంది. కొత్త పరిశ్రమలు, చాలా పెద్ద కంపెనీలు భారతదేశానికి వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోటీశ్వరులు, బిలియనీర్ల సంఖ్య కూడా అదే రీతిగా పెరుగుతోంది. సంపదలో భారతదేశంలో కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దేశంలో ప్రతి 30 నిమిషాలకు ఒక కొత్త కోటీశ్వరుల కుటుంబం తయారవుతోంది. బిలియనీర్ల విషయానికి వస్తే, కొత్త నివేదిక ప్రకారం ప్రతి 5 రోజులకు భారతదేశంలో ఒక కొత్త బిలియనీర్ పుట్టుకొస్తున్నాడు. ప్రతి 5 రోజులకు ఒక బిలియనీర్ పుడుతున్నప్పుడు, ఈ విషయంలో భారత్ ప్రపంచంలో ఏ స్థానంలో ఉందో ఇక్కడ తెలుసుకుందాం.మెర్సిడేస్ బెంజ్ 2025 ప్రకారం, భారతదేశంలో కోటీశ్వరులు వేగంగా పెరుగుతున్నారు. 2021లో దేశంలో 4.58 లక్షల కోటీశ్వరుల కుటుంబాలు ఉండగా, 2025 నాటికి ఈ సంఖ్య 8.71 లక్షలకు చేరింది. అంటే కేవలం 4 సంవత్సరాలలో దాదాపు 90 శాతం వృద్ధి నమోదైంది. ఈ నివేదికలో మొత్తం ఆస్తి రూ.8.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న కుటుంబాన్ని కోటీశ్వరులుగా పేర్కొన్నారు. ప్రకారం, ఇప్పుడు ప్రపంచంలో బిలియనీర్ల సంఖ్యలో భారతదేశం మూడవ స్థానానికి చేరుకుంది. చైనా, అమెరికా తర్వాత, భారతదేశం అత్యధిక బిలియనీర్లు కలిగిన దేశంగా నిలిచింది. భారతదేశంలో ప్రతి 5 రోజులకు ఒక కొత్త బిలియనీర్ పుట్టుకొస్తున్నాడు. ఇది ఆర్థిక వృద్ధి, స్టార్టప్‌ల విజయం, స్టాక్ మార్కెట్ వృద్ధితో పాటు సాంకేతిక రంగం అద్భుత ఫలితాల ప్రభావం అని అభిప్రాయపడింది. భారతదేశపు కోటీశ్వరుల రాజధానిగా ముంబై నిలిచింది. ఇక్కడ 1.42 లక్షల కోటీశ్వరుల ఫ్యామిలీస్ ఉన్నాయి. మనం రాష్ట్రాల విషయానికి వస్తే, మహారాష్ట్ర అగ్ర స్థానంలో ఉంది. దీని తరువాత తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటక నగరాలు ఉన్నాయి. కోటీశ్వరుల సంఖ్య పెరగడానికి కారణం కొత్త టెక్నాలజీ, స్టార్టప్‌లు, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందడం కారణమని చెప్పవచ్చు.

## వందశాతం ఓఆర్ తో నాగపూర్ వందేభారత్

హైదరాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
భారతీయ రైల్వే శాఖ తీసుకున్న ఒక తెలివైన నిర్ణయం ఇప్పుడు సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కొత్త ఊపిరి పోసింది. ప్యాసింజర్ల రద్దీ లేదనే కారణంగా కోచ్‌ల సంఖ్యను తగ్గించి.. ఆ తరువాత రూట్ మ్యాప్‌లో చేసిన మార్పులు ఇప్పుడు అద్భుతమైన ఫలితాలనిస్తున్నాయి. ఈ ప్రణాళికాబద్ధమైన చర్యలకు రైల్వే శాఖ ఆలోచనకు సలాం కొట్టాల్సిందే.గత సంవత్సరం సెప్టెంబర్‌లో సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య వందేభారత్ సర్వీసు ప్రారంభమైనప్పుడు.. ఇది 20 కోచ్‌లతో నడిచిన దేశంలోనే రెండో సర్వీసుగా నిలిచింది. కానీ, ఆక్యుపెన్సీ రేషియో (సీట్ల వినియోగ నిష్పత్తి) 30 శాతం కూడా నమోదు కాకపోవడంతో.. రైల్వే శాఖ వెంటనే స్పందించి.. కోచ్‌ల సంఖ్యను కేవలం 8కి తగ్గించింది. దీంతో ఈ సర్వీసు మినీ వందేభారత్‌గా మారింది. అయితే.. కోచ్‌లు తగ్గించినా ఆక్యుపెన్సీ కేవలం 75 శాతం నుంచి 85 శాతం మధ్యనే ఉండిపోయింది. దీనిపై దృష్టి పెట్టిన రైల్వే శాఖ లోపం ఎక్కడుందో తెలుసుకునేందుకు ఒక సమగ్ర రూట్ సర్వే నిర్వహించింది.సర్వేలో తేలిందేమిటంటే.. ఈ రూట్‌లో అత్యధిక మంది ప్రయాణికులు నాగ్‌పూర్ లేదా సికింద్రాబాద్‌తో పాటు మంచిర్యాల మరియు సిర్పూర్-కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి ప్రయాణించాలనుకుంటున్నారు. కానీ.. ఈ రెండు ముఖ్యమైన పట్టణాల్లో రైలుకు హాల్ట్ లేదు. ప్రయాణికుల అవసరాలను గుర్తించిన రైల్వే శాఖ వెంటనే అప్రమత్తమై.. పది రోజుల క్రితం ఈ రెండు ప్రాంతాలలో స్టాప్‌లను అందుబాటులోకి తెచ్చింది.రైల్వే శాఖ తీసుకున్న ఈ వ్యూహ ఫలితం తక్షణమే కనిపించింది. స్టాప్‌లు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆక్యుపెన్సీ రేషియో ఒక్కసారిగా వంద శాతాన్ని మించింది

## శ్రీ దుర్గాదేవిగా అమ్మవారు

విజయవాడ సెప్టెంబర్ 30(భారత శక్తి):
దసరా మహోత్సవాలు తొమ్మిదో రోజుకి చేరుకున్నాయి. మంగళవారం ఈరోజు అమ్మవారు శ్రీ దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మను దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా ఆలయానికి తరలివస్తున్నారు. జై దుర్గా జై జై దుర్గ అన్న నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది.

==============================

## తెలంగాణ ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటి రెడ్డి

హైదరాబాద్: సెప్టెంబర్ 30(భారత శక్తి):
మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. "భగవంతుడిని పూలతో పూజిస్తాం.అదే పూలను కొలిచే గొప్ప సంస్కృతి మన తెలంగాణ సొంతం. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి 9రోజుల పాటు ప్రకృతిని భగవంతుడిగా కొలిచే గొప్ప వేడుక. చివరి రోజైన సద్దుల బతుకమ్మను అక్కా,చెల్లెళ్లు పల్లె,పట్నం తేడా లేకుండా ఎంతో సంతోషంగా జరుపుకోవాలని మన స్పూర్తిగా కోరుకుంటున్నాను. మహిమగల్ల ఆ గౌరమ్మ తల్లి కృప ప్రజలందరిపై ఉండాలని,పాడి పంటలతో,ఆయురారోగ్యాలతో,సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

==============================

## విద్యుత్ టవర్ ఎక్కి వ్యక్తి హల్చల్

తిరుపతి సెప్టెంబర్ 30(భారత శక్తి):
విద్యుత్ టవర్ ఎక్కి ఒక వ్యక్తి హల్ చల్ చేసాడు. రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువరాజుల పల్లె ఘటన జరిగింది. విద్యుత్ లైన్ టవర్ ఎక్కి రాత్రి నుండి హల్చల్ చేసాడు. టవర్ ఎక్కిన వ్యక్తి సెల్ ఫోన్ ఆధారంగా కర్ణాటక కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వ్యక్తిని రక్షించే పనిలో రెవిన్యూ,ఫైర్ సిబ్బంది, రేణిగుంట పోలీసులు పడ్డారు.

==============================

## మధురవనం దోపిడీ...

నల్గొండ, సెప్టెంబర్ 30(భారత శక్తి):
అది కొండమల్లేపల్లిలోని మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ గ్రామం. పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవే. ఇంకేముందీ పచ్చని భూముల్ని వెంచర్లుగా మార్చేసి.. రంగురంగుల బ్రోచర్లతో కస్టమర్లను బురిడీ కొట్టించి.. ఆఫర్ల పేరుతో ప్లాట్లను అంటగడుతున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ భారీ ఫామ్ లాండ్ దందాకు తేరలేపింది.మధురవనం పేరుతో ఏకంగా 243 ఫామ్ ల్యాండ్ ప్లాట్లను వెంచర్‌గా చేసి విక్రయాలను మొదలుపెట్టింది. అయితే సదరు వెంచర్ ఏర్పాటుకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం. అయితే ఈ ఫామ్ ల్యాండ్ అక్రమ దందాకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడుతుండడం కొసమెరుపు. వ్యవసాయ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం వేదిక అయ్యింది. ఇంత జరుగుతున్నా.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రను వీడడం లేదు.కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 89, 90,92, 93ల్లో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ ఆధ్వర్యంలో మధురవనం పేరు ఫ్యామ్ ల్యాండ్ వెంచర్ ఏర్పాటయ్యింది. ఈ వెంచర్‌లో ఒక గుంట దగ్గరి నుంచి మొదలు పెడితే.. ఐదారు గుంటల వరకు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిజానికి డీటీసీపీ, రేరా వంటి అనుమతులేవి లేకుండానే ఫామ్ ల్యాండ్ ప్లాట్ల విక్రయాలు జోరందుకున్నాయి.అయితే సదరు వెంచర్ యాజమాన్యం ఇందులో కొత్త తరహా దందాకు తేరలేపింది. రిజిస్ట్రేషన్లు గుంటల్లో చేస్తున్నప్పటికీ.. అమ్మకాలు మాత్రం గజాల లెక్కన డబ్బులు దండుకుంటుండడం గమనార్హం. అయితే ప్రతి ఆదివారం స్పెషల్ ఆఫర్ పేరుతో కస్టమర్లను వెంచర్ వద్దకు తీసుకొచ్చి నాన్‌వెజ్ భోజనం.. రంగురంగుల బ్రోచర్లతో బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగట్టేస్తున్నారు.పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవే కావడంతో హైదరాబాద్ మహానగరంతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి సైతం కస్టమర్లను కార్లలో తరలించి ప్లాట్లు కొనుగోలు చేసేలా మాయమాటలు చెబుతుండడం కొసమెరుపు.హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవేదే భవిష్యత్ అంతా.. ఫ్యూచర్‌లో ఇక్కడ సైతం ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటివి రాబోతున్నాయి. హైదరాబాద్ చుట్టూ పక్కలా భూమి అయిపోయింది. ఇక మిగిలింది ఈ హైవేకే. పైగా నాగార్జునసాగర్ ప్రాజెక్టును హైదరాబాద్ మహానగరం భవిష్యత్‌లో పర్యాటకంగా కలిసిపోయే పరిస్థితి వస్తుందంటూ కస్టమర్లను గాలిలోనే మేడలు కట్టేలా చేస్తున్నారు.వాస్తవానికి సగటు సామాన్యుడు భవిష్యత్ అవసరాల కోసం.. పిల్లల ఫ్యూచర్ కోసం మాత్రమే ప్లాట్లను కొనుగోలు చేస్తుంటారు. ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కస్టమర్లు ప్లాట్లు బుక్ చేసే వరకు వదలడం లేదు.ఈ దందాలో ఏజెంట్లు, దళారులకు భారీగా కమిషన్లు ఇస్తుండడంతో ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇదే పనిచేస్తూ తొటి ఉద్యోగులు, బంధువులు, స్నేహితులకు అక్రమ ప్లాట్లను అంటగడుతున్నారు. తీరా ఆ ఫాట్లలో ఇల్లు కట్టుకోవాలంటే.. మస్తు తిప్పలు పడాల్సి వస్తుంది. దీంతో అప్పడు లబోదిబోమనడం కస్టమర్ల వంతుగా మారింది. ఈ దందాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చేష్టలూడిగి చూస్తోంది.

## సాగర్ కుడి కాలువలో ఇద్దరు గల్లంతు

పల్నాడు సెప్టెంబర్ 30(భారత శక్తి):
నకరికల్లు మండలం గుండ్లపల్లి వద్ద విషాదం నెలకొంది. నాగార్జున సాగర్ కుడి కాలువలో ఈతకు దిగిన నలుగురు విద్యార్థులలో ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. మరో ఇద్దరు యువకులు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన రూపస్,హర్షద్ కోసం పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన రూపస్ స్వస్థలం చీరాల వద్ద ఈపూరుపాలెం. హర్షద్ ది చిలకలూరిపేటగా గుర్తించారు.

# లోకల్ లో జనం "హ్యాండ్" ఇస్తారా? అండగా నిలబడతారా?

హైదరాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై జనాభిప్రాయం తెలిపే ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండేళ్లు దాటి పోయింది. ఈ రెండేళ్లలో ఒకే ఒక ఉప ఎన్నిక జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అది అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు మొగ్గు చూపారని అనుకోవాలి. కానీ నేడు అలా కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకమని చెప్పాలి. ఎందుకంటే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు జరిపారన్న దానిపైనే ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసే అవకాశముంది. ప్రధానంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్నిఅమలు చేసినప్పటికీ యూరియా కొరత కొంత రైతుల్లో అసంతృప్తి ఉంది. మరొకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఈ ప్రభుత్వంలో బాగానే విడుదలయ్యాయి. అయినా నిరుద్యోగ యువతలో ఎంత మేరకు అసంతృప్తి ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమవుతుందిఇక ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇది తమకు పాజిటివ్ గా ఓటింగ్ ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. మరొకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా ఒకరకంగా తమకు అనుకూలంగా మారతాయని భావిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎంతమందికి అమలయ్యాయి? ఎంత మంది లబ్ది పొందారు? గత ప్రభుత్వం లో లబ్ది పొందిన వారితో పాటు ఈ ప్రభుత్వంలో మరికొంత మంది ప్రయోజనం పొందారా? లేక కోత విధించారా? అనేది ఫలితాలను బట్టి వెల్లడవుతుంది. గత ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి పథకం అమలయ్యేది. ఈ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయలేదు. ఇలా కొన్ని హామీలను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుంది. మరి ప్రజలు హ్యాండ్ ఇస్తారా? కాంగ్రెస్ కు అండగా నిలబడతారా? అన్నది ఎన్నికల ఫలితాల మాత్రమే తెలియనుంది.రాష్ట్రంలోని 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 12,733 పంచయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.తెలంగాణలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. అక్టోబర్ 9 నుంచి నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం ఉండనుంది. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 31 న తొలి విడత పోలింగ్ జరగనుంది. పంచాయతీలకు రెండో విడత పోలింగ్ నవంబరు నాలుగో తేదీన, మూడో విడత నవంబరు 8వ తేదీన నిర్వహించనున్నారు. పోలింత్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుంది.

# లోకల్ బాడీస్ కసరత్తు షురూ...



అదిలాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
ఎంతోకాలంగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఆశావాహుల కు రిజర్వేషన్ల స్థానాలు ఖరారు చేయడంతో ఉత్కంఠకు తెరపడింది.జిల్లాలో 15 మండలాల్లో జడ్పిటిసి ఎపిపి స్థానాలకు సంబంధించి ఎన్నికల అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. రిజర్వేషన్ల ప్రకటనతో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నాయకుల అంచనాలు కొన్నిచోట్ల తారుమారు కావడం తో గందరగోళంగా మారింది. ఎంతోకాలంగా ప్రాతినిధ్యం వహిస్తున్న చోట్ల రిజర్వేషన్ మారడంతో నాయకులు తలలు పట్టుకుంటున్నారు.ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించేం దుకు వేగవంతంగా ముందుకు సాగడంతో పలు రాజకీయ పార్టీలు సైతం బలమైన నాయకుల వేటలో పడ్డాయి. శనివారం రిజర్వేషన్లను ఖరారు చేయడంతో ప్రధాన పార్టీల అధినాయకులు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్లాగైనా గెలవాలని అధికార పార్టీ నాయకులు ఓవైపు వ్యూహం చేస్తుండగా బిఆర్ఎస్ పార్టీ జెండాను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగర వెయ్యాలని ఆ పార్టీ నాయకులు వ్యూహరచన చేస్తుండగా బిజెపి పార్టీ ముఖ్య నాయకులు సైతం ఎన్నికల్లో కాషాయం సత్తా చూపాలని చూస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రధాన పార్టీ లు బలమైన అభ్యర్థులను నిలబెట్టి తమ సత్తాను చాటాలని ప్రణాళికలు వేస్తున్నారు.దాదాపు రెండు సంవత్సరాలుగా స్థానిక సం స్థల ప్రాతినిధ్యం లేకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లడం జాప్యం జరుగుతూ వచ్చింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా స్థానిక సంస్థల్లో గెలుపొంది ప్రభుత్వానికి మరింత ఉత్తేజాన్ని నింపేందుకు ఆ పార్టీ అధిష్టానం ముందుకు వెళు తుంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ జిల్లాలో మాత్రం ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు లేకపోవడంతో స్థానిక సంస్థల లోనైనా కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉండాలని ఆ పార్టీ అధిష్టానం సీరియస్‌గా ముందు కు వెళుతుంది. జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తుండగా సిర్పూర్ నియోజకవర్గంలో పాల్వాయి హరీష్ బాబు ప్రాతిని ధ్యం వహిస్తున్నారు. బిఆర్ఎస్ బిజెపి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వారి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీల ఎమ్మెల్యేలు ముందు కు వెళుతున్నారు.రిజర్వేషన్లు ఖరారు కావడంతో జిల్లా వ్యాప్తంగా రాజకీయ వేడి మొదలైంది.

జెడ్పీ బీసీ జనరల్....!

జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీసీ జనరల్ కు కేటాయించారు. నూతన జిల్లాలు ఏర్పా టు అయిన తర్వాత మొదటిసారి జిల్లా పరిషత్ చైర్మన్ ఎస్టీ కి కేటాయించగా రెండవసారి చైర్మన్ ను బీసీ జనరల్ కు కేటాయించారు. జిల్లా పరిషత్ చైర్మన్ బీసీ జనరల్‌కు కేటాయించడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 జడ్పి టిసి స్థానాలలో అత్యధిక స్థానాలను గెలిపించుకొని జడ్పీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయా లని అధికార పార్టీ నాయకులు యోచిస్తున్నా రు.
మొదటిసారి జరిగిన జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రస్తుత ఎమ్మె ల్యే కోవ లక్ష్మి మొట్టమొదటి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. రెండవసారి కూడా జడ్పీ చైర్మన్ కైవసం చేసుకోవాలని ఆ పార్టీ అధిష్టానం పావులు కదుపుతుంది.

ఎంపీపీ రిజర్వేషన్..

లింగాపూర్, సిర్పూర్ యూ, ఆసిఫాబాద్, (ఎస్టీ మహిళ), జైనూర్, బెజ్జూర్, వాంకిడి (ఎస్టీ జనరల్), పెంచికల్ పెట్ (ఎస్సీ మహిళా), దహెగాం(ఎస్సీ జనరల్), చింతలమనేపల్లి, కాగజ్‌నగర్,(బీసీ మహిళ),సిర్పూర్ టీ,రెబ్బెన, కౌటల,(బీసీ జనరల్),తిర్యాణి(జనరల్), కెరమెరి (మహిళ జనరల్)

జడ్పీటీసీ రిజర్వేషన్లు...

ఆసిఫాబాద్, బెజ్జూర్, చింతలమనే పల్లి(ఎస్టీ జనరల్) ,వాంకిడి,దహెగాం (ఎస్టీ మహిళ), సిర్పూర్ యూ(జనరల్),పెంచికల్ పెట్ (ఎస్సీ మహిళా), సిర్పూర్ టీ (ఎస్సీ జనరల్),రె బ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్ (బీసీ మహిళ), జైనూర్, కెరమెరి (బీసీ జనరల్),లింగాపూర్ (జనరల్ మహిళ)కు కేటాయించారు.


## బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థే

ముంబై సెప్టెంబర్ 30(భారత శక్తి):
భారత్‌తో పాటు విదేశాల్లో డ్రగ్స్, ఆయుధాల అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలతో సంబంధాలు ఉన్న లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు కెనడా షాకిచ్చింది. బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా కెనడా ప్రకటించింది. క్రిమినల్ కోడ్ ప్రకారం లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించినట్టు కెనడా హోం శాఖ మంత్రి గ్యారీ ఆనందసంగరీ సోమవారం ప్రకటించారు. దీంతో కెనడాలోని బిష్ణోయ్ ముఠా ఆస్తులు (నగదు నుంచి వాహనాలు, ఆస్తి వరకు) స్వాధీనం చేసుకోవడం లేదా స్తంభింపచేయడానికి, ఉగ్రవాద కార్యకలాపాలను నిధులు సమకూర్చడం వంటి వివిధ నేరాలపై ముఠా సభ్యులను విచారించడానికి చట్టబద్దమైన అధికారం దఖలుపడుతుంది. అంతేకాదు, ఈ గ్యాంగ్ సభ్యులకు కెనడాలోకి ప్రవేశించకుండా అడ్డుకోవచ్చు. ఇటీవల కెనడాలోని స్టాండప్ కమేడియన్ కపిల్ శర్మ రెస్టారెంట్‌పై కాల్పులకు ఈ ముఠాయే బాధ్యత వహించింది.కెనడాలో ఉగ్రవాదం, హింసకు స్థానం లేదు.. ముఖ్యంగా కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని భయపెట్టడం, బెదిరింపు వాతావరణాన్ని సృష్టించే వాటికి స్థానం లేదు." అని కెనడా ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది.కెనడా చట్టం ప్రకారం.. ఇప్పుడు లారెన్స్ బిష్ణోయి గ్యాంగ్‌కు చెందిన లేదా వారి ఆధీనంలో ఉన్న ఆస్తులను గుర్తిస్తారు. ఎవరైనా లావాదేవీలు నిర్వహించినా అది నేరంగా పరిగణిస్తారు. అలాగే, ఆ గ్యాంగ్‌ను వినియోగించుకోవడం లేదా వారికి లబ్ది చేకూర్చేందుకు ఉపయోగపడుతుందని తెలిసి నేరుగా గాని పరోక్షంగా గాని ఆస్తి ఇవ్వడం కూడా నేరమే. ఈ ప్రకటనను ట్రూడో ప్రధానిగా ఉన్నప్పుడు భారత్–కెనడా మధ్య జరిగిన దౌత్య యుద్ధం తర్వాత ఇరు దేశాల సంబంధాలను సరిదిద్దుకునే ప్రయత్నంలో కీలక అడుగుగా భావించాలి. ఇదే సమయంలో కెనడా ఎంపీ ఫ్రాంక్ కపుటో బిష్ణోయిపై 'ఉగ్రవాద సంస్థ'గా గుర్తించాలని మంత్రి అనందసంగరీని కోరిన నెల రోజుల్లోనే ఈ ప్రకటన రావడం చెప్పుకోదగ్గ అంశం.హోం శాఖ మంత్రికి రాసిన లేఖలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ దురాగతాలను, విస్తృత క్రిమినల్ సామ్రాజ్యాన్ని కపుటో ఏకరువు పెట్టారు. అతడు ఓ భయంకర నేర చక్రవర్తి అని, ఈ గ్యాంగ్ హత్యలు, కెనడా పౌరులపై దోపిడీలకు పాల్పడిందని, ఇంకా రాజకీయ, మతపర, సిద్ధాంతపర కారణాల కోసం ఇలాంటి అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.'బిష్ణోయి గ్యాంగ్ కార్యకలాపాలు ఉగ్రవాద సంస్థగా గుర్తించేందుకు పునాది. వారు కెనడా, విదేశాల్లో జరిగిన విస్తృత హింసకు బాధ్యత వహించినట్టు స్వయంగా ప్రకటించారు' అని కపుటో తన లేఖను ఎక్స్ (ట్విట్టర్) పంచుకున్నారు. అంతేకాదు, కెనడాలోని సిక్కుల్లో 20 శాతం మంది ఉండే బ్రాంప్టన్ నగర మేయర్ ప్యాట్రిక్ బ్రౌన్, బ్రిటిష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఇబే, అల్బెర్ట్ నే డానియల్ స్మిత్, సర్రే మేయర్ బ్రెండే లాకే వంటి రాజకీయ నాయకులను బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

=======================

## నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )
సెప్టెంబర్ 30(భారత శక్తి):




ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 1న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. మూగజీవాలపై మానవ ప్రేమను ప్రోత్స హించి, పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం నిర్వహించబడుతోంది. ప్రపంచవ్యాప్తంగా శాకాహా రులను ఒక వేదికపైకి తీసుకువచ్చేందుకు 1970లలో ఉత్తర అమెరికా శాకాహార సొసైటీ ఏర్పడింది. 1977లో తొలిసారిగా అమెరికాలో ఈ దినోత్సవాన్ని ప్రారంభించగా,1978లో అంతర్జాతీయ శాకాహారం యూనియన్ ఆమోదించింది. ప్రపంచ శాకాహారం దినోత్సవం సందర్భంగా అక్టోబరు నెల శాకాహార అవగాహన నెలగా ప్రారంభమై, నవంబరు 1న ప్రపంచ వేగన్ దినోత్సవంతో ముగుస్తుంది. శాకాహార పద్ధతులు, ప్రయోజనాలను ప్రోత్సహించడానికి స్థానిక, ప్రాంతీయ, జాతీయ సమూహాలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తాయి.శాకాహారం ప్రాముఖ్యతను తెలిపేందుకు, అవగాహన కలిగించేందుకు వివిధ దినోత్సవాలు కూడా ఉన్నాయి.

# ఐఏఎస్ ల పై మంత్రుల గుర్రు....సీఎంకు కంప్లయింట్

హైదరాబాద్, సెప్టెంబర్ 30(భారత శక్తి):
అంతా మేమే. అమాత్యులైనంత మాత్రాన వాళ్లు చెప్తే వినాలా..వాళ్లకు ఏం తెలుసు. మా డైరెక్షన్స్ ప్రకారమే వాళ్లు నడుచుకోవాలి. ఇది తెలంగాణలోని కొందరు ఐఏఎస్, ఐపీఎస్ ల తీరు అంటూ..సెక్రటేరియట్ లో గుసగుసలు మొదలయ్యాయి. మంత్రుల ఆదేశాలను బ్యూరోక్రాట్స్ పిచ్చ లైట్ తీసుకుంటున్నారట. పైగా మీకేం తెలుసు అన్నట్లుగా నేరుగా మంత్రులతోనే మాట్లాడుతున్నారట. మంత్రులకే సలహాల మాదిరిగా క్లాసులు పీకుతున్నారట కొందరు అధికారులు. మంత్రి అంటే. సీఎం తర్వాత ప్రభుత్వంలో కీలక ర్యాంకున్న నేత. రెండు మూడు శాఖలు మంత్రి పరిధిలోనే ఉంటాయి. మంత్రులుగా వాళ్లకు కొత్త అయినా, పాత వాళ్లు అయినా ఆయా శాఖలకు వారే బాసులు. వారి నిర్ణయాలను అమలు చేయాల్సిన బాధ్యత బ్యూరోక్రాట్స్ ది. ఓఎస్డీలు, పీఎస్‌లు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ..అమాత్యుల ఆర్డర్స్ ప్రకారం నడుచుకోవాల్సిందే. ఎక్కడైనా ఇదే జరుగుతుంటుంది.కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొంతమంది ఐఏఎస్ అధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారట. అసలు మంత్రులకు ఏమీ తెలియదు.. వాళ్లు చెప్పినట్లు తాము పని చేసేది ఏంటన్నట్లు బిహేవ్ చేస్తున్నారట. ఒకవేళ ఫస్ట్ టైమ్ మినిస్టర్స్‌గా ఉన్నవాళ్లకు కొన్ని విషయాలు తెలియకపోయినా..అమాత్యులకు బ్యూరోక్రాట్స్ సలహాలు, సూచనలు ఇవ్వడం కామన్. వారికి అర్థమయ్యేలా ఎక్స్‌ప్లెయిన్ చేయాల్సిన బాధ్యత కూడా సెక్రటరీలదే.కానీ ఈ మధ్య కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే కం మంత్రికి చేదు అనుభవం ఎదురైందట. మంత్రి ఫోన్ చేసిన సందర్భంలో ఓ సీనియర్ ఐఏఎస్ ఫోన్‌లో మాట్లాడిన తీరు ఆ మంత్రి పేషీలో హాట్ టాపిక్‌గా మారింది.

**పజా సమస్యే కదాని అందరి ముందు స్పీకర్ ఫోన్‌లో మాట్లాడటమే ఆ అమాత్యుని పరువు పోయేలా చేసిందనే టాక్ నడుస్తోంది.ఓ కొత్త మంత్రి శాఖకు చెందిన ఫైల్స్ ఆ శాఖ సెక్రటరీ దగ్గర చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే క్లియర్ చేయాలని చెప్పేందుకు సంబంధిత సెక్రటరీకి మంత్రి ఫోన్ చేశారు.**

మంత్రి అనే హోదాను గౌరవించకుండా, ఆ ఐఏఎస్ ఇష్టానుసారంగా మాట్లాడటంతో మంత్రి ఇబ్బంది పడ్డారని..ఆ సమయంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు. ప్రజా సమస్యే కదాని అందరి ముందు స్పీకర్ ఫోన్‌లో మాట్లాడటమే ఆ అమాత్యుని పరువు పోయేలా చేసిందనే టాక్ నడుస్తోంది.ఓ కొత్త మంత్రి శాఖకు చెందిన ఫైల్స్ ఆ శాఖ సెక్రటరీ దగ్గర చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని వెంటనే క్లియర్ చేయాలని చెప్పేందుకు సంబంధిత సెక్రటరీకి మంత్రి ఫోన్ చేశారు. సెక్రటరీ గారు..వెంటనే ఆ ఫైల్స్ క్లియర్ చేసి పంపండి ప్లీజ్ అని గౌరవంగానే కోరారట ఆ మంత్రి గారు. కానీ సెక్రటరీ మాత్రం మంత్రి అనే కనీస మర్యాద కూడా ఇవ్వకుండా ఎడపెడా వాగేశారట. ఏంటీ..మీరు ఎప్పుడు పడితే అప్పుడే ఫోన్ చేస్తారా? ఇలా పదే పదే ఫోన్ చేస్తే ఎలా? నేను పని చేసుకోవద్దా? ఎప్పుడు ఏ ఫైల్ క్లియర్ చేయాలో మాకు తెలుసు అంటూ నోరుపారేసుకున్నారట సదరు అధికారి.కానీ మంత్రి మాత్రం తన సహజ ధోరణిలో సరే సార్. కాస్త త్వరగా క్లియర్ చేయండి అంటూ రిక్వెస్ట్ చేసి ఫోన్ పెట్టేశారట. అయితే ఈ ఫోన్ సంభాషణ సమయంలో ఆ మంత్రి ఫోన్ స్పీకర్ ఆన్ చేసి ఉండటం ఫలితంగా తన అనుచరుల దగ్గర ఆయన ఇబ్బంది పడాల్సి వచ్చిందని చర్చ జరుగుతోంది. పలువురు ఐఏఎస్‌లు ఇలానే దురుసుగా వ్యవహరిస్తూ..మంత్రులకు ఇబ్బందికరంగా మారుతున్నారట.ఇక ఇంకో సీనియర్ మంత్రి సూచించినా, ఆదేశించినా ఆయన శాఖలో పనిచేసే సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా ఫైళ్లనూ.. పనులనూ పెడ చెవిన పెడుతున్నారట. ఆ మంత్రి ఇచ్చిన మౌఖిక ఆదేశాలను అసలే పట్టించుకోవడం లేదట. చివరకు తన దగ్గరకు వచ్చే ఫైల్స్‌ను పరిశీలించాలని ఎండార్స్ చేసి పంపినా పక్కన పడేస్తున్నారట సదరు అధికారి. అంతేకాదు మంత్రి చెప్పిన ఫైల్‌కు వీలైనన్ని కొర్రీలు పెడుతూ అటూ ఇటూ తిప్పుతున్నారన్న చర్చ సాగుతోంది.గతంలో అనేక ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసినా..ఇలాంటి అధికారిని మాత్రం చూడలేదని గొణుక్కుంటున్నారట సదరు అమాత్యులు. ఇక ఓ మహిళా మంత్రికి కూడా ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతున్నాయట. ఆ మంత్రి ఇచ్చిన ఆదేశాలను మహిళా సాధికారత కోసం పనిచేసే ఓ ఐఏఎస్ అధికారిణి ఏ మాత్రం పట్టించుకోవడం లేదట. దీంతో సదరు మహిళా మంత్రి ఆ ఐఏఎస్ అధికారిణికి పనులు చెప్పాలంటేనే ఆలోచిస్తున్నారట. ఇలా ముగ్గురు మంత్రులే కాదు..పలువురు మినిస్టర్లు కూడా ఇబ్బందులు ఫేస్ చేస్తున్నారట. తమ శాఖల ఉన్నతాధికారుల తీరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట.

# సమాజాన్ని సంస్కృతిని రక్షించేది కుటుంబమే

## (కనుమరుగైన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ )

సమాజం సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పటికీ సమాజంలో మానవ కుటుంబ సంబంధాలు బలహీనపడుతున్నాయి. సమాజంలో అనేక అవాంచిత ధోరణులు ప్రబలి అనేక సమస్యలు ఏర్పడు తున్నాయి. ఈ నేపథ్యంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకతను వివరించడం కోసం మే15 వి తేదీని అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం గా జరుపుకుంటున్నాం.

సమాజంలో ఆధునికత' విదేశీ సంస్కృతి 'నాగరికత పెరిగి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మౌలిక మార్పులు వచ్చాయి. త్వరలోనే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితులు రానున్నాయి.

పూర్వం రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి .

ప్రత్యేక కుటుంబాలుబి విచ్చలవిడితనం.

ప్రస్తుతం ప్రత్యేక కుటుంబాలు ఏర్పడి పట్టించుకునేవారు లేక విచ్చలవిడి తనం పెరిగింది. పిల్లలకు ఆచారాలు సంస్కృతి 'సాంప్రదాయాలు మర్యాదలు తెలియజేసే తాతలు నానమ్మలు బాబయ్యాలు అత్తమ్మలు మామయ్యకు లేకపోవడంతో పిల్లల్లో అనేక వక్రధోరణులు రులు ప్రబలుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమైంది. సమాజంలో సామాజిక నష్టాలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలను గ్రహించి ఐక్యరాజ్యసమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం 1993 మే 15న అంతర్జాతీయ కుటుంభ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించింది. కుటుంభ వ్యవస్థ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యం కోసం సభలు సదస్సులు వర్క్ షాపులు చర్చలు నిర్వహించి కుటుంబ పెద్దలు నైపుణ్యాన్ని అనుభవాలను పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో అవగాహన పెంచుకొని సహకారాన్ని అందించడం కుటుంబాల్లో నెలకొన్న విభేదాలు తొలగించి సుఖశాంతులను నెలకొల్పడం లాంటి లక్ష్యాలతో ప్రపంచవ్యాప్తంగా సభ్య దేశాలు ఈరోజు జరుపుకోవాలని ఐ'రా'స ఆదేశించడం గమనార్హం.

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం' 2025 థీమ్.

"కుటుంబ ఆధారిత విధానాలు సుస్థిరత అభివృద్ధి కోసం" అనే థీమ్ ను ఎంపిక చేశారు .ఈరోజు కుటుంబాల ప్రాముఖ్యతను సమాజంలో వారి పాత్ర పై అవగాహన కల్పిస్తారు .

నేటి రోజుల్లో ఎవ్వరూ ఫ్యామిలీ అంటే ఇష్ట పడటం లేదు. చిన్న కుటుంబాలు చింతలేని కుటుంబాలు నాటి సామెత నేడు చిన్న కుటుంబాలలో చింతలు ఎక్కువ గొడవలు వ్యసనాలు' గౌరవాలు తక్కువై వ్యక్తి కేంద్రంగా కుటుంబాలు రూపు మార్చు కుంటున్నాయి. ఒక నాడు సుఖ దుఃఖాలకు సంతోషాలకు ఆనందాలకు వేదికగా నిలిచిన కుటుంబ వ్యవస్థ నేడు అహానికి వ్యక్తి స్వార్థానికి కేంద్ర బిందువైంది. కలిస్తే కలహాలు పలకరింపులకు బదులు పగలు ప్రతీకారాలకు వేదికలుగా మారిన దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఫ్యామిలీ అంటే ఇష్టంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇష్టం లేకున్నా ఏదో తూ తూ మంత్రంగా ఇష్టం ఉన్నట్టు నటిస్తున్నారు. మనుషులతో కలవడానికి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. మనుష్యులు అంటేనే జనాలకు అలెర్జీ పుడుతుంది. దగ్గరి వారు అంటే నచ్చడమే లేదు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగు కావడానికి కారణాలు

అహం అధికారం.

సమాజంలో పేరుకుపోయిన నిరక్షరాస్యత 'అనాలోచిత వైఖరి అతి తెలివి' అహం ఇతరులను తక్కువగాచూసే మనస్తత్వం అధికార చెలాయింపు చిన్న తప్పును భరించే శక్తి , సహనం ఓర్పు లేకపోవడం ఆదిపత్యవాదం అజమాయిషీ తత్వం పెచ్చుపెరిగి పోయింది.

స్వేచ్ఛా జీవనం.

కుటుంబంలో సంపూర్ణ ప్రజాస్వామ్యం రాజ్యమేలడం. స్వేచ్ఛా యుత జీవనాన్ని కోరుకోవడం. పెద్దల నియంత్రణ లేకపోవడం . పెద్దల సలహా తీసుకోక పోవడం.

సమిష్టి భావన లోపించడం.

పెద్దలు, పిల్లలు అందరు కూర్చొని భోజనం చేయక పోవడం .మాట్లాడుకొక పోవడం. సమిష్టి బాధ్యతలు లోపించడం వల్ల ఉమ్మడికుటుంబాలు తగ్గి పోతున్నాయి. ఆపదలో ఆదుకునే బంధువులు రాక బాధలను పంచుకునే బంధువులు లేక ఒంటరిగా మారుతున్నారు.

లోపించిన జవాబుదారీతనం.

కుటుంబ సభ్యులు ఎంతసేపూ ఎంటర్ టైన్ మెంట్ ప్రోగ్రాంలలో మునిగి పోవడం. ఎక్కడో ఉన్న సినిమా నటులు ఈరోజు ఏమి చేశారో చెప్ప గలుగుతున్నారు. కానీ, ఇంట్లోని వారు ఎప్పుడు ఏమి చేస్తున్నారో చెప్పలేని దుస్థితి నెలకొంది.. జవాబుదారీతనం లోపించింది . ఉమ్మడి కుటుంబాల్లో ఉన్నట్లు కలిసి మెలిసి ఉండే మనుసులు కానీ మనుషులు కానీ లేకుండా పోయారు. పెళ్లయిన వెంటనే వేరే కాపురాలు పెట్టుకొని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ పట్టుకుని ఒంటరై పోతున్నారు.

పెరుగుతున్న షాడిజం

చిన్న పొరపాటుకు అలిగి దగ్గరి వారిని రక్తసంబంధం వున్న వారిని దూరం చేసుకుంటున్నారు. ఒకరి నోటి దురుసు తనం కాఠిన్యత సంకుచిత మనస్తత్వం షాడిజం కుటుంబాన్ని మొత్తం చిన్నా భిన్నం చేస్తుంది.

పోటీతత్వం పోలికత్వం.

ఆర్థిక సమస్యలు 'సోషల్ స్టేటస్ 'విలాస జీవనం ఇతరులతో పోల్చుకొనే పోటీ తత్వం రాబడిని మించిన ఖర్చు ఇంటి పెద్దలు సరిగ్గా మేనేజ్ చేయలేక పోవడం వల్ల కుటుంబాలు పతమౌతున్నాయి.

ప్రస్తుత జీవనశైలి.

ప్రస్తుత జీవనశైలి మన. ఉమ్మడి లేదా విస్తరించిన కుటుంబ వ్యవస్థ. తరతరాలుగా కాపాడుతున్న సాంస్కృతి విలువలు దెబ్బ తినడానికి ప్రస్తుత జీవనశైలే కారణమని చెప్పవచ్చు ఇదే సమయంలో ఇతర దేశాలతో పోలిస్తే వసుదైక కుటుంబకం అన్న భావన మన రక్తంలోనే జీవించకు పోయింది. తరతరాలుగా మనం చాటి చెప్పుతున్న ఈ భావనను భావితరాలకు మనం అందజేయవలసిన బాధ్యత ఉన్నది.

సామాజిక వేత్తల ఆందోళన.

భార్యా' భర్తలు (తల్లి దండ్రులు) మధ్య అవగాహన లేకపోవడం. ప్రతి చిన్న విషయానికి తగాదా పడుతూ ఉంటే ఇంటిల్లి పాది ఏదో దిగులుకు గురై ఇంటి నుండి వెళ్లిపోవడం. ఫ్యామిలీల్లో గొడవలు, కొట్లాటలు' తగాదాలు చూసి ఫ్యామిలీ అంటే జడుసు కుంటున్నారు. అన్యోన్యత ఆత్మీయత 'అనురాగాలు, ప్రేమతో, అవగాహనతో ఉన్న ఫ్యామిలీస్ కనుమరుగై పవిత్రమైన పునాదుల కలిగిన ఉమ్మడి కుటుంబాలు దూరమై కుటుంబ వ్యవస్థపై నమ్మకం సడలి పోతుందని ఈ స్థితి పలు సామాజిక సమస్యలకు దారి తీస్తుందని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒంటరితనం వ్యసనాలు.

కుటుంబ వ్యవస్థలోని మార్పులు 'పరిస్థితులు యువతను ప్రభావితం చేస్తున్నాయి .పిల్లలను హాస్టళ్లలో వుంచి చదివించడం వల్ల సురక్షిత భావన లోపించి ఒంటరితనం వ్యసనాలు పెరిగాయి .యువత లో మాదక ద్రవ్యాల ( డ్రగ్స్) వినియోగం పెరిగింది . వయసు 31 యేళ్లు దాటినా యువత పెళ్లి ముచ్చట ఎత్తడమే లేదు. గత నాలుగు దశాబ్దాలుగా కుటుంబాల్లో జరుగుతున్న మనస్పర్థలు, గొడవలతో విసిగి వేసారిన జనం ఫ్యామిలీ వ్యవస్థ వద్దు బాబోయ్ అని తమ పిల్లలకు నేరుగానే చెప్పే విచిత్ర పరిస్థితి దాపురించే సామాజిక ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రపంచీకరణ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ.

ప్రపంచీకరణ ' కార్పొరేట్ కల్చర్ 'ఆర్థిక స్థాయి 'ఆధునిక అవసరాలు, విదేశీ చదువులు 'విదేశీ కొలువులు ఆర్థిక వ్యత్యాసాలు, ప్రపంచీకరణ నేపథ్యంలో పిల్లలు విదేశాల్లో ఉండాల్సిన రావడం. పెద్దలు నిర్లక్ష్యానికి గురి కావడం దేశానికి సమాజానికి మంచిది కాదు. పోల్చుకోవడం' పోటీ తత్వం తదితర కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నిలబడని స్థితి నెలకొన్నది.

కుటుంబ విలువల క్షీణత.

ఉమ్మడి కుటుంబాల్లో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అన్నదమ్ములు 'అక్క చెల్లెలు కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడే బలమైన బంధం ఉంటుంది .అది పిల్లల్లో ఒక రకమైన భద్రతా భావాన్ని కలిగిస్తుంది .ఉమ్మడి కుటుంబాల్లో తాత' బామ్మలు పిన్ని " బాబాయిలు వారి పిల్లల మధ్య పెరిగిన వారికి పరస్పరము ఇచ్చిపుచ్చుకునే లక్షణాలు శ్రద్ధ ఒకరిపై మరొకరికి ప్రేమానురాగాలు అవగాహన వంటివి అబ్బుతాయి. చిన్న కుటుంబాల్లో పెరిగే పిల్లలకు ఈలక్షణాలు ఉండవు. ఒంటరితనం ఇతరులతో కలిసిపోయే తత్వంఉండదు. ఉమ్మడి కుటుంభల్లో కనపడే బంధాలు అనురాగం వల్ల పిల్లల భావోద్వేగాలపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఉమ్మడి కుటుంబాల్లో సవ్యంగా చక్కగా ఉండే అవకాశం ఉంటుంది. జగడాలు సంఘర్షణ యొక్క సందర్భాలు తక్కువగా ఉంటాయి. సర్దుబాటు తత్వం రాజీ ధోరణి వుంటుంది. కుటుంబ వ్యవస్థలో పెద్ద పట్ల గౌరవం శ్రద్ధ ఉంటుంది.

ఒంటరి కుటుంబాలు బినేర సంస్కృతి.

ప్రస్తుత ఒంటరి కుటుంబాలలో మమత మానవీయత' నైతిక విలువలు సహకారం' ప్రేమ 'దయ 'కరుణ జాలి 'అంతరించాయి. వ్యక్తుల్లోన భౌతిక వాదం పెరిగి స్వార్థ పూరిత మనస్తత్వం పగలు ద్వేశాలు పెరిగాయి . మనుష్యులు అంటే విలువ లేదు. మనిషికి మరో మనిషి అంటే బోర్ వచ్చేసింది. మానవీయ బంధాలు అంతరించి "మనీ" సంబంధాలే బంథాలైనాయి. (రాజ్యమేలుతున్నాయి) అధిక జనాభా, విలాస జీవనశైలి తమ సుఖ సంతోషాలకు అడ్డు వచ్చిన వారిని అంతమొందించే హింసా ప్రవృత్తి కుటుంబాల్లో పెరిగి నేర సంస్కృతి నెలకొనడం గమనార్హం.

కౌన్సెలింగ్( మధ్యవర్తిత్వ) వ్యవస్థ లేకపోవడం.

.ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై స్వేచ్ఛా 'స్వతంత్ర కుటుంబాల సంఖ్య పెరిగింది . కుటుంబాలలో ఏర్పడే వివాదాలు' తగాదాలు తీర్చే పెద్దల కౌన్సెలింగ్ వ్యవస్థ లేదు. మధ్య వర్తిత్వం వహించే పెద్దలు వృద్ధులు ఓల్డేజ్ హోంల్లో ఉంటున్నారు. రాజీ కుదిర్చే వ్యవస్థ లేకపోవడం కుటుంబాలను కంట్రోల్ చేసే సామాజిక వ్యవస్థ లోపించడం వల్ల వ్యక్తుల ఇష్టాలకు ప్రాధాన్యత పెరిగింది.

ఉమ్మడి కుటుంబం బిజాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం.

ఉమ్మడి కుటుంబంలో పెద్దలు ఒకరి అవసరాలు ఒకరిపై శ్రద్ధ వహించడం భవిష్యత్తులో ఏ రకమైన ఆదా చేస్తే పిల్లలకు సురక్షితమైన ఆర్థిక భవిష్యత్తు ఉంటుందో ఆలోచించి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం జరుగుతుంది. మనదేశంలో దారిద్ర రేఖ కింద జీవిస్తున్న వ్యక్తి కూడా జీవనోపాధి గడుపుకునే మనిషి కూడా ముందుగా తమ సోదరి వివాహం అయిన తర్వాత తనుచేసుకోవాలని ఆలోచిస్తాడు. ఉమ్మడి కుటుంబం త్యాగాలకు పునాదులు.

నిర్వహణ నైపుణ్యం

గృహనిర్వహణ కుటుంబ నిర్వహణ గొప్పకళ. అనుభవం వయసుతో నిర్వహణ కళ అబ్బుతుంది కుటుంబ బడ్జెట్ రూప కల్పన గొప్ప కళ అందరికీ లేకపోవడం వల్ల కుటుంబ వ్యవస్థ అతలా కుతలం అవుతుంది.

ఎవరికి వారే యమునా తీరే.

మెరుగైన మానవ సంభందాలు సత్ ప్రవర్తన సచ్ఛీలత 'మర్యాధలు అవగాహన కుటుంబ విలువలు పాటించే పరిస్థితులు క్షిణిస్తున్నాయి. మొండిగా మొరటుగా ప్రవర్తిస్తున్నారు. నేను నాభార్య/భర్త నా పిల్లలు అనే సిద్దాంతం పోయి నాది నాదే అనే పాలసీ వచ్చింది. పిల్లలకు పెళ్లి కాగానే వేరు పడేయటం వేరు పడి సొంత ఇల్లు / అద్దె ఇల్లు తీసుకొని పెళ్లి చేసుకునే సంపూర్ణ స్వతంత్ర వ్యక్తుల సంఖ్య పెరిగపోవటం నూతన ఆచారమైంది. ఎవరికి వారే యమునా తీరే సంస్కృతి నెలకొంది.

విలువల క్షీణత.

కుటుంబ విలువలు,కట్టు బాట్లు ఇక ఉండవు. ఇష్టారాజ్యం రోజులు వచ్చాయి. అన్నా దమ్ములు, అన్నా చెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ళ, భార్యా భర్తల మధ్య బలమైన బంధాలు ఇప్పుడు లేనే లేవు. సమస్త మానవ సంబంధాల స్వభావ స్వరూపాలు మారిపోయి కుటుంబ పరువు 'ప్రతిష్టలు మసక బారుతున్నాయి. మనిషి తత్వం అంతరించి" మనీ"తత్వం పెరిగింది.

నెట్టింట బంధాలు.

ప్రపంచీకరణ 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 'డిజిటలీ కరణ విస్తరించి డిజిటల్ ప్లాట్ ఫామ్ పైన ఉన్నటువంటి నెట్టింట (ఇంటర్నేట్)బంధీయైన సంబంధ బాంధవ్యాలే తమకి నిజమైనవి అనే అపోహలో బతుకుతున్న జనం పెరిగి పోతున్నారు.

ఆన్లైన్ శ్రద్ధాంజలి.

ఒక వ్యక్తి మరణిస్తే వాట్సాప్ లో 'ఫేస్బుక్లో ఆకర్షణీయమైన మెసేజ్ పెట్టి అంతటితో వదిలేస్తున్నారు. తన శ్రద్ధాంజలి( సంతాపాన్ని) నలుగురి మధ్య ఘటించే ఓపిక లేకుండా బిజీ జీవనానికి అలవాటు పడటం శోచనీయం. మోయడానికి కూడా నలుగురు రాని పరిస్థితులు దాపురించాయి.

సామాజిక ఉద్యమం.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనానికి సమాజంలోని అన్ని వ్యవస్థలు సమాన బాధ్యతవహించాలి. ప్రభుత్వం నూతన విద్యా విధానం లో నైతిక విలువలు మానవీయ విలువలను పాఠ్యాంశంగాచేర్చాలి .పాఠశాల కళాశాల స్థాయిలో హిందూ సంస్కృతి 'ఆధ్యాత్మికత 'వేదాలు ఉపనిషత్తులు 'భగవద్గీత పారాయణం పట్ల విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఉమ్మడి కుటుంబం పవిత్రత ప్రాముఖ్యత పట్ల ప్రతి కుటుంబంలో చర్చించాలి .

కుటుంబాలలో వృద్ధులను వేధించడం మానుకోవాలి. వారిపై దాడులు చేయకూడదు. వృద్ధుల సంరక్షణ చట్టాలు సక్రమంగా అమలు జరగాలి .వృద్ధులను గౌరవించే సంస్కృతిని వాతావరణాన్ని ప్రోత్సహించాలి. పర్యావరణం విధ్వంసం వల్ల జరిగే ఉపద్రవాల కన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనమైతే జరిగే సామాజిక ఆర్థిక ఉపద్రవాల గురించి మీడియా సినిమా ప్రచారం చెయ్యాలి. ప్రభుత్వం' స్వచ్ఛంద సామాజిక సంస్థలు ధార్మిక సంస్థలు మహిళా సంఘాలు యువజన సంఘాలు గ్రామ పంచాయితీలు సమిష్టిగా కృషి చెయ్యాలి . స్వాతంత్ర ఉద్యమ తరహాలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునర్జీవనానికి బలమైన సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలి.

మానవత్వం' ఆర్థత' విశాల హృదయం' సహనం 'మొదలైన భావాల స్ఫూర్తితో వసుదైక కుటుంబంకం నిర్మాణ ప్రక్రియలో సమాజం సంపూర్ణ బాగస్వామ్యమై ఉమ్మడి కుటుంబ పునర్జీవనానికి పునరంకిత మౌతుందని ఆశిద్దాం.



నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక విశ్లేషకులు
ఫ్రీలాన్స్ రచయిత
హైదరాబాద్
9440245771





# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం

కరీంనగర్, సెప్టెంబర్ 30(భారత శక్తి): పోలీస్ కమీషనరేట్ పరిధిలో పలు హోదాల్లో సుదీర్ఘకాలం పాటు పోలీసు సేవలందించి మంగళవారం పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన వారిలో కరీంనగర్ సిఎస్బిలో ఎస్సైగా పనిచేసిన ఆర్.రవీందర్ రెడ్డి (42 సంవత్సరాలు), టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏఎస్సైగా పనిచేస్తున్న ఎన్. భాస్కరచారి (42 సంవత్సరాలు), కరీంనగర్ రూరల్ పిఎస్ లో హెడ్ కానిస్టేబుల్ గా కె.వెంకటేశ్వర్లు పనిచేస్తున్న (35 సంవత్సరాలు) లు ఉన్నారు. వీరంతా తమ ఉద్యోగ జీవితంలో పోలీసు శాఖకు అంకితభావంతో సేవలందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఒక సాధారణ ప్రక్రియ అని, అయితే అనేక సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగాన్ని విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ పొందడం ఒక గొప్ప విజయమని కొనియాడారు. పోలీసు అధికారులు అందించిన సేవలకు వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని ఆయన గుర్తు చేశారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న అధికారులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు

వారికి జ్ఞాపికలను అందజేసి, వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు రిజర్వు ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, కరీంనగర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎస్సై మామిడి సురేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడ దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్త విభాగ సహాయ సంచాలకులు (వార్తలు)గా శ్రీ భగాతి తారకప్రసాద్ , ఐఐఎస్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, సెప్టెంబర్ 30:విజయవాడ దూరదర్శన్ కేంద్రం ప్రాంతీయ వార్త విభాగ సహాయ సంచాలకులు (వార్తలు)గా శ్రీతారకప్రసాద్ , ఐఐఎస్ ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారిగా 2000 నుంచి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. ఆయన ఆకాశవాణి న్యూఢిల్లీ న్యూస్ సర్వీసెస్ డివిజన్ లో సహాయ సంచాలకుడిగా పని చేస్తూ విజయవార్త దూరదర్శన్ కు బదలిపై వచ్చారు. ఆయన గతంలో నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలో ఫీల్డ్ పబ్లిసిటీ ఆధికారిగా పని చేశారు.



ఆయనకు దూరదర్శన్ ప్రాంతీయ వార్త విభాగం అధిపతి షఫి మహమ్మద్, ఐఐఎస్, దూరదర్శన్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా తారక ప్రసాద్ మాట్లాడుతూ కొత్త టెక్నాలజీ వినియోగించుకుంటు మానవీయ కోణంలో వార్తలను ప్రసారం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

# భూ కాలుష్యాన్ని అరికట్టాలి..భూరక్షణే జన రక్షణ

ప్రకృతి ప్రసాదిత మైన భూమిని మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. మానవ జాతి మనుగడకు ఆధారమైన భూమిని అభివృద్ధి పేరుతో విధ్వసం చేస్తు ఆహార కొరత ను సృష్టించడం గమనార్హం. ఆహారం జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు.

వ్యర్థాలు భూసారం

గృహ వ్యర్థాలు చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బతింటుంది. మన దేశములో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడించాయి. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్నివంథల సంవత్సరాల వరకు భూమి లో నాశనం కాకుండా నిలువ వుండడం వల్ల భూమి ఉత్పాదకత శక్తి తగ్గుతుంది. జాతీయ ఉత్పత్తి ఉత్పాదకత తగ్గి ప్రజల ఆదా యాలు జీవన ప్రమాణాలు ఆశించిన మేరకు పెరగలేదు.

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎకనామిక్ ఫోరమ్ ఆందోళన

పశువులు పక్షులు ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల చనిపోతున్నాయి. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ప్రమాదకరంగా పరిణమించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం భారత్ లో ఏటా యాబై ఆరులక్షల టన్నుల చెత్త పోగుపడుతుంది. ఈ స్థితి ఇలానే కొనసాగితే2020 నాటికి దేశములో 12 బిలియన్ల చేత్తను శుభ్ర పరచడానికి వందల సంవత్సరాలు పట్టవచ్చు నని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తన సర్వేలోవ్యక్తం చేసింది.

భూకాలుష్య నివారణ చర్యలు

పెరుగుతున్న భూకాలుష్యాన్ని అరికట్టే చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలి.

1) పెరుగుతున్న జనాభాను అరికట్టాలి.
2)భూమి ఉత్పాదకతను పెంచాలి.
3)ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.
4)ఐర్లాండ్ దేశములో మాదిరి ప్లాస్టిక్ వినియోగం పై భారీ జరిమానాలువిధించాలి.
5)మలేషియాదేశంలో జరిమానాల మూలంగా ప్లాస్టిక్ వినియోగం 94 శాతం తగ్గింది.
6)చిత్తడి నేలల పెంపకం
7)సామాజిక వనాల పెంపకం
8) చిట్టడవుల సంరక్షణ
9) ఉద్యాన వనాలు పబ్లిక్ పార్కులు
10) ప్రజల రిక్రియేషన్ సౌకర్యాలు పబ్లిక్ పార్కుల నిర్వహణ పాలనలో నగరాలలో రెసిడెన్షియల్ అసోసియేషన్ లను భాగస్వామ్యం కలిగించాలి .
11) భూమి ' నీరు సహజ వనరుల సంరక్షణ ఉద్యమంగా కొనసాగాలి .
12)జీవావరణం పర్యావరణం కాలుష్య నియంత్రణ ఒకే కాలములో జరుగాలి.
13)ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన చైతన్య సదస్సులు ప్రభుత్వం స్వచంద సంస్థలు పౌరసమాజం యువత సామాజిక సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా నిర్వహించాలి.
14) ప్రకృతి వ్యవసాయం విధానాలను గ్రామీణ ప్రాంతాలలో విస్తృత స్థాయిలో ప్రచారం చెయ్యాలి.
15) భూమిని కాలుష్యం పరిచే రసాయనిక ఎరువులవాడకాన్ని తగ్గించాలి.
16)నీటి నిలువ భూమీకోత నివారణ నిర్వహణ విదానాలమీధ అవగాహన సదస్సులు నిర్వహించాలి. 17)భూకాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వాలు అనుమతులు. ఇవ్వకూడదు. భూమిప్రకృతి ప్రసాదితం . భూమి పై జనాభాను పెంచగలం' కాని భూమిని పెంచలేం.
18)సంప్రదాయేతర ఇందన వనరుల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి.


సోలార్ విద్యుత్ శక్తి ఉత్పత్తి.సామర్థ్యాన్ని పెంపొందించే కార్యాచరణతో ప్రభుత్వాలు ముందుకు వచ్చి భూరక్షణే జన రక్షణ అన్న స్పృహను సమాజములో కలిగించాలి.



నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
హైదరాబాద్ 9440245771

# పాటల పల్లకి పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్, సెప్టెంబర్ 30(భారత శక్తి):



కరీంనగర్ వాస్తవ్యురాలు అనంతోజు పద్మ శ్రీ రచించిన బతుకమ్మ పాటల పల్లకి పుస్తకాన్ని మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ జానపదుల హృదయ స్పందనను పాటల రూపంలో రచించి బతుకమ్మ పాటల పల్లకి పుస్తకాన్ని వెలువరించిన కవియిత్రి అనంతోజు పద్మశ్రీ అభినందనీయురాలన్నారు.. తెలంగాణ ప్రాంతీయ సంస్కృతిని పద్మశ్రీ అద్భుతంగా అక్షరబద్ధం చేశారని, తెలంగాణ సంప్రదాయాలకు పట్టం కట్టే ఇటువంటి మరిన్ని రచనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి కుటుంబ సభ్యులు జూపాక మల్లేశం, శాలిని, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత నిమజ్జనంకు క్రేన్లు ఏర్పాటు చేయాలి నగర పాలక కమిషనర్ కు వినతి

## పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్, సెప్టెంబర్ 30(భారత శక్తి): దుర్గామాత నిమజ్జనం సందర్భంగా క్రేన్ లు ఏర్పాటు చేసి, భక్తుల కోరికను నెరవేర్చాలని టిపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి కి



మంగళవారం వినతి పత్రం అందజేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్ల పరిధిలోని సుమారుగా ఒక 300 దుర్గామాత మండపాలు ఉంటాయని, నవరాత్రులు ఎంతో భక్తిశ్రద్దలతో పూజలు చేయడం జరుగుతుందనీ చేసారు. ఇంతటి విశిష్టత కలిగిన దుర్గ మాత విగ్రహాలను చింతకుంటతో పాటు కొత్తపెల్లి ప్రాంతాలలో క్రేన్లు ఏర్పాటు చేయకపోవడం వలన నిమజ్జనం సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలియజేశారు. దుర్గామాత విగ్రహాలను అక్టోబర్ 2, 3, 4వ తేదీల్లో శనివారం రోజు ఇలా మూడు రోజులు పలు ప్రాంతాలకు సంబంధించిన దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేయడం జరుగుతుందని చెప్పారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ భవాని మాత భక్తుల కోరిక మేరకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని నిమజ్జన ప్రాంతాలలో క్రేన్ ఏర్పాటు చేస్తామని హామిచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఎండి ఇమ్రాన్, వీర దేవేందర్ పటేల్, అరుణ్ కుమార్, రేగొండ సందీప్, సిరిపురం మనోజ్ రమేష్, శ్రీనివాస్, కొండా హరీష్, ఇమ్రాన్, ఘని, భవాని భక్తులు శంకర్, శివనాద్, శ్రావణ్, రాకేష్ సాయి అఖిల్, హరి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలి

## రేణుక అక్షర మహిళ మండలి



మణుగూరు, సెప్టెంబర్ 30 (భారతశక్తి): ఈ నెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని రేణుక అక్షర మహిళ మండలి అధ్యక్షురాలు పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ సెంటర్ లో గల రేణుక అక్షర మహిళా మండలి కార్యాలయంలో మహిళా సీనియర్ నాయకురాలు ఎండి షబానా అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల గురించి విధి విధానాలను రూపొందించు కోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే వారికే మద్దతు ఉంటుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళ మండలి సభ్యులు కోరి శ్యామల, ఉపాధ్యక్షురాలు బొడ్డు సౌజన్య, రెడ్డీబోయిన రేణుక, దేరంగుల సుజాత, బాడీష పార్వతి పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటుతో అరాచక పాలన పై వేటు సుపరిపాలనకు (సమర్ధులకు) చోటు

## (ఓటు బుల్లెట్ కంటె బలమైంది)

భారత దేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత జాతీయ నాయకులు దేశ పరిస్థితులను దృష్టిలో వుంచకొని ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేశారు. 90 కోట్లకు పైగా ఓటర్లు లోకసభకు జరిగే 18 వ సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోపోతున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలవడం గర్వకారణం. ప్రభుత్వ నిర్మాణంలో పౌర సమాజం యొక్క క్రియా శీల పాత్రను గుర్తిస్తూ రాజకీ యాధికారంలో ప్రజలను భాగస్వాములను చెయ్యాలనే ఉద్దేశంతో రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేసుకున్నాం.

ప్రజాస్వామ్యం బిఓటు పునాది

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది.సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియో గించుకోవడం ద్వారా ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు.

ఓటర్లు వినియోగించిన ఓటు పైన ప్రభుత్వ స్వరూప' స్వభావాలు ఆధారపడి వుంటాయి. ప్రభుత్వం మంచిదైన' చెడ్డదైన దాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలే బాధ్యత వహించాలి. ఓటర్లు ఐదేళ్ల కాలానికి తన సార్వభౌ మాధికారాన్ని తమ ఓటు హక్కును వినియోగించి ఓటు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారు.' ఓటరు విచక్షణ మీధనే ప్రభుత్వాల ఏర్పాటు ఆధార పడి ఉంటుంది .మంచి నాయకులను ఎన్నుకుంటే మంచి పాలన సాధ్య మౌతుంది. సమర్ధులు' సేవాభావం వున్న నాయకులు చట్ట సభలకు ఎన్నికైతే ప్రజలకు మెరుగైన పాలన సిద్ధిస్తుంది. రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరుతాయి. నేర చరితులు అరాచక వాదులు' దుష్ట నేతలను' అవినీతి పరులను ఎన్నుకుంటే సమాజాన్ని దోచుకుంటారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారు. హింసాత్మక ధోరణులు ప్రభలుతాయి.

జాతి తల రాతను మార్చే ఓటు వజ్రాయుధం

దేశరక్షణ' భద్రత' దేశ సార్వమౌమాదికారన్ని రక్షించే 'సామర్థ్యం' మెరుగైన విదేశీ సంబంధాలు సమర్థవంతమైన దౌత్య నీతి' సుస్థిర పాలన అందించే సామర్థ్యం వున్న నాయకులను ఎన్నుకొని తమ తల రాతను మార్చే సత్తా ఓటుకు వుంది. సుపరిపాలన సుస్థిర పాలను అందించే మెరుగైన ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి ప్రజలకు ఓటే వజ్రాయుధం.

ఓటు హక్కు-విప్లవాత్మక మార్పు

భారత్ రాజ్యాంగం 326 ఆర్టికల్ ప్రకారం 18 సం"రాలు నిండిన జాతీయ పౌరులకు వయోజన ఓటుహక్కు కల్పించబడింది. కుల 'మత ' లింగ' ప్రాంత 'ధనిక' పేద 'వివక్ష లేకుండా అక్షరాస్యులకు'నిరక్షరాస్యులకు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించి ప్రపంచ రాజకీయ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టింది. అభివృధి చెందిన దేశాల కంటె ముందే మన దేశంలో వయోజన ఓటింగ్ హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది.

ఓటు హక్కు అందరికీ వజ్రా యుధం అయింది.

ఓటుతో ప్రశ్నించే హక్కు

ప్రభుత్వాల ఏర్పాటులో ఓటర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. ఓటు సామాన్యుని గొంతుకైంది .ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ప్రశ్నించే హక్కుఓటర్లకుసంక్రమించింది ఓటు హక్కు ద్వారా ఓటరు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కలిగి ఉన్నాడు. తమకు నచ్చిన ప్రజా ప్రతినిధులను ఎన్నుకునేఅధికారంవుంటుందిప్రభుత్వ సామర్థ్యం మెరుగు పరిచిఅవసరమైనమార్పులను అమలు చేయడానికి ఓటు దోహదపడుతుంది. ప్రభుత్వం నుండి మనకు ఏమి కావాలో డిమాండ్ చేయడానికి ఓటు సాధనం. లిఓటుమూల స్తంభంలి ఓటు హక్కు ద్వారా ప్రజల కోసం ప్రజల చేత ఏర్పడే ప్రజాస్వామ్య నినాదానికి ఓటు మూలస్థంభం .ప్రజా పాలన ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో సార్వ బౌమాధికారం అధికారం వుంటుంది.ఓటు హక్కు ద్వారా 5 ఏళ్ళకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ సార్వ భౌమాధికారాన్ని వినియోగించిప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు.

ప్రజలే ప్రభువులు

అమెరికా మాజీ అధ్యక్షులు "అబ్రహం లింకన్" అభిప్రాయం ప్రకారం " ప్రజల చేత ప్రజల కొరకు నిర్వహించబడే ప్రజల ప్రభుత్వం" ప్రజాస్వామ్యం అని నిర్వచించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజా0స్వామ్య మనుగడకు ఓటే పునాది.

నెహ్రూ ప్రజాస్వామ్యం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో మొదటి భారత దేశ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ భారతదేశాన్నిఆదర్శవంతమైన ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దాడు. పార్లమెంట్లో పూర్తి స్థాయిలో మెజారిటీ వున్నప్పటికీప్రతిపక్షనాయకుల సూచనలకుగౌరవ ంఇచ్చేవారు. దేశ సంక్షేమం 'అభివృధి' దేశ రక్షణ 'మొన్నగు అంశాల పట్ల పార్లమెంట్లోచర్చజరిగినప్పుడు ప్రతిపక్షాలుఇచ్చిననిర్మాణాత్మక సలహాలు 'సూచనలకు తగినవిలువఇచ్చేవాడు.పార్లమెంట్లో చర్చలు సమగ్రంగా జరిగేవి. జాతి హితమే పరమావధిగా జరిగే సుదీర్ఘ చర్చల్లో ప్రతి పక్ష నాయకులు నిర్మాణాత్మక .పాత్రపోషించారు.నెహ్రూ విధానాలను ప్రపంచ స్థాయిరాజనీతిజ్ఞులు ప్రశంసించారు.బ్రిటిష్ దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త "హాల్టెన్ " భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపనితీరునుప్రశంసించారు. భారత దేశంలో ప్రశ్నించే హక్కుతో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతు ందని హాల్టెన్ వ్యాఖ్యానించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో అధికార పార్టీ' ప్రతిపక్షాలు ఎన్నికల సమయంలోనే రాజకీయాలకు ప్రధాన్యత ఇచ్చేవారు. దేశ అభివృద్ధి 'వ్యవసాయ పారిశ్రామిక ' సేవా రంగాల అభివృద్ధి ' ఆర్థికాభివృద్ధి ' ప్రాజెక్టుల నిర్మాణం ' దేశ రక్షణ మొన్నగు అంశాలలో రాజకీయాలకు అతీతంగా విభిన్న రాజకీయ పార్టీలు ఏక తాటి మీధ కలిసి పనిచేసేవి. కాల క్రమేణా సమకాలీన సమాజంలో మార్పులు వచ్చాయి. దేశంలో బహుళ రాజకీయ పార్టీల సంఖ్య పెరిగింది.21.వ శతాబ్దం నాటికి రాజకీయ రంగంలో నైతిక విలువలకు' సామాజిక విలువలకు తిలోదకాలిచ్చే సంస్కృతి పెరిగింది. రాజకీయాల్లో ధనస్వాములు' నేరస్థులు' మాఫీయాలు ' 'రౌడీలు ' కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు చట్ట సభల్లోకి ప్రవేశించి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా' తాయిలాల స్వామ్యంగ మార్చివేశారు.

ఆదునిక రాజకీయాలలో పార్టీ పిరాయింపులు ఉధృతి ఒక వైపు ఉచితాలు ప్రలోభాలు మరోవైపుజోరందు కున్నాయి. . రాజకీయ నాయకుల్లో అవకాశ వాదం ' అధికార దాహం పెరిగింది. పదవుల కోసం అధికారం కోసం ప్రజలను కులం' మతం ప్రాంతం 'బాషా 'ప్రాతిపదిక చీల్చే రాజకీయాలు జోరందుకున్నాయి. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం అంతరించింది. సమిష్టి నిర్ణయాల కన్న వ్యక్తి నిర్ణయాలకు లేదా ముఠా నిర్ణయాలకు ప్రాధాన్యత పెరిగింది. పార్టీలలో సమిష్టి నిర్ణయాలు కాగితాలకే పరిమితమైనాయి. వ్యక్తి పూజ పెరిగింది. పార్టీ సిద్ధాంతాల కన్న వ్యక్తి కేంద్రంగా తీసుకునే వ్యక్తి గత నిర్ణయాలే పార్టీ నిర్ణయాలుగా చెలామణి అవుతున్నాయి. రాజకీయాలు ప్రజా సేవా కాకుండా రాజకీయాలను వృత్తిగా భావించే వారు ఎక్కువైనారు. ప్రజా జీవితంలో సంబంధాలు లేని వ్యక్తులు పార్టీ అధిష్ఠానం వద్ద డబ్బు సంచులు కుమ్మరించి టికెట్లు కొనే వ్యాపారానికి తెర తీశారు. రాజకీయాల్లో వాణిజ్య దోరణులు ప్రభలి డబ్బులిచ్చి టికెట్లు కొనే వారి సంఖ్య పెరిగింది. అవినీతి పరులు పారిశ్రామిక వేత్తలు చట్ట సభ సభ్యులుగా ఎన్నికయ్యే వారి సంఖ్య పెరిగింది. రాజకీయ అవినీతి పెరిగిపోయింది. ప్రజల్లో నెలకొన్న నిరాశ' నిర్లిప్తత 'అవినీతి పరులకు తోడైంది. పాలనలో అవినీతి వ్యవస్థాగతమైంది. ప్రభుత్వ పాలనా వ్యవస్థ అవినీతితో భ్రష్టు పట్టిపోయింది. ఓటు వేయడం పట్ల శ్రద్ధ తగ్గింది. ఓటర్లు తమ చేతిలో వున్న సార్వభౌమాధికారాన్ని ఓటు అనే ఆయుదాన్ని వినియోగించడం పట్ల ఆసక్తి చూపడం లేదు. రాజకీయ పార్టీల ఆర్థిక ప్రలోభాలకు లొంగి నోటుకు' మందుకు ఇతర స్వార్థ ప్రయోజనాలకు ఓటును అమ్ముకుంటున్నారు. నోట్లను ఇచ్చి ఓటు పొందిన స్వార్థ రాజకీయ నాయకులు అధికారాన్ని కైవసం చేసుకుని ప్రజలను అనేక రకాలుగా దోపిడి చేస్తున్నారు. స్వార్థ రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకు అనుకూలమైన చట్టాలు చేస్తూ పర్యావరణం' ప్రకృతి' సహజవనరుల విధ్వంసానికి పాల్పడి ప్రజల ఆస్తులను సంపదను కొల్ల గొట్టే శాసనాలు చేస్తూ ప్రజలను శాసిస్తున్నారు.

ధనస్వాములు నేరచరితులు

లోకసభలో 2004 లో 30 శాతం వున్న కోటీశ్వరులు 2018 నాటికి 82 శాతానికి పెరిగారు.2004 లో 24 శాతం వున్న నేర చరితులు 2019 నాటికి 44 శాతానికి పెరిగారు.

2019 లో ఎన్నికైన ప్రజాప్రతినిధుల ల్లో29 శాతం తీవ్ర నేర అభియోగాలు వున్నట్టు సర్వేల్లో వెల్లడైంది.

నేర గ్రస్త రాజకీయాల వల్ల దేశ ప్రతిష్ట దెబ్బతింటుందని గతంలో సుప్రీమ్ కోర్టు చేసిన హెచ్చరిక రాజకీయ పార్టీలు పట్టించుకోలేదు.చట్టాలు ఉల్లంఘించే వారు శాసన నిర్మాతలు కారాదని నేర స్వభావం వున్న వారు ఎన్నికల ప్రక్రియను కలుషితం చేస్తున్నారని సుప్రీమ్ కోర్టు పలు మార్లు హెచ్చరించింది.

కేసుల విచారణలో జాప్యం

హత్యలు'అత్యాచారాలు 'దోపిడీలు అపహరణ' మనీలాండరింగ్ లాండ్'. 'సాండ్' మాఫియాకు. పాల్పడిన వారు చట్టసభలకు ఎన్నికై యధేచ్ఛగా ప్రజలను వంచిస్తున్నారు.

ప్రస్తుతం ప్రత్యేక కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 4474 కేసులు ఉన్నాయి. కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతుంది.వేదింపులు' హత్య 'అపహరణ లాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తి ప్రభుత్వ ఉదోగానికి పనికి రాడు. ప్రభుత్వ కార్యాలయంలో స్వీపర్ కాలేడు. పోలీస్ కానిస్టేబుల్ కు పనికి రాడు. నేరాలకు పాల్పడిన వ్యక్తి చట్ట సభలకు ఎన్నికై మంత్రి అవుతాడు. ఈ పరిస్థితి పట్ల గత ఏడాది సుప్రీం కోర్టు సూటిగా ఆక్షేపించింది . తీవ్ర అవినీతి' ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎన్నికల్లో గెలుపొంది ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం భారత ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతి పట్ల సుప్రీమ్ కోర్టు తీవ్ర ఆక్షేపణ చేసింది.

ఎన్నికల కమిషన్బి స్వతంత్ర ప్రతిపత్తి

ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేస్తూ ఓటరు నమోదు' ఓటరు జాబితా తయారు 'దేశంలో చట్టసభల' స్థానిక సంస్థల 'ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎన్నికల్లో ఓటర్లు అందరు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ఓటు హక్కు నిర్లక్ష్యం

దేశంలో చాలా మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు1952 లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 45 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించారు.2019 నాటికి17 వ లోకసభ ఎన్నికల్లో67 శాతం మంది ఓటు వేశారు. మొత్తం ఓటర్లలో 90 శాతం ఓటింగ్ జరిగితే దేశం అభివృధి పథంలో పురోగమిస్తుందన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్య ఓటర్లకు కనువిప్పు కావాలి..

లిభారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి 'ఎన్' శేషన్ హెచ్చరిక ఓటర్లకు కనువిప్పు కావాలిలి

దేశంలో గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల సంఘం పరిశీలన ప్రకారం. అర్హులైన ఓటర్లలో 30 కోట్ల మంది ముఖ్యంగా పట్టణాలలో యువత' విద్యావంతులు 'వలస కార్మికులు' సార్వత్రిక ఎన్నికల కు దూరంగా ఉన్నారు. దక్షిణ భారత దేశంలో బెంగుళూర్' హైదరాబాద్ 'విశాఖపట్నం ప్రాంతాలలో అల్పంగా ఓటింగ్ జరిగింది. పౌరులు ఓటు వేయక పోతే చట్ట సభలకు చెడ్డ వారు ఎన్నికైతారు. మంచి వారు ఓటింగ్ కు దూరంగా ఉండటం వల్ల దుష్ట ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీస్తుందన్న మాజీ చీఫ్ ఎన్నికల కమిషర్ 'టి 'ఎన్ 'శేషణ్ వాక్య ఓటర్లకు కనువిప్పు కావాలి.

యువత దేశ భవిత

దేశ రాజకీయాల్లో యువత క్రియాశీలకంగా పాల్గొనాలి. యువత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.ఓటు వేయడం పై ఆసక్తి చూపడం లేదు. సాధారణ ఎన్నికల్లో యువత ఓటింగ్ శాతం గ్రామీణ' ప్రాంతాల కంటె పట్టణ ప్రాంతాలలో తక్కువ వుంటుంది.పట్టణ ప్రాంతాలలో చదువుకున్న వారు ఓటింగ్ పై ఆసక్తి చూపడం లేదు.ఓటింగ్ రోజును సెలవు దినంగా పాటిస్తు విహార యాత్రలకు వెల్లుచున్నారు.

నోటుకు ఓటు ప్రజాస్వామ్యానికి చేటు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం .ఓటరు విజ్ఞత ప్రదర్శించి నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. కాని రాజకీయ పార్టీలు ఓటును అంగడి సరుకుగా మార్చాయి .డబ్బు 'మద్యం వివిధ ప్రలోభాలకు ఓటును అమ్ముకునే నోటుకు ఓటు సంస్కృతి పెరిగి ప్రజాస్వామ్యానికి చేటుగా పరిణమించింది.రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బులు ఎరగా చూపి ఓటు వేయించు కుంటున్నాయి . రాజకీయ పార్టీలు హామీల హెూరులో హాస్రసు పాట పాడుతూ ఓటర్లను హైరానాకు గురిచేస్తూ ఓటు బ్యాంకుగా వాడుకొని ఎన్నికల్లో గెలిచి అధికార దాహంతో రాజకీయాలను వాణిజ్య పరంగా చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన దాని కంటే ఎక్కువ ఎన్నికల వ్యయం చేస్తున్న రాజకీయ పార్టీల మీద నియంత్రణ లేదు.ఈ పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థ స్ఫూర్తికి విఘాతంగా పరిణమించాయి.

ఓటును అమ్మకోవడం ద్వారా ప్రజలు ప్రజా ప్రతినిదులను ప్రశ్నించే హక్కును కోల్పోతారు. ప్రజాసంక్షేమం కుంటు పడుతుంది.ప్రగతి పురోగతి మందగిస్తుంది.

"కాళోజీ "మాట ఓటర్లకు స్ఫూర్తి కావాలి

దేశ భవిష్యత్తు నాయకుల చేతుల్లో వుంటుంది. ఆ నాయకుల తలరాత మార్చేది ఓటు" కాళోజీ అన్నట్లు "అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు ఏ పాటి వాడో చూడాలి" అన్న వాక్యను ఓటర్లు స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రజలకు ఇప్పటివరకు ఏమిచేశాడో గమనించి నేరచరిత లేని నిజాయితీ వంతులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకొని అవినీతి రహిత' నేరరహిత సుపరిపాలనకు 'అభివృద్ధికర రాజకీయ వ్యవస్థ నిర్మాణానికి ఓటర్లు ఉద్యమించాలి.

నిర్బంధ ఓటింగ్ విధానం

దేశ భవిష్యత్తు 'అభివృధి ప్రభుత్వాల మార్పుకు ఓటు వజ్రాయుధం లాంటిది. ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానాన్ని అమలు చెయ్యాలి. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో చూయిస్తున్న శ్రద్ధకంటే ఎక్కువగా ఓటింగ్ విధానం' ఓటు హక్కు వినియోగం 'ఇ'వి'ఎం'ల ఉపయోగం' ఎన్నికల విధానం ఎన్నికల అక్షరాస్యత మీద దృష్టి పెట్టాలి.??రాజకీయ పార్టీలు యువత విభాగం అద్ధ్వర్యంలో ఓటు నమోదు' ఓటరు గుర్తింపు ఆధార్ కార్డు తో ఓటరు కార్డు అనుసంధానం దొంగ ఓటర్ల గుర్తింపు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి. ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తికి శిక్షణ తరగతులు నిర్వహించాలి. ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల సంఘం 'పౌర సమాజం కృషి చేయాలి.

ప్రభుత్వం నిర్బంధ ఓటు హక్కును కల్పించాలి.

ప్రభుత్వం ఎన్నికల కమిషన్' పౌరసమాజం యువత' మహిళా సంఘాలు' స్వచ్ఛంధ 'సామాజిక సేవా సంస్థలు ఓటు హక్కు వినియోగం పై ఓటర్లకు అవగాహన చైతన్యం కలిగించాలి.

కళాశాలల్లో ఓటు హక్కు వినియోగం మీద సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనల ద్వారా ఓటర్లను చైతన్య పరచాలి .

"ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్ధులైన అభ్యర్థులకు ఓటువేసి ఎన్నుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యాలి"

అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ బల్లోపేతం అవుతుంది.

భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అంబేద్కర్ చెప్పినట్లు భారత దేశం చారిత్రకంగా వెనుకబడిన వర్గాలు' దళితులు' ఆదివాసీలు' తాడితులు ' పీడిత వర్గాలు' రాజకీయంగా అభివృధి చెందటానికి ఓటు హక్కు ముఖ్యమైన మార్గం అని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఓటు విలువ తెలుసుకొని ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించు కోవాలి. ఎన్నికల సంఘం 2011 జనవరి 25 ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తుంది. ఎన్నికల సంఘం ఎన్ని ప్రయత్నాలు చేసిన ఓటర్లలో చైతన్యం రాకుంటే ప్రజాస్వామ్యం బలోపేతం కాదు. దేశ భవిష్యత్తు బాగుపడాలన్న యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందాలన్న ఆర్థిక క్రమశిక్షణ' మెరుగైన నిర్వహణా సామర్థ్యం ఇనుమడించాలంటే విలువలతో కూడిన అభివృద్ధి కర సమర్ధవంతమైన ప్రభుత్వం ఏర్పడాలి. ప్రతి ఓటరు ఓటింగ్ రోజు సెలవు దినంగా పాటించకుండా తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునే దినంగా పాటించాలి. పోలింగ్ కు దూరంగా ఉండకుండ పోలింగ్ లో పాల్గొనాలి. రాజకీయ పార్టీల ప్రలోభాలకు లొంగ కుండ నోటుకు ఓటును అమ్మకోకుండ సమాజ అభ్యున్నతికిపాటు పడే వారిని ఎన్నికల్లో ఎన్నుకోవాలి. జాతి దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సామాజిక ఆధ్యాత్మిక 'సాంస్కృతిక 'ఆర్థిక 'పాలన 'న్యాయ సమస్యల పరిష్కార సామర్థ్యంవున్న నాయకులను చట్ట సభలకు ప్రతినిధులుగా ఎన్నుకోవాలి. 'జాతి ఉజ్వల భవిష్యత్తుకు ప్రగతి 'పురోగతి కి పాటు పడే సమర్ధులను లోకసభ సభ్యులుగా ఎన్నుకోవాలి .ఓటు వేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని గౌరవించడం.ఓటు వేయడం ప్రజలసామాజికబాధ్యత.ఓటు రాజకీయ మార్పుకు ఆయుధం.

ఓటరుగా వున్నందుకులిలిగర్వపపడుతున్న ఓటు వేయడానికి సిద్దంగా వున్న అనేది నినాదం కాకుండా



ఓటర్ల విధానంగా వర్ధిల్లాలి "ఓటు వేద్దాం ప్రజాస్వామ్య పరిపుష్టికి పాటుపడుదాం" అని ఓటర్లు ప్రతిజ్ఞ చేయాలి.

నేదునూరి కనకయ్య
అద్యక్షులు
తెలంగాణ ఎకనమిక్ ఫోరం
హైదరాబాద్9440245771

# 'కాంతార చాప్టర్ 1'తో పోటీ.. జాన్వీకపూర్ ఏమన్నారంటే





ఈదసరాకు ప్రేక్షకులను అలరించేందుకు ఇండస్ట్రీ సిద్ధమైంది. అక్టోబర్ 2న రిషబ్ శెట్టి 'కాంతార చాప్టర్ 1, 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' రెండూ విడుదల కానున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద పోటీ నెలకొననుంది.'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'లో ప్రధానపాత్రలో నటించిన జాన్వీ కపూర్, టీమ్ సభ్యులు వివరణ ఇచ్చారు. ఈ పోటీ గురించి జాన్వీ మాట్లాడుతూ.. "ఈ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కాయి. ఈరెండింటి మధ్య పోటీని చూడడమంటే.. ఓపెన్‌హైమర్, బార్బీలను పోల్చడమే. 'కాంతార' భారీ బడ్జెట్‌లో రూపొందింది. మా చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఇవి ఒకే తరహా చిత్రాలు కాదు.. వీటి మధ్య ఎలాంటి పోటీ ఉండదు" అని అన్నారు.

ఇక వరుణ్ ధావన్ కూడా ఈ విషయం గురించి ప్రస్తావించారు. "ఇప్పటికే మా సినిమాను చాలాసార్లు వాయిదా వేశాం. టీమ్ అందరం దీని కోసం కష్టపడ్డాం. కనీసం కొన్ని వారాల పాటు ఇది ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటుందని మాకు నమ్మకం ఉంది. ఇప్పుడు కుదరకపోతే మేం దీన్ని దీపావళికి విడుదల చేయాలి. ఆ సమయంలోనూ పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే గాంధీ జయంతి, దసరా సందర్భంగా విడుదల చేస్తున్నాం. ఈ విడుదల తేదీ విషయంలో నటీనటుల ప్రమేయం ఏమీ ఉండదు. ఇది నిర్మాణ సంస్థ తీసుకున్న నిర్ణయం. గతంలో ఒకే తేదీకి రెండు సినిమాలు విడుదలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలానే ఈ రెండూ కూడా ఆదరణ సొంతం చేసుకుంటాయి" అని అన్నారు.

జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రానికి (శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహించారు. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో ఇది రూపొందింది. ఇక 'కాంతార:చాప్టర్1' విషయానికొస్తే.. 2022లో విడుదలై విజయాన్ని సొంతం చేసుకున్న 'కాంతార'కు ప్రీక్వెల్‌గా రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందింది.





# దర్శకురాలిని అన్‌ఫాలో చేసిన దీపికా పదుకొణె

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ( పేరు గత కొన్ని రోజులుగా వార్తల్లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ఆమె పేరు సోషల్ మీడియాలో వినిపిస్తోంది. దీనికి కారణం బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకురాలు ఫరాఖాన్, దీపికా ఒకరినొకరు ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేసుకొన్నట్లు వార్తలు రావడమే.

ఇటీవల ఫరాఖాన్ నటి వర్కింగ్ అవర్స్‌పై ఫన్నీగా కామెంట్ చేసిన విషయం తెలిసిందే. ఓ షోలో పాల్గొన్న దర్శకురాలు దీపికాను ఉద్దేశిస్తూ.. 'ఆమె ఇప్పుడు పనిచేసేదే 8 గంటలు.. ఇక ఈ షోకు ఎలా వస్తారు. ఆమెకు అంత టైం ఎక్కడ ఉంటుంది' అన్నారు. ఫరాఖాన్ సరదాగా అన్న ఈ మాటలు బాలీవుడ్‌లో చర్చకు దారితీశాయి. దీంతో నటి ఆమెను అన్‌ఫాలో చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై దర్శకులు స్పందించారు. తాము మొదటినుంచి ఒకరినొకరం ఫాలో చేసుకోవడం లేదని తెలిపారు. 'హ్యాపీ న్యూ ఇయర్ సమయంలో మేం ఒక ఒప్పందం చేసుకున్నాం. సోషల్ మీడియాలో కాకుండా డైరెక్ట్‌గా మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నాం.

మేం ఒకరికి ఒకరం పుట్టినరోజు శుభాకాంక్షల పోస్ట్‌లు కూడా పంచుకోం. ఎందుకంటే దీపికకు అలాంటివి నచ్చవు" అని స్పష్టతనిచ్చారు.

వీరిద్దరూ కలిసి గతంలో కొన్ని సినిమాలకు వర్క్ చేశారు. 'ఓం శాంతి ఓం', 'హ్యాపీ న్యూ ఇయర్' సినిమాలకు ఫరాఖాన్ దర్శకత్వం వహించగా దీపిక ప్రధాన పాత్రలో నటించారు. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. అప్పటినుంచి వీరి స్నేహం కొనసాగుతోంది.



# అప్పుడే సత్యం బోధపడింది

వైపు కమర్షియల్ సినిమాల్లో సందడి చేస్తూనే.. మరోవైపు నాయికా ప్రాధాన్య చిత్రాలతోనూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తోంది నటి అనుపమ పరమేశ్వరన్. ఇటీవలే 'కిష్కింధపురి'తో తెలుగులో మరో విజయాన్ని ఖాతాలో వేసుకున్న ఈ నాయిక.. త్వరలో 'బైసన్' చిత్రంతో సినీప్రియుల ముందుకు రానుంది. అయితే ప్రస్తుతం వెండితెరపై వైవిధ్యభరితమైన పాత్రలతో జోరు చూపిస్తున్న ఈ మలయాళ సోయగం.. చిన్నతనంలో చదువులో వెనకబడి ఉండటం వల్ల నటి కాలేనని అనుకునేదట. దీని వెనకున్న ఆసక్తికర విషయాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది.

"నాకు చిన్నప్పటి నుంచి నటన అంటే చాలా ఇష్టం. కాకపోతే మా స్కూల్‌లో టాపర్స్‌కి మాత్రమే యాక్టింగ్‌లో అవకాశమిస్తారన్నది అలవాటు చేశారు. ఎందుకంటే బాగా చదివే వాళ్లే.. పెద్ద పెద్ద డైలాగుల్ని నేర్చుకోగలుగుతారు.. తేలికగా గుర్తు పెట్టుకుని చెప్పగలుగుతారు అనేవాళ్లు. ఆ మాటలన్నీ నా మనసులో బలంగా నాటుకుపోయాయి. నేనెలాగూ స్కూల్ టాపర్‌ను కాదు కాబట్టి ఇక నటిని అవ్వలేనని నమ్మడం మొదలు పెట్టా. నటి కావాలన్న నా కలను పూర్తిగా పక్కకు పెట్టేశా. నాకు కొంచెం ఊహ తెలిశాకే చదువుకు.. నటనకు ఏ సంబంధం లేదన్న సత్యం బోధపడింది. మేము చదువుని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తామోనన్న ఉద్దేశంతో స్కూల్‌లో అలా చెప్పేవారని తెలుసుకున్నా" అని చిన్ననాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంది అనుపమ.



# అందర్నీ ఆశ్చర్యపరుస్తాం

"ప్రతిసారి ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచాలన్న ఉద్దేశంతో వైవిధ్యభరితమైన కథలు, పాత్రలు ఎంచుకుంటూ ముందుకెళ్తున్నా. ఈ క్రమంలో ఇప్పుడు నా నుంచి వస్తున్న ఈ 'థమ్మా' సినిమాతోనూ అందర్నీ ఆశ్చర్యపరుస్తానని నమ్ముతున్నా" అంటోంది నటి రష్మిక. ఆమె.. ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రధారులుగా ఆదిత్యా సర్పోత్దార్ రూపొందించిన చిత్రమే 'థమ్మా'. మాడాక్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌తో పాటు ఈ చిత్రంలోని "నువ్వు నా సొంతమా" అనే గీతాన్ని విడుదల చేశారు.

> "ఈ మాడాక్ హారర్ యూనివర్స్‌లో భాగమవ్వడం చాలా సరదాగా అనిపించింది. మనం జానపద కథల్లో విన్న బేతాళుడికి నాయకుడైన థమ్మా చుట్టూ తిరిగే కథ ఇది. ఈ సినిమా ద్వారా తొలిసారి రష్మికతో కలిసి పని చేసే అవకాశం దొరికినందుకు ఆనందంగా ఉంది.

అనంతరం హీరో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ.. "ఈ మాడాక్ హారర్ యూనివర్స్‌లో భాగమవ్వడం చాలా సరదాగా అనిపించింది. మనం జానపద కథల్లో విన్న బేతాళుడికి నాయకుడైన థమ్మా చుట్టూ తిరిగే కథ ఇది. ఈ సినిమా ద్వారా తొలిసారి రష్మికతో కలిసి పని చేసే అవకాశం దొరికినందుకు ఆనందంగా ఉంది. ఆమె అద్భుతమైన నటి.. గొప్ప డ్యాన్సర్. ఇందులో నేను పోషించిన పాత్ర నాకే చాలా కొత్తగా అనిపించింది. ఇది నిజమైన పాన్ ఇండియా సినిమా. ఈ కాన్సెప్ట్ తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు.

"ఈ హారర్ యూనివర్స్ నుంచి ఇప్పటిదాకా వచ్చిన అన్ని చిత్రాల్ని మంచి కాన్సెప్ట్‌లతో రూపొందించారు. వీటిలో కథలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. పాత్రలన్నీ చాలా అద్భుతంగా ఉంటాయి. ఇప్పుడు నాపై నమ్మకంతో ఈ కథా ప్రపంచంలోకి నన్ను తీసుకురావడం నటిగా నాపై ఓ బాధ్యతను పెంచింది. ఇది నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. ఇంత మంచి అవకాశాన్ని నాకిచ్చినందుకు నిర్మాణ సంస్థకు కృతజ్ఞతలు" అన్నారు రష్మిక. ఈ కార్యక్రమంలో సునీల్ నారంగ్, జాన్వీ నారంగ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో దర్శకత్వం




'సావరియా'చిత్రంతో 2007లో బాలీవుడ్ సినీ పరిశ్రమలో తన కెరీర్‌ను ప్రారంభించారు నటుడు రణ్‌బీర్ కపూర్. 'రాక్‌స్టార్', 'బర్ఫీ', 'సంజూ', 'బ్రహ్మాస్త్ర' లాంటి అనేక విభిన్నమైన చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించాడు. తాజాగా రణ్‌బీర్ దర్శకత్వం చేయాలని ఉంది అంటూ తన ఆలోచనల్ని అభిమానులతో పంచుకున్నాడు. ఇటీవలే 43వ పుట్టిన రోజును చేసుకున్న రణ్‌బీర్ ఇన్‌స్టా ఖాతా 'ఆర్బ్' వేదికగా లైవ్ సెషన్‌లో అభిమానులతో ముచ్చటించాడు. దర్శకుడు ఆర్‌కే అని అభిమాని వేసిన ప్రశ్నకు స్పందిస్తూ.."నేను ఓ చిత్రానికి దర్శకత్వం వహించాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ మధ్యే రచనకు సంబంధించిన వర్క్‌షాప్‌ని కూడా ప్రారంభించాను. రెండు ఆలోచనలతో నన్ను నేను ప్రేరేపించుకోవడానికి ఈ ప్రయత్నం మొదలుపెట్టాను. కానీ రాబోయే రెండు సంవత్సరాలలో అవి కచ్చితంగా కార్యరూపందాల్చి నేను చేసే ప్రాజెక్టులలో భాగం అవుతాయి"అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే రణ్‌బీర్ 'యానిమల్' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'యానిమల్ పార్క్' సినిమా చిత్రీకరణ 2027లో ప్రారంభమవుతుందని వెల్లడించారు.

# పెళ్లి తర్వాత కొత్త చిత్రం?



గతేడాది కథానాయకుడు నాగచైతన్యతో వైవాహిక బంధంలోకి అడుగు పెట్టి కొత్త జీవితాన్ని ప్రారంభించారు నటి శోభిత. కానీ, ఆ తర్వాత తన నుంచి సినిమాల పరంగా ఏ కొత్త కబురు వినిపించలేదు. అయితే ఇప్పుడామె తదుపరి చిత్రం గురించి ఓ ఆసక్తికర విషయం బయట కొచ్చింది. ప్రముఖ తమిళ దర్శకుడు పా.రంజిత్ రూపొందిస్తున్న 'వెట్టువమ్'లో ఆర్య, వీఆర్ దినేశ్‌లతో కలిసి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇదొక విభిన్నమైన ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. శోభిత ఇందులో యాక్షన్ కోణంలో సాగే శక్తిమంతమైన పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో తెరపైకి రానుంది. 'తంగలాన్' లాంటి విజయం తర్వాత పా.రంజిత్ నుంచి రానున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొని ఉన్నాయి.

# పాక్ ఆటగాళ్లు మాపైకి వచ్చారు.. మేం బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాం: తిలక్ వర్మ




ఆసియా కప్ హీరో తిలక్ వర్మ మంగళవారం లింగంపల్లిలోని లేగల గ్రౌండ్‌ను సందర్శించాడు. అక్కడ శిక్షణ పొందుతున్న ఆటగాళ్లతో తిలక్‌వర్మ కరచాలనం చేశాడు. అతన్ని చూడడానికి పెద్దసంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు అతడు తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లలో సమాధానం ఇచ్చాడు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈసందర్భంగా ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా, పాకిస్థాన్ మూడుసార్లు తలపడ్డాయి. మొదటి రెండు మ్యాచుల్లో కంటే ఫైనల్‌లో పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా కనిపించిందన్నాడు.

'పాకిస్థాన్‌తో ఫైనల్‌మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో మేం కాస్త ఒత్తిడికి గురయ్యాం. అదే సమయంలో పాక్ ఆటగాళ్లు ఇదే అదునుగా మాపైకి వచ్చారు. వారు భారీఎత్తున స్లెడ్జింగ్‌కు దిగారు. మైదానంలో జరిగిన సంభాషణలు ఇక్కడ చెప్పడం సమంజసం కాదు. ఆ సమయంలో మేం ఉద్రేకానికి గురికాలేదు. సంయమనం పాటించాం. ఎందుకంటే టీమ్‌ఇండియా మ్యాచ్ గెలవడమే ముఖ్యం. అనవసరంగా ఆవేశానికి గురై.. ఏదైనా చెడ్డ షాట్ ఆడితే వికెట్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే వారికి మ్యాచ్ మధ్యలో సమాధానం ఇవ్వకుండా.. మ్యాచ్ పూర్తయ్యాకే విజయంతో జవాబు చెప్పాం' అని తిలక్ వర్మ అన్నాడు.

తను సాధించిన రెండు సెంచరీలకంటే కూడా, ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్ మీద ఆడిన ఇన్నింగ్సే తనకు ఫేవరెట్ అన్నాడు. తనను తీర్చిదిద్దిన చిన్ననాటి కోచ్ సలాంకు ఎవ్వటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ, సచిన్ తెందూల్కర్‌లా తాను కూడా కోచ్‌కు గౌరవ మర్యాదలు ఇస్తా అన్నాడు. అలాగే.. హైదరా బాద్ క్రికెట్ అసోసి యేషన్, బీసీసీఐకు కృతజ్ఞతలు తెలిపాడు.

## నీ వల్లే టీమ్‌ఇండియా తేలిగ్గా మ్యాచ్ గెలిచింది.. రవూఫ్ నీకు కృతజ్ఞతలు : రవిచంద్రన్ అశ్విన్



ఆసియా కప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియా పాకిస్థాన్‌పై నెగ్గి, విజేతగా నిలిచింది. అయితే ఈ విజయంలో పాక్ బౌలర్ హారిస్ రవూఫ్ కీలకపాత్ర పోషించాడు. ఈమేరకు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ( అతడికి తన యూట్యూబ్ ఛానల్ వేదికగా కృతజ్ఞతలు తెలిపాడు. ఈ మ్యాచ్‌లో రవూఫ్ ధారాళంగా పరుగులు సమర్పించుకోవడాన్ని అశ్విన్ ఇలా వ్యంగ్యంగా విమర్శించాడు.

తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ప్రారంభంలో తడబడింది. 20 పరుగులకు మూడు కీలక వికెట్లు కోల్పోయింది. అభిషేక్ శర్మ( శుభ్‌మన్ గిల్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ) బ్యాట్‌తో విఫలమయ్యారు. మిడిల్ ఆర్డర్‌లో నిలదొక్కుకొన్న తిలక్ వర్మ(కీలక ఇన్నింగ్స్ ఆడి టీమ్‌ఇండియాకు విజయాన్ని అందించాడు. 53 బంతుల్లో 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన తిలక్ వర్మను.. అశ్విన్ కొనియాడాడు. అలాగే ఈ విజయంలో పాక్ పేసర్ హారిస్ రవూఫ్ కీలక పాత్ర పోషించాడని చురకలంటించాడు.

'తిలక్ వర్మ అత్యద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. క్లిష్ట సమయంలో ఒత్తిడి తట్టుకొని అతడు చక్కగా రాణించాడు. మేం చాలా తేలిగ్గా మ్యాచ్ గెలిచాం. ఇందుకు హారిస్ రవూఫ్‌నకు కృతజ్ఞతలు' అని రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. 'తిలక్ వర్మ.. స్పిన్‌ను చక్కగా ఎదుర్కొన్నాడు. స్వీప్ షాట్లు బాగా ఆడాడు. బంతిని ఎక్కువగా గాల్లోకి లేపకుండా నేల మీదుగా కొట్టడంలో సక్సెస్ అయ్యాడు. పిచ్‌కు తగ్గట్లుగా, తెలివిగా.. తన షాట్ల ఎంపికలో మార్పులు చేసుకున్నాడు. అతడు చివర్లో రవూఫ్ బౌలింగ్‌లో కొట్టిన సిక్స్ తేలికగా అనిపిస్తుంది. కానీ ఆ షాట్ ఆడటం చాలా కష్టం' అని అశ్విన్ విశ్లేషించాడు. 'వరుణ్ చక్రవర్తి), కుల్‌దీప్ యాదవ్ ) చక్కగా బౌలింగ్ చేశారు. దీంతో భారత్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఫర్హాన్, ఫకార్ జమాన్ పాకిస్థాన్‌కు చక్కటి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే తర్వాతి బ్యాటర్లు దాన్ని సద్వినియోగం చేసుకోలేదు. పాకిస్థాన్‌కు, శ్రీలంకకు మధ్య ఇదే తేడా. శ్రీలంక ఆటగాళ్లు.. భారత స్పిన్నర్లను చక్కగా ఎదుర్కొన్నారు. షాట్ల ఎంపిక కూడా పాకిస్థాన్ ఆటగాళ్లతో పోల్చుకుంటే.. వారిదే బాగుంది' అని రవిచంద్రన్ అశ్విన్ విశ్లేషించాడు.

ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో హారిస్ రవూఫ్ బౌలింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. కేవలం 3.4 ఓవర్లలోనే అతడు 50 పరుగులు సమర్పించుకున్న విషయం తెలిసిందే.

# మహిళల వన్డే ప్రపంచకప్ ప్రారంభం.. భారత్ బ్యాటింగ్




గువాహటి: మహిళల వన్డే ప్రపంచకప్ అట్టహాసంగా ప్రారంభమైంది. మరికాసేపట్లో భారత్, శ్రీలంక జట్లు గువాహటి వేదికగా తలపడనున్నాయి. టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. స్వదేశంలో ఆడుతుండడం, ఇటీవలి ప్రదర్శన మెరుగ్గా ఉండడంతో భారత జట్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

భారత్ జట్టు: ప్రతిక, స్మృతి మంధాన, డియోల్, హర్మన్‌ప్రీత్, రోడ్రిగ్స్, రిచా ఘోష్, దీప్తి, అమన్‌జోత్, స్నేహ్‌రాణా, క్రాంతిగౌడ్, శ్రీచరణి.

శ్రీలంక జట్టు: చామరి, హాసిని, హర్షిత, విష్మి, కవీష, నీలాక్షి, అనుష్క, అచిని, సుగంధిక, ఉదేక్షిక, ఇనోక.

# ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్.. హార్దిక్ పాండ్య దూరం



: ఆసియా కప్ () గెలిచి జోష్ మీదున్న టీమ్‌ఇండియా. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులోభాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. టీ20 మ్యాచ్‌లు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు జరగనున్నాయి. అయితే వన్డే మ్యాచ్‌లకు టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య( దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఆసియా కప్‌లో గాయపడిన పాండ్య.. ఫైనల్‌లో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఆడని విషయం తెలిసిందే.

ఎడమ కాలి తొడ కండరానికి గాయం కావడం వల్ల పాండ్య ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా లేడు. అతడు కోలుకోవడానికి దాదాపు నాలుగు వారాల సమయం పట్టొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అయిదు టీ20ల సిరీస్‌లో మాత్రం ఆడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈవిషయమై ఇప్పటివరకైతే ఎలాంటి అధికారిక సమాచారమూ వెలువడలేదు. ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా విజయంలో హార్దిక్ పాండ్య కీలకపాత్ర పోషించాడు. జస్‌ప్రీత్ బుమ్రాతో ) కలిసి కొత్త బంతిని పంచుకున్నాడు. అలాగే మిడిల్‌ఆర్డర్‌లో బ్యాటింగ్‌లోనూ కీలకమైన పరుగులు చేశాడు. అయితే సూపర్4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా అతడు గాయానికి గురయ్యాడు. దీంతో అతడు ఆ మ్యాచ్‌లో కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. తర్వాత మైదానాన్ని వీడాడు. తాను సంధించిన ఆరు బంతుల్లోనే ఒక వికెట్ తీసుకున్నాడు. చివరికి ఆ మ్యాచ్ సూపర్‌ఓవర్ వరకు వెళ్లి, భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

అయితే ఈ ఆస్ట్రేలియా టూర్‌తోనే టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ వన్డేల్లో పునరాగమనం చేసే అవకాశాలు ఉన్నాయి. వీరిద్దరూ ఇప్పటికే టీ20లు, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్

# సూర్య క్రికెట్‌ను అవమానించాడు



దుబాయ్: ఆసియాకప్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయకపోవడం, ఫైనల్లో గెలిచాక ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వి నుంచి ట్రోఫీ అందుకోకపోవడం లాంటి చర్యలతో భారత జట్టు క్రికెట్‌ను అవమానించిందని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా అన్నాడు. "ఆసియాకప్‌లో భారత్ ప్రవర్తన నిరాశపరిచింది. మాతో కరచాలనం చేయకపోవడం క్రికెట్‌కే అవమానం. మెరుగైన జట్లు ఇలా చేయవు. టోర్నీ ఆరంభానికి ముందు విలేకరుల సమావేశంలో సూర్య నాతో కరచాలనం చేశాడు. తర్వాత ఎవరి ఆదేశాలనో అనుసరిస్తూ ప్రవర్తించాడు. విజేతలకు ఏసీసీ అధ్యక్షుడు ట్రోఫీ ఇవ్వడం ఆనవాయితీ. అతడి నుంచి ట్రోఫీ అందుకోకపోతే మీకు అదెలా వస్తుంది" అని ఆఘా అన్నాడు.

చెక్కు విసిరేసి..: ఆసియాకప్ బహుమతి ప్రదానోత్సవంలో పాక్ కెప్టెన్ ఆఘా అసహనాన్ని ప్రదర్శించాడు. ఆఘాకు రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.66.75 లక్షల చెక్‌ను అందించారు.

# ఆటకు క్రిస్ వోక్స్ వీడ్కోలు



లండన్: ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గత వారం యాషెస్ సిరీస్‌కు ఎంపిక చేసిన ఇంగ్లాండ్ జట్టులో చోటు దక్కకపోవడంతో 36 ఏళ్ల వోక్స్ రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లాండ్ తరఫున 15 ఏళ్ల కెరీర్‌లో వోక్స్ 62 టెస్టుల్లో 2,034 పరుగులు చేసి.. 192 వికెట్లు పడగొట్టాడు. 122 వన్డేల్లో 1,524.. 33 టీ20ల్లో 147 పరుగులు సాధించాడు. రెండు ఫార్మాట్లలో కలిపి 204 వికెట్లు తీసుకున్నాడు.

# మా జట్టే నా ట్రోఫీ

దుబాయ్: తనకు తెలిసి విజేతగా నిలిచిన జట్టు ట్రోఫీని తీసుకోకపోవడం ఇదే తొలిసారని.. కానీ తన జట్టే తనకు పెద్ద ట్రోఫీ అని భారత టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. "నేను క్రికెట్ ఆడడం మొదలుపెట్టిన నాటి నుంచి ఛాంపియన్ జట్టు ట్రోఫీ స్వీకరించకపోవడం ఇదే తొలిసారి అనుకుంటున్నా. ఎంతో కష్టపడితేనే కప్ వస్తుంది. వరుస విజయాలతో విజేతగా నిలిచాం. కప్ మాత్రమే తీసుకోలేకపోయాం. నావరకు అయితే మా జట్టే నాకు అసలైన ట్రోఫీ" అని సూర్య పేర్కొన్నాడు. 'ట్రోఫీ తీసుకోం అని బీసీసీఐ ముందే ఏసీసీకి ఈమెయిల్ పంపిందా' అని ఒక పాకిస్థాన్ జర్నలిస్ట్ సూర్యను ప్రశ్నించగా.. "ఏ ఈమెయిల్ గురించి నాకు తెలియదు. నఖ్వి నుంచి ట్రోఫీ తీసుకోకూడదని అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాం. ఇలా చేయమని మాకెవరూ చెప్పలేదు. మా ట్రోఫీ కోసం ఇప్పటికీ ఎదురు చూస్తున్నాం" అని సూర్య చెప్పాడు.

మ్యాచ్ ఫీజు పహల్గాం బాధితులకు..: భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన ఆసియా కప్ మ్యాచ్ ఫీజులను పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు, సైనిక సిబ్బందికి అందజేయాలని నిర్ణయించుకున్నాడు. "నా మ్యాచ్ ఫీజు మొత్తాన్ని పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనిక సిబ్బందికి అందజేయాలనుకుంటున్నా. మీరెప్పుడూ నా మనసులో ఉంటారు.. జైహింద్" అని సూర్య 'ఎక్స్'లో పేర్కొన్నాడు. ఆసియాకప్‌లో 7 మ్యాచ్‌లు ఆడడం ద్వారా సూర్యకు రూ.28 లక్షలు లభించనున్నాయి.

# బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..!

* అంబరానంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు..
* ఆటపాటలతో సందడి చేసిన మహిళమణులు.

మణుగూరు, సెప్టెంబర్ 30 (భారతశక్తి): తెలంగాణ సాంస్కృతిక, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ వేడుకలు.. మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా మహిళలు తలంట్టు స్నానాలు చేసి పొద్దంతా ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో వైభవంగా తంగేడు, టేకు, తామర, బంతిపూలు, గునుగు, చామంతి, రుద్రాక్షలు, మందార, నూరు వరహాలు, గుమ్మడి, తీరొక్క పూలతో సద్దుల బతుకమ్మ ను పేర్చారు. సమితిసింగారంలోని శ్రీ కోదండ రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ దగ్గర స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మహిళలతో ఆటపాటలతో నృత్యం చేసి అలరించారు. అదేవిధంగా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల శ్రీ శ్రీ శ్రీ వైకుంఠ సీతారామ చంద్ర స్వామివారి ఆలయం వద్దకు సాయంత్రం మహిళలు యువత చేరుకొని ఆలయం ముంగిట తులసి మొక్కను నాటి దాని చుట్టూ అందంగా పేర్చి గౌరమ్మలతో చేసిన బతుకమ్మలను పెట్టారు. దీనితో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. బతుకమ్మ పాటలకు మహిళలు, యువతులు, చిన్నారులు, ముసలివారి సైతం అడుగులో అడుగులు వేస్తూ.. చప్పట్లు కొడుతూ రాత్రి 11 గంటల వరకు చిందులు వేశారు. ఈ వేడుకలను చూసేందుకు రెండు కళ్ళు చాలవన్నట్లుగా చూపర్లు తమ చరవాణి లో బంధించి పరవశించి పోయారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మలు తీసుకువచ్చిన మహిళలకు చిరు బహుమతులు అందించి ఆనందింప చేశారు. శ్రీ శ్రీ శ్రీ వైకుంఠ




సీతారామ చంద్ర స్వామివారి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన దుర్గామాత నవరాత్రుల్లో భాగంగా వివిధ రకాల అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారికి 11 పట్టు చీరలు వచ్చాయని వాటిని దసరా పండుగ రోజు వేలం పాట నిర్వహిస్తామని కమిటీ వారు తెలియజేశారు. ఈ వేలం పాటలో భక్తులు, పట్టణ ప్రజలు అందరూ పాల్గొని అమ్మవారి పట్టుచీరలు దక్కించుకోవాలని కోరారు. అనంతరం గౌరమ్మలతో చేసిన బతుకమ్మలను చెరువు ఘాటు వద్దకు తీసుకెళ్లి పోయిరా.. బతుకమ్మా.. మళ్ళీరావమ్మా.. అంటూ నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ రోజు గౌరమ్మకు ఎంతో ప్రీతికరమైన సత్తుపిండి చేసి ప్రసాదాలుగా స్వీకరించారు.



## ఘనంగా బతుకమ్మ సంబరాలు

మునగనూరు, సెప్టెంబర్ 30 (భారత శక్తి): మునగనూరు శివ సాయిరాం కాలనీ రోడ్ నెంబర్ మూడు లో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. కాలనీ మహిళల ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా ఆడి పాడి తమ సంతోషాన్ని వెలుబుచ్చారు. ఈ కార్యక్రమంలో స్వాతి, జయశ్రీ, విమల, మహేశ్వరి, జస్వికా, జ్యోతి, ఉమా, శ్రీలత, భవ్య,జాహ్నవి, మృతిక,శిరీష పాల్గొన్నారు.

# మణుగూరులో 86 శాతం బొగ్గు ఉత్పత్తి






మణుగూరు,సెప్టెంబర్ 30 (భారతశక్తి): ఈ నెలలో 86 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. మంగళవారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో విలేకరులతో ఉత్పత్తి, ఉత్పాదకత గురించి నెల వారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 7 లక్షల 56 వేల 500 టన్నులకు గాను 6 లక్షల 47 వేల987 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించమన్నారు. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 30 సెప్టెంబర్, 2025 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 51 లక్షల 74 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 51 లక్షల 76 వేల 816 టన్నుల ఉత్పత్తి 100 శాతం వెలికితీయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ నెలలో మణుగూరు ఏరియా 6 లక్షల 47 వేల 987 టన్నుల బొగ్గును రవాణా చేశామన్నారు. 01ఏప్రిల్, 2025 నుండి 30 సెప్టెంబర్, 2025 వరకు ప్రోగ్రెస్సివ్ గా 51 లక్షల 63 వేల 639 టన్నులు రవాణా చేయడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 14 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 55 శాతంతో 7 లక్షల 71 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగిందని ఏరియా జియం మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జిఎం శ్రీనివాస చారి, డిజియం పర్సనల్ ఎస్ రమేష్, పీకేఓసి, మణుగూరు ఓసి ప్రాజెక్టు అధికారులు వీరభద్రరావు, శ్రీనివాసరావు, సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పీకేఓసి ప్రాజెక్ట్ అధికారిగా వీరభద్రరావు

పీకేఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ గా అడిషనల్ జనరల్ మేనేజర్ పెద్దమల్ల వీరభద్రరావు నూతన భాధ్యతలు చేపట్టారు. మణుగూరు సింగరేణి ఏరియా కొండాపురం భూగర్భ గని ప్రాజెక్ట్ అధికారిగా విధులను నిర్వహించిన వీరభద్రరావు ఇటీవల పదోన్నతి పై పీకేఓసి మణుగూరు ప్రాజెక్ట్ అధికారిగా నియమించబడ్డారు. సింగరేణి 11 ఏరియాలలో అతిపెద్ద ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారిగా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకతను పెంచేందుకు ఉన్నతాధికారుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ప్రాజెక్టును అగ్రస్థానం లో నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.




## ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

* స్థానిక సంస్థల ఎన్నికల అధికారులకు ఎంసీసీపై శిక్షణ

రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్ 30 (భారత శక్తి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్( ఎంసీసీ)పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు,ఎంపీఓలకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణకార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.హరిత హాజరై మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. విధుల్లో భాగంగా ఎఫ్ఎస్, ఎస్ఎస్టీ లు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించవద్దని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని,అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడంపై వివరించారు. ఎంసీసీ నోడల్ ఆఫీసర్ గా డీఆర్డీఓ శేషాద్రి నియమించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఉంటాయని తెలిపారు.ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ షర్ఫుద్దీన్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్క్ ఫెడ్ గేటు బద్దలుకొట్టైన రామ్ లీలాను నిర్వహిస్తాం

* బీ ఆర్ ఎస్ నగర అధ్యక్షులు చల్లా



కరీంనగర్, సెప్టెంబర్ 30 (భారత శక్తి): హిందూ పండుగలను కావాలని, కుట్రపూరితంగా అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు ఈ స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని బి ఆర్ ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మంగళవారం మార్క్ ఫెడ్ గ్రౌండ్ ప్రధాన గేటు ముందు మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరిశంకర్ మీడియాతో మాట్లాడుతూ రాంనగర్ మార్క్ ఫెడ్ గ్రౌండ్ లో గత కొన్ని ఏళ్లుగా గణేష్ ఉత్సవ కమిటీ, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా రామ్ లీలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలకు రాజకీయ పార్టీల నాయకులకు తెలుసని గుర్తుచేశారు. రామ్ లీలా కార్యక్రమాన్ని నిర్వహణ కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతులమీదుగా పూజా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. హిందూ పండుగలను అడ్డుకునే సంప్రదాయానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, అనిల్ కుమార్, బి. తిరుపతి నాయక్, రెడ్డవేణి మధు, ఏవీ రమణాలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దసరా పండుగ సందర్భంగా ఆశావర్కర్లకు, పూజారులకు, దుస్తులు పంపిణీ చేసిన మాదిరి ప్రిథ్వీరాజ్

సంగారెడ్డి, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు డివిజన్ పరిధిలో నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు, అలాగే భక్తుడికి దేవుడికి మధ్య వారధిగా నిలుస్తూ నిరంతరం సేవలందిస్తున్న పూజారులకు,దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల పౌష్టికాహార లోపం లేకుండా ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలను ఆశా వర్కర్లు నిత్యం చేరవేస్తున్నారు. అదే విధంగా పూజారులు తమ కుటుంబంతో కలసి దేవుడి సేవలో జీవితాన్ని



అంకితం చేస్తున్నారు. వీరందరికీ దసరా పండుగ సందర్భంగా కొత్త దుస్తులు అందజేయడం ఆనందంగా ఉంది

## ఎన్నికల ప్రవర్తన నియమావళిపై కలెక్టర్ సమావేశం




కరీంనగర్, సెప్టెంబర్ 30 (భారత శక్తి): స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు, రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు ( సర్పంచ్, వార్డు సభ్యులు) ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో జిల్లాలో ఎన్నికలు ముగుస్తాయని అన్నారు. మొదటి విడతలో హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని (6మండలాలు) ఇల్లంతకుంట, జమ్మికుంట, హుజురాబాద్, శంకరపట్నం, వీణవంక, వి సైదాపూర్ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. రెండవ విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని (9 మండలాలు) చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి,మానకొండూర్,రామడుగు,తిమ్మాపూర్ మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. మూడవ విడతలో కరీంనగర్ డివిజన్ పరిధిలోని మానకొండూర్ మండలం మినహా అన్ని మండలాలల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నాలుగో విడతలో హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలు సహా మానకొండూర్ మండల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉంటాయని అన్నారు. సర్పంచ్ వార్డు, సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహించిన అదే రోజు ఫలితాలు వెలుపడతాయని అన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నవంబర్ 11న ఉంటుందని అన్నారు. ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు ప్రతి మూడు, నాలుగు మండలాలకు ఒక ఆర్డీవో ను నియమిస్తున్నామని, మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ స్టేడియం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి అర్హతలు, ధరావత్తు వివరాలు, ఎన్నికల వ్యయం, నామినేషన్ ప్రక్రియ తదితర వివరాలను గురించి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే వివరించారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, బిజెపి, కాంగ్రెస్, బి ఆర్ ఎస్, సిపిఎం, సిపిఐ, ఏఐఎంఐఎం, టీడీపీ, బీఎస్పీ నాయకులు నాంపల్లి శ్రీనివాస్, బాస సత్యనారాయణ, వాసాల రమేష్, సిరాజ్ హుస్సేన్, మడుపు మోహన్, సాతినేని శ్రీనివాస్, మిల్కూరి వాసుదేవరెడ్డి, కే.మణికంఠ రెడ్డి, సయ్యద్ బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, సిరిసిల్ల అంజయ్య పాల్గొన్నారు.

# ప్రఖ్యాత కంపెనీ ఎయిర్ బస్ కోసం ఏపీ ముందడుగు... ఢిల్లీలో నారా లోకేశ్ కీలక సమావేశం

ఢిల్లీ, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : రాష్ట్రాన్ని ఏరోస్పేస్ రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముఖ్యమైన ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాత విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్‌ను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో ఆ సంస్థ పూర్తిస్థాయి బోర్డుతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 'మేకిన్ ఇండియా' అవకాశాలను పరిశీలించేందుకు తొలిసారిగా భారత్‌కు వచ్చిన ఎయిర్‌బస్ బోర్డు ముందు మంత్రి లోకేశ్ ఒక ఆకర్షణీయమైన ప్రతిపాదన ఉంచారు. ఈ భేటీలో ఎయిర్‌బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏపీలో కేవలం ప్రధాన యూనిట్‌ను మాత్రమే కాకుండా, దానికి అనుబంధంగా టైర్ 1, టైర్ 2 సరఫరాదారులు, ఇతర భాగస్వాములతో కూడిన ఒక ఇంటిగ్రేటెడ్ ఏరోస్పేస్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. దీనివల్ల తయారీ ప్రక్రియ వేగవంతం అవ్వడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, తక్కువ ఖర్చుతో ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న భూమి, పరిశ్రమలకు అనుకూలమైన ఏరోస్పేస్ పాలసీ, టెక్నాలజీ బదిలీకి ఉన్న సానుకూలతలను ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు




పెట్టుబడులను ఆకర్షించడంలో ఉన్న ట్రాక్ రికార్డును, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సింగిల్ విండో విధానంలో వేగంగా అనుమతులు ఇస్తామని, ప్రాజెక్టును నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ పెట్టుబడి ద్వారా రాష్ట్రాన్ని ఎగుమతి ఆధారిత ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ తెలిపారు. అభివృద్ధి చేస్తున్న ఏరోస్పేస్ కారిడార్లలో ఎయిర్‌బస్ అవసరాలకు తగినట్టుగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన బోర్డుకు హామీ ఇచ్చారు.

## 54 ప్రైవేటు వర్సిటీలకు యూజీసీ నోటీసులు

ఢిల్లీ, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : దేశవ్యాప్తంగా నిబంధనలు పాటించని ప్రైవేట్ యూనివర్సిటీలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవసరమైన కీలక సమాచారాన్ని తమ వెబ్‌సైట్లలో బహిర్గతం చేయడంలో విఫలమైన 54 ప్రైవేట్ యూనివర్సిటీలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈ చర్య ఉన్నత విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా యూజీసీ తీసుకున్న కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం, ప్రతి యూనివర్సిటీ తమ వద్ద అందుబాటులో ఉన్న కోర్సులు, ఫ్యాకల్టీ వివరాలు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఆర్థిక వ్యవహారాల వంటి పూర్తి సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎటువంటి లాగిన్ లేదా రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా ఈ వివరాలను ఎవరైనా సులభంగా చూసే వీలు కల్పించాలి. అయితే, ఈ నిబంధనలను 54 వర్సిటీలు ఏమాత్రం పట్టించుకోలేదని యూజీసీ తన నోటీసులో స్పష్టం చేసింది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు లేఖలు, ఈమెయిళ్ల ద్వారా హెచ్చరించడమే కాకుండా, ఆన్‌లైన్ సమావేశాల్లోనూ చర్చించినప్పటికీ ఆయా యూనివర్సిటీల నుంచి సరైన స్పందన రాలేదని యూజీసీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ మనీశ్ జోషి ఈ 54 వర్సిటీలకు లేఖలు రాశారు. "విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ఉన్నత విద్యా సంస్థల గురించి పూర్తి, ప్రామాణిక సమాచారాన్ని పొందే వీలుండాలి" అని ఆయన తన లేఖలో నొక్కిచెప్పారు. ఈ జాబితాలో గుజరాత్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లోని ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి. కేవలం వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తే సరిపోదని, అదే సమాచారాన్ని పర్యవేక్షణ కోసం తమ కమిషన్‌కు కూడా సమర్పించాలని యూజీసీ తేల్చిచెప్పింది. ఈ చర్యల ద్వారా ఉన్నత విద్యాసంస్థల్లో జవాబుదారీతనం పెంచడంతో పాటు, ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని యూజీసీ పునరుద్ఘాటించింది.

## విజయ్ పార్టీ నేత 'విప్లవం' పోస్ట్.. తమిళ రాజకీయాల్లో పెనుదుమారం!

తమిళనాడు, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సీనియర్ నేత చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ తీవ్ర రాజకీయ దుమారం రేపింది. అధికార డీఎంకే 'దుష్ట ప్రభుత్వం'పై నేపాల్ యువతలా తిరుగుబాటు చేయాలంటూ టీవీకే ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున 'ఎక్స్'లో పిలుపునివ్వడం వివాదానికి దారితీసింది. కరూర్ సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన 48 గంటల్లోపే ఈ పోస్ట్ రావడం గమనార్హం. వివాదం ముదరడంతో ఆ పోస్ట్‌ను వెంటనే తొలగించారు. "యువత నేతృత్వంలోని విప్లవమే దీనికి ఏకైక పరిష్కారం. శ్రీలంక, నేపాల్‌లలో 'జెన్ జీ' యువత అక్కడి ప్రభుత్వాలపై తిరగబడింది. ఇక్కడ కూడా యువతే విప్లవానికి నాయకత్వం వహిస్తుంది. ఆ విప్లవమే ప్రభుత్వ మార్పునకు కారణమవుతుంది. దుష్ట పాలకుడి కింద చట్టాలు కూడా దుష్టంగానే మారతాయి" అని అధవ్ అర్జున తన పోస్టులో పేర్కొన్నారు. రోడ్డుపై నడిచినందుకే పోలీసులు ప్రజలపై దాడులు చేస్తున్నారని, సోషల్ మీడియాలో అభిప్రాయాలు చెప్పినందుకు అరెస్టులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధవ్ అర్జున పోస్ట్‌పై డీఎంకే తీవ్రంగా స్పందించింది. లోక్‌సభ ఎంపీ కనిమొళి ఈ పోస్ట్‌ను 'బాధ్యతారహితమైనది' అని అభివర్ణించారు. ఇది రాష్ట్రంలో హింసను ప్రేరేపించేలా ఉందని ఆమె హెచ్చరించారు. వివాదం తీవ్రం కావడంతో టీవీకే వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ పోస్ట్‌తో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అది అర్జున వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేసింది. "పార్టీ గానీ, విజయ్ గానీ ఎన్నడూ ప్రజలను, హింసను రెచ్చగొట్టరు" అని టీవీకే వర్గాలు తెలిపాయి.

## ముఖ్యమంత్రిని కలిసిన క్రికెటర్ తిలక్ వర్మ.. రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్ బహూకరణ

హైదరాబాద్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : ఆసియా కప్ ఫైనల్‌లో రాణించిన తెలుగు యువ క్రికెటర్ తిలక్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిలక్ వర్మను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా తిలక్ వర్మ... సీఎం రేవంత్ రెడ్డికి క్రికెట్ బ్యాట్‌ను బహుమతిగా అందజేశారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి తిలక్ వర్మ ముఖ్యమంత్రిని కలిశారు. ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో తిలక్ వర్మ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

*** రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టూరిజం డిపార్టుమెంట్ ఎండీ క్రాంతి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సరూర్ నగర్ మైదానంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన నేపథ్యంలో వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ వేడుకలో అతిపెద్ద బతుకమ్మ, అతిపెద్ద జానపద నృత్యంగా సరూర్ నగర్ బతుకమ్మ వేడుక రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది.

## కోర్టులో చెల్లదని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారు


హైదరాబాద్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : కోర్టులో చెల్లవని తెలిసినా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించి గందరగోళానికి గురి చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విమర్శించారు. ఎవరిని మోసం చేయడానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ఆయన ప్రశ్నించారు. హన్మకొండ జిల్లా కమలాపూర్‌లోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, బీహార్, మహారాష్ట్రలలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లవద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని, కోర్టుకు వెళితే అభ్యంతరం ఏమిటని ప్రశ్నిస్తున్నానని ఈటల అన్నారు. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చు పెట్టవద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోందని అన్నారు. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా రిజర్వేషన్ ప్రకటించారని విమర్శించారు. తమ పార్టీ తరఫున శాసనసభలో, మండలిలో పూర్తిగా మద్దతు ఇచ్చామని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో బీజేపీని అనవద్దని సూచించారు.

## వెనుకబడిన ప్రాంతాలకు ఆ నిధులే కీలకం

అమరావతి, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థిక ప్రగతికి 'పూర్వోదయ' పథకం కింద ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఈ నిధులే కీలకమని ఆయన నొక్కిచెప్పారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట్‌కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖామంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం పనుల పురోగతిని గురించి కేంద్రమంత్రికి సీఎం వివరించారు.

## పాకిస్థాన్‌లోని క్వెట్టాలో భారీ పేలుడు... 13 మంది మృతి!

పాకిస్థాన్, 30 సెప్టెంబర్: పాకిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో భారీ పేలుడు సంభవించింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో పారామిలిటరీ దళాలపై జరిగిన ఈ బాంబు దాడిలో కనీసం 13 మంది మృతి చెందగా, 32 మందికి పైగా గాయపడ్డారు. క్వెట్టాలోని ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. పేలుడు జరిగిన వెంటనే కాల్పుల మోత కూడా వినిపించింది. ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. బలూచిస్థాన్ ఆరోగ్య మంత్రి బఖ్త్ మహమ్మద్ కాకర్ ఈ దాడిని ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని విధించారు. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ పేలుడుకు ఇప్పటి వరకు



ఏ సంస్థ బాధ్యత వహిస్తూ ప్రకటన చేయలేదు. అయితే, బలూచ్ తిరుగుబాటు గ్రూపులు తరుచూ భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుంటాయి. ఈ దాడిని బలూచిస్థాన్ ముఖ్యమంత్రి మీర్ సర్ఫరాజ్ ఖండించారు. ఇది ఉగ్రదాడి అని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదులు పిరికి చర్యల ద్వారా దేశం యొక్క సంకల్పాన్ని బలహీనపరచలేరని ఆయన అన్నారు. ప్రజలు, భద్రతా దళాల త్యాగాలు వృధా కానివ్వబోమని ఆయన స్పష్టం చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన లేక చాలామంది నష్టపోతున్నారు

హైదరాబాద్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత కొరవడటంతో చాలామంది నష్టపోతున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. నగర నూతన సీపీగా ఆయన ఈరోజు బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన అన్నారు. నగరంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటని, కానీ ఇక్కడ మనం డ్రగ్స్ సమస్యను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని ఆయన అన్నారు. అవసరమైతే మరింత సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. నేరగాళ్లు ఎక్కువగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలంతా అవగాహన పెంచుకోవాలని అన్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత బాగా చెడిపోతోందని, అలాంటి వాటిని ప్రోత్సహించవద్దని ప్రముఖులను కోరారు. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే కాల్స్‌ను విశ్వసించవద్దని ఆయన అన్నారు. అలాగే అరుదైన వ్యాధులకు ఔషధాలు అని చెప్పే వారిని కూడా నమ్మవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ మోసాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. కల్తీ ఆహారంపై ప్రత్యేక దృష్టి పెడతామని సజ్జనార్ వెల్లడించారు. ఇందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసి కల్తీ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య వల్ల సమయం వృథా కావడంతో పాటు ఆరోగ్యం కూడా పాడవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులు, మహిళలపై అఘాయిత్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


## హైదరాబాద్‌లోని 'తెలుగు తల్లి' ఫ్లైఓవర్ పేరు మారింది!

హైదరాబాద్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ, నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో తన విధులను అధికారికంగా ప్రారంభించిన అనంతరం, సజ్జనార్ తన కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. నగరవ్యాప్తంగా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడమే తమ బృందం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. "సమర్థత, సమగ్రత పునాదిగా నగర ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికి కృషి చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై, వారి భద్రతకు భరోసా కల్పించే దిశగా పోలీస్ శాఖ పనిచేస్తుందని సజ్జనార్ వివరించారు.



## కోస్తాంధ్రకు వర్ష సూచన... ఎల్లో అలర్ట్ జారీ

ఆంధ్రప్రదేశ్, 30 సెప్టెంబర్ (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ కోస్తా ప్రాంతాన్ని ఒకేసారి వర్షాలు, వరదలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఓవైపు ఉత్తర కోస్తా సమీపంలో ఉపరితల ఆవర్తనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, మరోవైపు కృష్ణా, గోదావరి నదులకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం, ఉత్తర కోస్తా పరిసరాల్లో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం రాబోయే 24 గంటల్లో అల్పపీడనంగా బలపడనుంది.



# సింగపూర్ లో ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలు

వేములవాడ, సెప్టెంబర్ 30 (భారత శక్తి) : తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు స్థానిక సంబవాంగ్ పార్క్ లో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యంత కోలాహలంగా కన్నుల పండుగగా బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ సాంప్రదాయ పాటలతో చిన్న పెద్ద తేడా లేకుండా అందరు ఆటపాటలతో ఎంతో హుషారుగా వేడుకలు అంబరాన్నంటాయి. భారతదేశం నుండి వచ్చిన స్థానికుల తల్లిదండ్రులు, బంధువులు కూడా ఈ వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కమిటీ సభ్యులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచార. ఈ సంబరాల్లో సింగపూర్ స్థానికులతో పాటు ఎంతో మంది అతిథులు ఎన్నారైలు 3000 మంది వరకు పాల్గొని బతుకమ్మ ఆడారు.ఈ వేడుకలలో పాల్గొన్న అంతర్జాతీయ శ్రీ కృష్ణ మందిరం,సింగపూర్ లో నివసిస్తున్న తెలుగు వారందరికీ స్థానికులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తు దశాబ్దానికి పైగా సింగపూర్ లో బతుకమ్మ పండుగకు విశేష ఆదరణ కలుగజేయడం ద్వార బతుకమ్మ వైభవాన్ని చాటి చెప్పుతూ తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ చరిత్రలో నిలిచిపోవడం జరిగిందని సొసైటీ సభ్యులు అన్నారు. ఇతర సంస్థలు కూడా బతుకమ్మ నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. సంబరాలు విజయవంతంగా జరుగుటకు సహాయ సహకారాలు అందించిన దాతలకు పేరు పేరున ప్రతి ఒక్కరికి టీసీఎస్ఎస్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తు ప్లాటినం, గోల్డ్, సిల్వర్ కేటగిరీ కార్పొరేట్ వ్యక్తిగత దాతలను శాలువాలతో సన్మానించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.ఆడపడుచులు బతుకమ్మలని పోటా పోటీగా చాలా అందంగా అలంకరించి బతుకమ్మలని పేర్చి తీసుకొచ్చారు. బతుకమ్మని పేర్చి తెచ్చిన ప్రతి ఆడపడుచుని రెడ్ కార్పెట్ పై స్వాగతించి తనిష్క్ జ్యూవెల్లర్స్ వారి గిఫ్ట్ హాంపర్ని బహుమతిగా అందజేశారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 11 బతుకమ్మలకు, ప్రత్యేక సాంప్రదాయ ఉత్తమ వస్త్రధారణలో ముస్తాబైన ముగ్గురు ఆడపడుచులకు సౌజన్య డెకార్స్ వెండి వస్తువులు,బిఎస్కే కలెక్షన్స్ సారీస్, కెఎస్ పట్టు ఫ్యాషన్స్ సారీస్, వియోమి ఫ్యాషన్స్ సారీస్ ప్రత్యేక బహుమతులు అందజేశారు.



## సంగారెడ్డిలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

* **పాల్గొన్న టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**
* **బతుకమ్మ ఆడిన మహిళలు**

సంగారెడ్డి, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకలు సంబరాన్ని అంటాయి. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని మహబూబ్ సాగర్ చెరువు కట్టపై ఆడపడుచులు బతుకమ్మను ఆడి పాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఉట్టిపడేలా అన్ని రకాల పువ్వులతో పేర్చిన బతుకమ్మను తీసుకువచ్చి ఆడపడుచులు ఆడి పాడిన అనంతరం మహబూబ్ సాగర్ చెరువులో నిమజ్జనం చేశారు. సద్దులు బతుకమ్మ వేడుకల సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెర్వు వద్ద బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వేడుకలను పురస్కరించుకొని, ఎలాంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేసినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వాసవి మా ఇల్లు అధ్యక్షులు తోపాజీ అనంత కిషన్, కూన సంతు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

* **ఎన్నికల కోడ్ అమలు**
* **పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం**



కరీంనగర్, సెప్టెంబర్ 30 (భారత శక్తి) : రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కమీషనరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సీపీ అధ్యక్షతన పోలీసు అధికారులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (Model Code of Conduct) అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఎన్నికల కోడ్ అమలు**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని సీపీ తెలిపారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని,నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుందని వివరించారు.

ఎలక్షన్ సెల్ ఏర్పాటు

వెంటనే కమీషనరేట్ కేంద్రంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అనుభవజ్ఞులైన అధికారులను, సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఈ సెల్ కమీషనరేట్ వ్యాప్తంగా అధికారులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు.

**అంతర్-జిల్లా చెక్ పోస్టులు**

అతి త్వరలో 6 అంతర్‌జిల్లా చెక్ పోస్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఈ చెక్ పోస్టుల వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**- బైండ్ ఓవర్**

గత ఎన్నికల సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల నేరస్థులను, రౌడీ షీటర్లను ఆయా రెవెన్యూ అధికారుల ముందు బైండ్ ఓవర్ చేయాలని సూచించారు.

**నగదు పరిమితి**

సరైన ఆధారాలు లేకుండా ₹50,000 కంటే ఎక్కువ నగదును వెంట తీసుకువెళ్లరాదని, ఈ నిబంధన ఉల్లంఘిస్తే అట్టి మొత్తాన్ని సీజ్ చేయాలని సీపీ ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ సూచించారు. ఎన్నికల హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని, అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు కేటాయించే పోలీసు అధికారులకు అవసరమైతే శిక్షణ కూడా అందిస్తామని చెప్పారు.

దసరా, దుర్గా దేవి నిమజ్జనం బందోబస్తు

రానున్న దసరా పండుగ సందర్భంగా కమీషనరేట్ వ్యాప్తంగా రామ్ లీలా మైదానాలు, దేవి నిమజ్జనం కొరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు కమీషనర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున, రాజకీయ అల్లర్లు జరగకుండా నివారించడానికి అవసరమైన పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు.




## వినూత్న నిరసన.. కాంగ్రెస్ 'బాకీ కార్డు' విడుదల చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : రాష్ట్రంలో ఏ పల్లెకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని.. రోడ్లు వేయకుండా ఫ్యూచర్‌సిటీకి ఆరులేన్ల రహదారికి శంకుస్థాపన చేయటం విడ్డూరంగా ఉందని మాజీమంత్రి, భారత రాష్ట్ర సమితి సీనియర్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. ఆరుగ్యారంటీలకు టాటా చెప్పిన రేవంత్‌రెడ్డి విలువైన భూములను విక్రయిస్తూ లంకె బిందెల వేట సాగిస్తున్నారని విమర్శించారు. మార్పు.. మార్పు అంటూ రాష్ట్ర ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డును విడుదల చేసిన అనంతరం ఆయన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలవుతున్నా ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. మాటిమాటికీ మహిళలను కోటీశ్వరులను చేస్తానంటూ మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేతిలో మోసపోని వర్గమంటూ లేదని విమర్శించారు. తెలంగాణలో ఆరుగ్యారంటీలు అమలు చేస్తున్నామంటూ బిహార్ ప్రజలను కూడా రాహుల్‌గాంధీ మోసం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతీరైతుకు రూ.75 వేలు, ప్రతీ మహిళకు రూ.44 వేలు కాంగ్రెస్ బాకీ పడిందన్నారు. అధికారంలోకి వచ్చి 22 నెలలువుతున్నా ఒక్క హామీని నెరవేర్చలేదని, అదే విషయాన్ని కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ఎండగడతామన్నారు. రానున్న రోజుల్లో ఈ బాకీ కార్డే కాంగ్రెస్ పార్టీకి ఉరితాడు కాబోతుందన్నారు. ఇందుకోసం భారాస నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని, పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ప్రతీఇంటికీ ఈ కార్డును అందజేసి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను వివరించాలన్నారు. కార్డుపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లడగటానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలన్నారు. ఒక్కొక్కరికీ ఎంత బాకీ పడ్డారో ఇచ్చాకే కాంగ్రెస్ నాయకులు ఓట్లడగాలన్నారు.

# పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణ..

* **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
* **స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశమైన జిల్లా కలెక్టర్**



ఖమ్మం ప్రతినిది, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : సెప్టెంబర్ 30: ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థల (గ్రామ పంచాయతీలు, ఎంపిటిసి, జెడ్పిటిసి) ఎన్నికలను పారదర్శకంగా నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో స్థానిక సంస్థ ఎన్నికలను పారదర్శకంగా, ఎన్నికల నియమావళి ప్రకారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు, 5214 వార్డులు, 99 షెడ్యూల్డ్ ప్రాంతం గ్రామ పంచాయతీలు, 461 నాన్ షెడ్యూల్డ్ ప్రాంతం గ్రామ పంచాయతీలు ఉన్నాయనీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5214 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 737 కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, మండల గుర్తింపు ప్రకారం 20 జెడ్పీటీసీలు, 283 ఎంపీటీసీలు, 1580 ఎంపీటీసీ పోలింగ్ స్టేషన్లు, 593 ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 40 జోనల్ అధికారులు, 20 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు, 16 ఎస్.ఎస్.టి. టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జులై 10 నాటికి ఉన్న ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు 3,88,243, మహిళలు 4,14,425, ఇతరులు 22 మంది కలిపి మొత్తం 8,02,690 మందికి ఓటు వేయడానికి అవకాశం ఉందని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ మూడు విడతల్లో నిర్వహించనున్నామని, ప్రతి విడతలో ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా నామినేషన్, పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నుండి వెంటనే అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిపిఓ ఆశాలత, డివిజనల్ పంచాయతీ అధికారులు రాంబాబు, విజయలక్ష్మి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ నగర్‌లో దారుణం.. తల్లిని హతమార్చిన కుమార్తె

ఎస్ఆర్ నగర్, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. స్థానిక లీలానగర్ కాలనీలో ఓ కుమార్తె తన తల్లిని హతమార్చింది. ఇనుమ రాడ్డుతో కొట్టి హత్య చేసింది. సోమవారం రాత్రి ఈ ఘటన జగినట్లు తెలుస్తోంది. తల్లి లక్ష్మి (82), ఆమె కుమార్తె మాధవి (42) మధ్య సోమవారం రాత్రి గొడవ జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తురాలైన మాధవి.. తన తల్లిని కొట్టి చంపేసింది. వారిద్దరికీ మతిస్థిమితం లేదని స్థానికులు చెబుతున్నారు.

# ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్

కమలాపూర్, సెప్టెంబర్ 30 (భారత శక్తి ప్రతినిధి) : ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కోర్టులో చెల్లదని తెలిసికూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించి.. గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని ఆయన నివాసంలో భాజపా శ్రేణులతో ఈటల సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్లపై నమోదైన పలు



కేసులను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. “ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారు. కోర్టుకు వెళ్తే అభ్యంతరం ఏంటని నేను ప్రశ్నిస్తున్నా. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చుపెట్టొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోంది. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా.. రిజర్వేషన్ ప్రకటించారు. మా పార్టీ తరపున శాసనసభలో, కౌన్సిల్‌లో పూర్తి మద్దతిచ్చాం. అనుభవం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. మా మీద అనవసరంగా బురద చల్లొద్దు” అని ఈటల అన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.